బుధవారం 03.09.2025

INK OF TRUTH

# జర్నలిస్ట్ ఫైల్

తెలుగు దినపత్రిక

సంపుటి - 33 సంచిక - 139 www.journalistfile.com పేజీలు 8 వెల : రూ.5.00



జగన్ రైతుల సంక్షేమం గురించి మాట్లాడే అర్హుడు కాదు. కూటమి ప్రభుత్వం మద్దతు ధరలు కల్పించి రైతులకు అండగా నిలుస్తోంది. ఉల్లి మిర్చి, పొగాకు పంటలకు ఆదుకుంటోంది. యూరియా నిల్వలు సమృద్ధిగా ఉన్నాయి. రైతుల భవిష్యత్తు భద్రతే మా ప్రథమ కర్తవ్యం.

**ఆలపాటి రాజేంద్రప్రసాద్, ఎమ్మెల్సీ**






# ప్రతీ పోర్టుకూ కనెక్టివిటీ

## తూర్పు తీర మారిటైమ్ లాజిస్టిక్స్ గేట్ వేగా ఏపీ

## జల, వాయు, రోడ్డు, రైలు మార్గాలను అనుసంధానించేలా ఇంటిగ్రేటెడ్ లాజిస్టిక్స్ సిస్టం

## విశాఖలో జరిగిన ఈస్ట్ కోస్ట్ మారిటైమ్ లాజిస్టిక్స్ సమ్మిట్ లో ముఖ్యమంత్రి చంద్రబాబు

**అమరావతి(జర్నలిస్ట్ ఫైల్) :** తూర్పు తీర మారిటైమ్ లాజిస్టిక్స్ గేట్ వేగా ఏపీ మారుతుందని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు స్పష్టం చేశారు. ఉత్తరాది రాష్ట్రాలతో పాటు పొరుగు రాష్ట్రాలైన తెలంగాణా, మహారాష్ట్ర, చత్తీస్ ఘడ్, కర్ణాటక తదితర రాష్ట్రాల హింటర్ ల్యాండ్ కార్గోను కూడా ఏపీ పోర్టుల ద్వారా రవాణా చేసేలా కార్యాచరణ చేపడుతున్నామని వివరించారు. మంగళవారం విశాఖలో జీఎఫ్ఎస్టీ ఆధ్వర్యంలో జరిగిన ఈస్ట్ కోస్ట్ మారిటైమ్ లాజిస్టిక్స్ సమ్మిట్ కు సీఎం ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఏపీని లాజిస్టిక్స్ హబ్ గా తీర్చిదిద్దేందుకు కార్యాచరణ చేపడుతున్నామని సీఎం స్పష్టం చేశారు. మిగతా 2లో...

## అదనంగానే ఎరువుల నిల్వలు!



- ఎరువుల సరఫరాపై రైతులకు ఆందోళన పడొద్దు
- యూరియా బ్లాక్ మార్కెట్ చేస్తే కఠిన చర్యలు
- మార్క్ ఫెడ్ ద్వారా 2 లక్షల మెట్రిక్ టన్నుల యూరియా విక్రయాలు
- రసాయన ఎరువుల వినియోగంపై అన్నదాతలకు అవగాహన కల్పించాలి
- తక్కువ మొత్తంలో ఎరువులు, పురుగుమందుల వాడే రైతులకు సబ్సిడీలు
- కాఫీ తోటల తెగుళ్లపై తక్షణం చర్యలు చేపట్టాలి

3 లో

## రాజధాని ప్రాజెక్టులకు ఎస్పీవీ

**అర్బన్ డిజైన్లు, ఆర్కిటెక్చరల్ గైడ్ లైన్స్ నోటిఫికేషన్ కు ఆమోదం**

**కన్వెన్షన్ సెంటర్లకు భూమి ఇచ్చేందుకు అంగీకారం**

**సీఎం చంద్రబాబు నేతృత్వంలో 52వ సీఆర్డీఏ అథార్టీ సమావేశం**

2

## తగ్గిన విద్యుత్ కొనుగోళ్లు



**విద్యుత్ డిమాండ్ కు తగినట్లుగా ఉత్పత్తి**

**ఉత్పత్తికి తగిన బొగ్గు నిల్వలు సమకూర్చుకోండి**

**జెన్కో సమీక్షలో మంత్రి గొట్టిపాటి రవికుమార్**

**అమరావతి(జర్నలిస్ట్ ఫైల్) :** గృహ, పారిశ్రామిక అవసరాలకు తగినట్లుగా విద్యుత్ ఉత్పత్తి కొనసాగాలని, జెన్కో ప్లాంట్లలో సమర్థవంతమైన చర్యలు చేపట్టాలని ఇంధన శాఖ మంత్రి గొట్టిపాటి రవి కుమార్ అధికారులను ఆదేశించారు. మంగళవారం నాడు సచివాలయంలో ఏపీ జెన్కో అధికారులతో మంత్రి సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రాష్ట్రంలోని మూడు థర్మల్ ప్లాంట్లలో విద్యుత్ ఉత్పత్తి, రోజువారీ విద్యుత్ కొనుగోళ్ల పై ఆరా తీశారు. రాష్ట్ర వ్యాప్తంగా విద్యుత్ వినియోగానికి తగినట్లుగా విద్యుత్ ఉత్పత్తి చేస్తున్నామని అధికారులు మంత్రికి వివరించారు. అంతేగాకుండా గతంతో పోల్చితే రోజు వారి విద్యుత్ కొనుగోళ్లు తగ్గినట్లు తెలిపారు. ఏపీ జెన్కో-ఏపీపీడీసీఎల్ సంయుక్తంగా 2025 ఆగస్టు వరకు 16,000 మిలియన్ యూనిట్ల ఉత్పత్తి సాధించిన విషయాన్ని ఈ మేరకు అధికారులు మంత్రి దృష్టికి తీసుకొచ్చారు. ఇది గత ఏడాదితో పోలిస్తే 20.3 శాతం వృద్ధి సాధించామని పేర్కొన్నారు. మిగతా 2లో...

# సూపర్ సిక్స్ సూపర్ హిట్

- నాకు డైరెక్ట్ కాంటాక్ట్ తెలుగుదేశం పార్టీ కార్యకర్తలతోనే
- పులివెందులలో స్వేచ్ఛగా ఎన్నికలు జరిగితే జగన్ గెలిచే ప్రసక్తే ఉండదు
- వైసీపీ దుష్ప్రచారాన్ని సమర్థంగా తిప్పికొట్టాలి
- కమలాపురం నియోజకవర్గాన్ని అన్ని విధాల అభివృద్ధి చేస్తాం
- కడప జిల్లాను టీడీపీ కంచుకోటగా తీర్చిదిద్దాలి
- కొప్పర్తిలో కనీసం లక్ష మంది పనిచేసే విధంగా అభివృద్ధి చేస్తాం




**కమలాపురం (జర్నలిస్ట్ ఫైల్) :** సూపర్ సిక్స్ ను సూపర్ హిట్ చేసిన ఘనత తెలుగుదేశం పార్టీది అని, తనకు డైరెక్ట్ కాంటాక్ట్ తెలుగుదేశం పార్టీ కార్యకర్తలే అని విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేష్ పేర్కొన్నారు. కడప జిల్లా కమలాపురం నియోజకవర్గం బుగ్గలేటిపల్లిలో కమలాపురం నియోజకవర్గ టీడీపీ కార్యకర్తలు, నేతలతో సమన్వయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. యువగళంలో కార్యకర్తలు, ప్రజలు పడుతున్న ఇబ్బందులు నేరుగా చూశా. ఇవన్నీ తెలుసుకున్న తర్వాతనే బాబు సూపర్ సిక్స్ రూపొందించి సూపర్ హిట్ చేసిన ఘనత టీడీపీది. ఎత్తిన పసుపు జెండా దించకుండా టీడీపీకి కాపలా కాసిన ప్రతి కార్యకర్తకు శిరస్సు వంచి పాదాభివందనం చేస్తున్నా. నాకు అంజిరెడ్డి తాత, మంజులక్క, తోట చంద్రయ్య, చెన్నుపాటి గాంధీ గారే నాకు స్ఫూర్తి. మిగతా 2లో...

## నాణ్యమైన విద్య అందించాలి

**దేశంలోనే తొలిసారిగా సికె దిన్నె పాఠశాలలో స్మార్ట్ కిచెన్**

**స్మార్ట్ కిచెన్ ను ప్రారంభించిన మంత్రి లోకేష్**

**పనితీరును పరిశీలించి రాష్ట్రవ్యాప్తంగా అమలు**

**ఈసారి విద్యార్థులతోపాటు తనకు కూడా పరీక్షేనన్న మంత్రి**

**విద్యార్థులను కన్నబిడ్డల్లా భావించి నాణ్యమైన విద్య అందించాలని సూచన**

3 లో

## డ్వాక్రా గ్రూపులు దేశానికే ఆదర్శం

- వైద్యారోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్

**విజయవాడ(జర్నలిస్ట్ ఫైల్):** మహిళల స్వయం సమృద్ధికి ఏపీలోని స్వయంసహాయక సంఘాలు దేశానికే ఆదర్శమని వైద్యారోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ అన్నారు. దేశవ్యాప్తంగా ఉన్న ఎస్‌హెచ్‌జిల్లో 10 శాతం ఏపీలోనే ఉండటం గర్వకారణమని పేర్కొన్నారు. ఇబ్రహీం పట్నం, పెనుగంచిప్రోలు మండలాలు సంపూర్ణత అభియాన్‌లో వందశాతం ఫలితాలు సాధించడం ప్రశంసనీయమన్నారు. ఈ మండలాలను ఆదర్శ మండలాలుగా తీర్చిదిద్దాలని సూచించారు. జల్ జీవన్ మిషన్ అమలులో గత ప్రభుత్వం నిర్లక్ష్యం వహించడంతో ఏపీలో అభివృద్ధి



వెనకబడిందని మంత్రి సత్యకుమార్ యాదవ్ విమర్శించారు. కేంద్రం రూ. 26 వేల కోట్లు కేటాయించినా, అప్పటి ప్రభుత్వం తమ వాటా నిధులు ఇవ్వలేదని అన్నారు. విజయవాడ తుమ్మలపల్లి కళాక్షేత్రంలో జరిగిన మిగతా 2లో...

## వెన్నుపోటు ముద్ర జగన్‌కే సరి



**అమరావతి (జర్నలిస్ట్ ఫైల్):** “చంద్రబాబు నాయుడిపై వెన్నుపోటు అనే ముద్రను మోపడం రాజకీయ దుష్ప్రచారం తప్ప మరొకటి కాదు. అసలైన వెన్నుపోటుదారుడు జగన్ రెడ్డి, అసలైన ప్రొటెక్టర్ చంద్రబాబు” అని టిడిపి పొలిట్‌బ్యూరో సభ్యుడు వర్ల రామయ్య విమర్శించారు.

మంగళవారం టిడిపి కేంద్ర కార్యాలయం ఎన్టీఆర్ భవన్‌లో ఆయన మీడియా సమావేశం నిర్వహించారు. “ఆగస్టు సంక్షోభంలో ఎన్టీఆర్‌కు తిరిగి సీఎం పదవి తీసుకురావడమే కాదు, రాష్ట్రాన్ని అభివృద్ధి దిశగా నడిపించింది చంద్రబాబు తీసుకున్న అసాధారణ నిర్ణయాలే. సైబరాబాద్, శంషాబాద్ ఎయిర్‌పోర్ట్, మిగతా 2లో...

# రైతులందరికీ యూరియా

**అమరావతి(జర్నలిస్ట్ ఫైల్):** దేశంలోనే ప్రప్రథమంగా వాణిజ్య పంట రైతులను ఆదుకున్న ఘనత తమ ప్రభుత్వానికే దక్కుతుంది రాష్ట్ర వ్యవసాయ, సహకార, మార్కెటింగ్ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు తెలిపారు. ప్రత్యేకించి ఉల్లి రైతులు ఏమాత్రమూ ఆందోళన చెందాల్సిన పనిలేదని, ప్రభుత్వం ఇప్పటికే కనీస మద్దతు ధరను ప్రకటించి దాదాపు 580 మెట్రిక్ టన్నుల ఉల్లిని కొనుగోలు చేసి అన్ని రైతు బజార్లలో విక్రయాలను చేయడం మొదలు పెట్టిందన్నారు. యూరియా విషయంలో కూడా రైతులు ఏమాత్రము ఆందోళన చెందాల్సిన పనిలేదని, తగిన ప్రమాణంలో రైతులు అందరికీ పంపిణీ చేయడం జరుగుతుందని ఆయన తెలిపారు. మంగళవారం రాష్ట్ర సచివాలయం ప్రచార విభాగంలో ఆయన పాత్రికేయులతో మాట్లాడుతూ రాష్ట్ర ముఖ్యమంత్రి శ్రీ నారా చంద్రబాబు నాయుడు వ్యవసాయ అనుబంధ శాఖల అధికారులతో నేడు సమీక్షా సమావేశం నిర్వహించడం జరిగిందన్నారు. ఈ సమావేశంలో ముఖ్యంగా యూరియా పంపిణీ, ఉల్లి పంట కొనుగోలు, అరకు కాఫీ తోటలకు కొత్తగా వచ్చిన తెగుళ్ల నివారణపై సమగ్రంగా సమీక్షించి పలు ఆదేశాలను జారీ చేయడం జరిగిందని మంత్రి తెలిపారు. ఈ ఏడాది అదిక వర్షాల భయంతో కర్నూలు జిల్లాలో ఉల్లి




రైతులు 30 రోజుల ముందుగానే ఒకే సారి దాదాపు 5700 మెట్రిక్ టన్నుల ఉల్లిపంటను తీయడం వల్ల ధరలు పడిపోయాయని, ఈ సమస్యపై గత నెల 28వ తేదీన రాష్ట్ర ముఖ్యమంత్రి సమీక్షించి కనీస మద్దతు ధరను కిలో రూ. 12/- లను ప్రకటించి ఇప్పటి వరకూ దాదాపు 580 మెట్రిక్ టన్నుల ఉల్లిని కొనుగోలు చేయడం జరిగిందన్నారు. ఏ గ్రేడ్ తోపాటు లో గ్రేడ్ ఉల్లిని కూడా కొనుగోలు చేసి ఉల్లి రైతులను ఆదుకోవడం జరుగుచున్నదని, ఉల్లి రైతులు ఎవరూ ఆందోళన చెందాల్సిన పనిలేదన్నారు. మిగతా 2లో...

## నా తల్లిని అవమానించారు.. మోదీ ఆవేదన

**ఢిల్లీ(జర్నలిస్ట్ ఫైల్) :** బిహార్‌లో కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీనిర్వహించిన ‘ఓటర్ అధికార్ యాత్ర’లో కొందరు వ్యక్తులు ప్రధాని మోదీ తల్లిని దూషించారంటూ భాజపా ఇటీవల తీవ్ర ఆరోపణలు చేసిన సంగతి తెలిసిందే. దీనిపై తాజాగా మోదీ స్పందించారు. ఆర్జేడీ-కాంగ్రెస్‌లు నిర్వహించిన పలు సమావేశాల్లోను, వేదికల పైనా చనిపోయిన తన తల్లిని అవమానిస్తూ మాట్లాడారని, ఆమెకు అవమానం జరిగిందని ప్రధాని ఆవేదన వ్యక్తంచేశారు.

బిహార్ రాజ్య జీవికనిధి శాఖ సహాయ సంఘ్ లిమిటెడ్‌ను మోదీ వర్చువల్‌గా ప్రారంభించారు. అనంతరం దాదాపు 20 లక్షల మంది మహిళలను ఉద్దేశించి కాన్ఫరెన్స్‌లో మాట్లాడారు. మిగతా 2లో...



## రికార్డు స్థాయిలో ఎరువుల కేటాయింపు

**ఏపీకి అదనంగా మరో 53 వేల మెట్రిక్ టన్నుల యూరియా**

**ఖరీఫ్ లో 5.65 లక్షల మెట్రిక్ టన్నుల యూరియా సరఫరా**

**రబీకి 9 లక్షల మెట్రిక్ టన్నుల యూరియాను సిద్ధం చేస్తున్న రాష్ట్ర ప్రభుత్వం**

3

## ప్రతిపక్ష హెూదా అడుక్కుంటే రాదు

**నెల్లూరు (జర్నలిస్ట్ ఫైల్):** ప్రతిపక్ష హెూదా అడుక్కుంటే రాదని, ప్రజలే ఇవ్వాలని టీడీపీ సీనియర్ నేత, సర్వేపల్లి ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి వ్యాఖ్యానించారు. మంగళవారం నెల్లూరులో మీడియాతో మాట్లాడిన ఆయన, వైసీపీ పాలనలో రాష్ట్రం సర్వనాశనమైందని విమర్శించారు.



“పులివెందుల జెడ్పీటీసీ కూడా గెలిపించుకోలేని జగన్ రెడ్డి.. తనను కలవాలంటే ప్రజలకు ఎంట్రీ పాస్ ఉండాలని చెబుతున్నారు. ఇది నియంత పోకడ కాదా? సొంత నియోజకవర్గ ప్రజలు కూడా కలవాలంటే పాస్ కావాలన్న పరిస్థితి జగన్ పాలనలోనే వచ్చింది” అని ఎద్దేవా చేశారు.

గతంలో అన్ని శాఖల్లో మంత్రిగా ఉన్న సజ్జల వ్యాఖ్యలు హాస్యాస్పదమని అన్నారు. “వైసీపీ దమ్ము, ధైర్యం ఉంటే ప్రజలే ఇచ్చే ప్రతిపక్ష హెూదా కోసం వేచి చూడాలి. ఏడాది మూడు నెలలుగా అదే డిమాండ్ చేస్తూ అడుగుతున్న పరిస్థితి వారిది” అని చురకలు వేశారు.

“ఐదేళ్లు దరిద్రం పట్టించి రాష్ట్రాన్ని సర్వనాశనం చేశారు. కానీ కూటమి పాలనలో మేం ఎక్కడికి వెళ్లినా ప్రజలు సాదరంగా ఆహ్వానిస్తున్నారు. అమ్మఒడి కింద మీరు ఒక బిడ్డకు ఇస్తే, మేం తల్లికి వందనం కింద అన్ని పిల్లలకు సహాయం చేస్తున్నాం. రైతు భరోసా పేరుతో మీరు ?7,500 ఇస్తే, మేం అన్నదాత సుఖీభవగా ?13,500 ఇస్తున్నాం. స్త్రీశక్తి పథకం ద్వారా మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం కల్పించాం. మిగతా 2లో...

# డ్వాక్రా గ్రూపులు దేశానికే ఆదర్శం



(మొదటి పేజీ తరువాయి)

సంపూర్ణత అభియాన్ సత్కార కార్యక్రమంలో మంత్రి సత్యకుమార్ యాదవ్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఎంపీ కేశినేని శివనాథ్, కలెక్టర్ లక్ష్మీ శా, 20 సూత్రాల అమలు కమిటీ చైర్మన్ లంకా దినకర్ అతిథులుగా హాజరయ్యారు. ఎన్టీఆర్ జిల్లాలో ఆకాంక్షిత మండలాలుగా ఎంపికైన ఇబ్రహీంపట్నం, పెనుగంచిప్రోలు మండలాలు నీతి అయోగ్ నిర్దేశించిన 40 అంశాల్లో 6 కీలక అంశాల్లో వంద శాతం ఫలితాలు సాధించాయి. వీటిని ఆదర్శ మండలాలుగా తీర్చిదిద్దాలని మంత్రి పిలుపునిచ్చారు. కేవలం ఆరు అంశాల్లోనే కాక మిగతా అన్ని అంశాల్లో కూడా ప్రగతి సాధించాలని సూచించారు.

2018లో 112 జిల్లాలు, 500 మండలాల్లో సంపూర్ణత అభియాన్ కార్యక్రమానికి శ్రీకారం చుట్టినట్టు గుర్తు చేశారు. కేంద్రంతో పాటు రాష్ట్రాలు సమానంగా పనిచేస్తేనే సమగ్రాభివృద్ధి సాధ్యమని చెప్పారు. ఏపీ ప్రభుత్వం అదే దిశగా కృషి చేస్తోందని అన్నారు.

జల్ జీవన్ మిషన్ పథకాన్ని గత ప్రభుత్వం విస్మరించిందని మంత్రి విమర్శించారు. కేంద్రం రూ. 26 వేల కోట్లు కేటాయించినా, రాష్ట్రం తన వంతు 50 శాతం నిధులు ఇవ్వకపోవడంతో ఏపీలో పథకం తీవ్రంగా వెనుకబడిపోయిందని తెలిపారు. 2019లో ప్రారంభమైన ఈ పథకం 3.20 కోట్ల ఇళ్లకు నీరు అందించగా, ప్రస్తుతం దేశవ్యాప్తంగా 15 కోట్ల ఇళ్లకు చేరుకుందని వివరించారు. మహిళల స్వయం సమృద్ధి కోసం స్వయం సహాయ సంఘాల రూపకల్పనలో చంద్రబాబు చేసిన కృషిని ప్రస్తావించారు. దేశంలోని ఎస్‌హెచ్‌జిల్లో 10 శాతం ఏపీలోనే ఉండడం గమనార్హమని అన్నారు.

# ప్రతీ పోర్టుకూ కనెక్టివిటీ

(మొదటి పేజీ తరువాయి)

ఈస్ట్ కోస్టు గేట్ వేగా ఏపీ అత్యుత్తమ ప్రదేశమని అన్నారు. సదస్సు కంటే ముందు మారిటైమ్ లాజిస్టిక్స్ అభివృద్ధిపై దేశవ్యాప్తంగా వివిధ పోర్టులు, కార్గో హ్యాండ్లింగ్ కంపెనీలకు చెందిన 62 మంది సీఈఓలతో ముఖ్యమంత్రి సమావేశమయ్యారు. రాష్ట్రంలో మారిటైమ్ లాజిస్టిక్స్ రంగంలో ఉన్న అవకాశాలు, పోర్టు కార్గో హ్యాండ్లిగ్ లో మౌలిక సదుపాయాల కల్పన, రోడ్డు, రైలు కనెక్టివిటి, ఓడరేవుల్లో టెర్మినల్ల ఆధునీకరణ, షిప్ బిల్డింగ్, మారిటైమ్ లాజిస్టిక్స్ లో అంతర్జాతీయంగా అనుసరిస్తున్న ప్రమాణాలతో పాటు వివిధ అంశాలను ప్రతిపాదించారు. ప్రస్తుతం రాష్ట్రంలోని వివిధ పోర్టుల ద్వారా 69 మిలియన్ టన్నుల మేర ఇనుప ఖనిజం, 11 మిలియన్ టన్నుల బొగ్గు, 5.5 మిలియన్ టన్నుల ఎరువుల రవాణా జరుగుతోందని సీఎం తెలిపారు. బల్క్ కార్గో రవాణాకు భారీ నౌకలు రాకపోకలు సాగించేలా 18 మీటర్ల లోతైన ఓడరేవులు తూర్పుతీరంలో ఏపీ మినహా మరెక్కడా లేవన్నారు. సముద్ర రవాణా పరంగా ఏపీ దేశంలోనే రెండో స్థానంలో ఉందన్నారు. పోర్టులకు అనుసంధానంగా మూడు పారిశ్రామిక కారిడార్లు కూడా ఏపీలో ఉన్నాయని తెలిపారు. పొరుగు రాష్ట్రం తెలంగాణా డ్రైపోర్టును ఏర్పాటు చేసి మచిలీపట్నం ద్వారా కార్గో రవాణా చేయాలని భావిస్తోందని అన్నారు. గోదావరి నది ద్వారా అంతర్గత జల రవాణా మార్గాలతో మహారాష్ట్ర, కర్ణాటక కూడా ఏపీలోని కొన్ని పోర్టుల ద్వారా సరకు రవాణా చేయాలని భావిస్తున్నట్టు సీఎం స్పష్టం చేశారు. ఇవన్నీ ఏపీకి ఉన్న సానుకూలతలని తెలిపారు.

**ప్రతీ పోర్టుకు కనెక్టివిటీ మాస్టర్ ప్లాన్ :** పోర్టులు, ఎయిర్ పోర్టులు, రహదారులు, రైలు మార్గాలను అనుసంధానించి ఇంటిగ్రేటెడ్ లాజిస్టిక్స్ వ్యవస్థను రూపొందిస్తామని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు. వీటితో పాటు అంతర్గత జలరవాణా మార్గాలను కూడా అభివృద్ధి చేస్తామని వెల్లడించారు. గోదావరి, కృష్ణా నదుల ప్రవాహ మార్గాల్లో దాదాపు 1500 కిలోమీటర్ల మేర జల రవాణా మార్గాలను వినియోగించుకునేందుకు అవకాశం ఉందన్నారు. కాకినాడ-చెన్నైల మధ్య పురాతనమైన బకింగ్ హామ్ కెనాల్ రవాణా మార్గాన్ని పునరుద్ధరిస్తామని సీఎం తెలిపారు. ఈ రవాణా మార్గాలను అనుసంధానించటం ద్వారా అతి తక్కువ రవాణా వ్యయం సాధించేందుకు ఆస్కారం ఉంటుందన్నారు. రాష్ట్రంలో ప్రస్తుతం ఆపరేషనల్ గా ఉన్న పోర్టులు, కొత్తగా అందుబాటులోకి రానున్న పోర్టులతో రహదారులు, రైలు మార్గాలు, అంతర్గత జలరవాణా, ఎయిర్ కార్గో మార్గాలను అనుసంధానించేలా ప్రతీ పోర్టుకూ కనెక్టివిటి మాస్టర్ ప్లాన్ రూపొందిస్తామని సీఎం వెల్లడించారు. రవాణా పరమైన అంశాలను నిర్వహించేందుకు వీలుగా ఏపీలో త్వరలోనే లాజిస్టిక్స్ కార్పోరేషన్ ఏర్పాటు చేస్తున్నామని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు. తక్కువ వ్యయంతోనే రైలు, రోడ్డు మార్గాలను పోర్టులకు అనుసంధానించే అవకాశం ఉందని తెలిపారు.

**పోర్టు ఆధారిత ఆర్థిక వ్యవస్థ :** పోర్టులకు అనుసంధానంగా పారిశ్రామిక కార్యకలాపాలతో పాటు టౌన్ షిప్ లను కూడా ఏర్పాటు చేసేలా ప్రణాళికలు రూపొందిస్తున్నామని సీఎం వివరించారు. మూలపేట, మచిలీపట్నం, కాకినాడ, రామాయపట్నం ఇలా వివిధ పోర్టుల వద్ద పరిశ్రమల ఏర్పాటు, టౌన్ షిప్ ల కోసం 10 వేల ఎకరాల భూమి కూడా అందుబాటులో ఉందన్నారు. ఆర్థిక వ్యవస్థతో పాటు ఈ రంగాల్లో నైపుణ్యాలు, ఉద్యోగ అవకాశాలు మెరుగయ్యేలా లాజిస్టిక్స్ యూనివర్సిటీ, సివిల్ ఏవియేషన్ యూనివర్సిటీలు కూడా త్వరలో ఏర్పాటు అవుతాయని సీఎం తెలిపారు. విశాఖ, అమరావతి, తిరుపతి సహా రాష్ట్రంలోని వేర్వేరు ప్రాంతాల నుంచి ఎయిర్ కార్గో రవాణాకు కూడా అనువుగా ఏర్పాట్లు చేస్తామన్నారు. మొత్తంగా జీఎస్డీపీలో లాజిస్టిక్స్ రంగం 3 శాతానికి పెంచుకునేందుకు అవకాశం ఉందన్నారు. దుగరాజపట్నం సహా వివిధ ప్రాంతాల్లో షిప్ బిల్డింగ్ యూనిట్లు, మరమ్మత్తులు, కంటైనర్లు, షిప్ రీసైక్లింగ్ లాంటి పరిశ్రమల ఏర్పాటుకు అవకాశముందని సీఎం స్పష్టం చేశారు. మారిటైమ్ లాజిస్టిక్స్ కు సంబంధించి 15-20 మంది పారిశ్రామిక వేత్తలతో కూడిన సలహా బోర్డును కూడా ఏర్పాటు చేయనున్నట్టు ముఖ్యమంత్రి ప్రకటించారు. అంతకు ముందు మారిటైమ్ రంగంలోని ఆరు స్టార్టప్ కంపెనీలు ఏర్పాటు చేసిన స్టాళ్లను సీఎం పరిశీలించారు. ఎయిర్ కార్గో ఫోరం ఆఫ్ ఇండియా ఏపీ చాప్టర్ ను సీఎం ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో మంత్రులు బీసీ జనార్ధన్ రెడ్డి, డీబీవీ స్వామి, మారిటైమ్ బోర్డు ఛైర్మన్ దామచర్ల సత్య, ఆ సంస్థ అధికారులు, జీఎఫ్-ఎస్టీ వైస్ ఛైర్మన్ ఎస్.పి. టక్కర్ తదితరులు హాజరయ్యారు.




# వెన్నుపోటు ముద్ర జగన్‌కే సరి

(మొదటి పేజీ తరువాయి)

రింగ్ రోడ్- ఇవన్నీ ఆయన ప్రొటెక్టివ్ నిర్ణయాల ఫలితం" అని వివరించారు. "జగన్ రెడ్డి తండ్రి శవం ఇంటికి రాకముందే సంతకాలు సేకరించిన వాడే. తల్లి, చెల్లి, బాబాయికే వెన్నుపోటు పొడిచిన వాడే. అక్రమ సంపాదనలతో ప్రజల వెన్నుపోటు పొడిచిన వాడే. నిజమైన వెన్నుపోటుదారుడు జగనే" అని ఆరోపించారు.

"చంద్రబాబు వెన్నుపోటుదారుడని ఎవరైనా చెబితే, నేను సిద్ధంగా ఉన్నా.. ఓపెన్ డిబేట్‌కి రావాలి. ఎవరు అసలు వెన్నుపోటుదారుడో ప్రజల ముందు తేల్చుకుందాం" అని వర్ల సవాల్ విసిరారు.

# తగ్గిన విద్యుత్ కొనుగోళ్లు



(మొదటి పేజీ తరువాయి)

దీనిపై స్పందించిన మంత్రి రికార్డు స్థాయి విద్యుత్ ఉత్పత్తి చేయడంపై మంత్రి గొట్టిపాటి హర్షం వ్యక్తం చేశారు. గత రెండు దశాబ్దాల్లో తొలిసారి శ్రీశైలం హైడల్ పవర్ స్టేషన్ 1,000 మిలియన్ యూనిట్ల ఉత్పత్తి మైలురాయిని చేరడంపై అధికారులను అభినందించారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు దార్శనిక పాలనలో ఆంధ్రప్రదేశ్ పునరుత్పాదక విద్యుత్ రంగం అభివృద్ధిలో ముందంజ వేస్తోందని పేర్కొన్నారు. కేవలం ఏడాది కాలంలోనే జల విద్యుత్ ఉత్పత్తి 36% మేర ఉత్పత్తి సాధించడం భవిష్యత్తు అవసరాలను తీరుస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు.

సమీక్షలో భాగంగా పోలవరం జలవిద్యుత్ ప్రాజెక్టు, దిగువ సీలేరు రెండు యూనిట్లు, ఎగువ సీలేరు పంప్డ్ స్టోరేజ్ ప్రాజెక్టు పురోగతిపై మంత్రి అడిగి తెలుసుకున్నారు. అదే విధంగా ఎన్టీటీపీఎస్ స్టేజ్ -5, ఆర్టీపీఎస్ స్టేజ్-4 విస్తరణ పనుల పురోగతి పై కూడా మంత్రి వాకబు చేశారు. ఎన్టీటీపీఎస్ స్టేజ్ -5, ఆర్టీపీఎస్ స్టేజ్ -4 విస్తరణ పనులను త్వరితగతిన పూర్తి చేయాలని అధికారులను మంత్రి గొట్టిపాటి ఆదేశించారు. విద్యుత్ ఉత్పత్తి స్థిరత్వం కోసం ముందుగానే తగిన బొగ్గు నిల్వలు సమకూర్చుకోవాలని, సరఫరాదారులతో సమన్వయం చేసుకుని రైల్వే కనెక్టివిటీని పెంచాలని సూచించారు. అంతేగాకుండా బొగ్గు హ్యాండ్లింగ్ సిస్టమ్స్‌ను మెరుగుపరచాలని మంత్రి ఆదేశించారు. ఈ సమీక్షసమావేశంలో ఏపీజెన్కో ఎండీ కేవీఎన్ చక్రధర్ బాబు, జెన్కో డైరెక్టర్లు ఎం. సుజయ్ కుమార్, పీ. అశోక్ కుమార్ రెడ్డి, వి. ఉష, ఏపీపీడీసీఎల్ డైరెక్టర్ శ్రీనివాసరావుతో పాటు పలు ఇంధన శాఖ ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

# సూపర్ సిక్స్ సూపర్ హిట్

(మొదటి పేజీ తరువాయి)



**నాకు డైరెక్ట్ కాంటాక్ట్ తెలుగుదేశం పార్టీ కార్యకర్తలతోనే :** నాకు వేరే వాళ్లతో పనిలేదు. నాకు డైరెక్ట్ కాంటాక్ట్ తెలుగుదేశం పార్టీ కార్యకర్తలతోనే. అందుకే ఎన్ని పనులున్నా కార్యకర్తలతో సమావేశం అవుతున్నాను. వారి సమస్యలు తెలుసుకుని పరిష్కరిస్తున్నా. కడప జిల్లాలో అత్యధిక సీట్లు గెలిచి చరిత్ర సృష్టించారు. దీని వెనుక కార్యకర్తల శ్రమ ఉంది. పులివెందుల ఎమ్మెల్యేకు దిమ్మతిరిగే విధంగా దెబ్బకొట్టింది టీడీపీ కార్యకర్తలు, కడప ప్రజలు. ఆ దెబ్బ అహంకారానికి వ్యతిరేకం, కుటుంబ పాలనకు వ్యతిరేకం. మాధవీ రెడ్డి గారు భారీ మెజార్టీతో గెలిచారు. ఎమ్మెల్యే చైతన్య రెడ్డి బాగా కష్టపడ్డారు. పెద్దాయన కూడా కష్టపడ్డారు. కార్యకర్తలు అహర్నిశలు కష్టపడ్డారు. వైసీపీ నేతలు మహిళలను అవమానించారు. మా అమ్మగారిని కూడా అవమానించారు. అయినా తగ్గేదేలే అని చెప్పా.

**పులివెందులలో స్వేచ్ఛగా ఎన్నికలు జరిగితే జగన్ గెలిచే ప్రసక్తే ఉండదు :** అహర్నిశలు ప్రజలకు అందుబాటులో ఉండి వారి సమస్యలు తెలుసుకోవాలి. ప్రజలతో మమేకం కావాలి. ఇప్పటి నుంచే కష్టపడాలి. కార్యకర్తలు, నేతలు అలక వీడాలి. సమస్యలు ఏమైనా ఉంటే మనమే చర్చించుకుని పరిష్కరించుకోవాలి. పులివెందుల ఎమ్మెల్యేకు చాలా రోజుల తర్వాత ప్రజలు గుర్తుకువచ్చారు. చంద్రబాబు బయటకు రావాలంటే గేట్లకు తాళ్లు కట్టారు. సొంత కార్యకర్తలను పొట్టనపెట్టుకున్న వ్యక్తి జగన్ రెడ్డి. జడ్పీటీసీ ఎన్నికల్లో డిపాజిట్ రాని పరిస్థితి. పులివెందులలో స్వేచ్ఛగా ఎన్నికలు జరిగితే, అందరూ కష్టపడితే జగన్ అనే వ్యక్తి గెలిచే ప్రసక్తే ఉండదు. జగన్ ఇప్పుడు బయటకు వస్తున్నారు. ఉల్లికి మద్దతు ధర కోసం చంద్రబాబు గారు క్వింటాలుకు రూ.1200 మద్దతు ధర ఇచ్చి కొనుగోలు చేయాలని మొన్ననే చెప్పారు. జగన్ రెడ్డికి ఇప్పుడు గుర్తుకువచ్చింది. ఉల్లిగడ్డకు, ఆలుగడ్డకు తేడా తెలియని వ్యక్తి జగన్ రెడ్డి. హెరిటేజ్ స్టోర్ లు విక్రయించి ఎనిమిదేళ్లు అవుతుంది. ఈ విషయం కూడా తెలియదు.

**కొప్పర్తిలో కనీసం లక్ష మంది పనిచేసే విధంగా అభివృద్ధి చేస్తాం :** పెన్షన్ ను రూ. 200 నుంచి రూ. 2వేలు, 3వేలను ఒకే సంతకంతో నాలుగు వేలు చేసింది టీడీపీ. దివ్యాంగులకు పెన్షన్ రూ. 6వేలు చేశాం. ఏడాదికి 72వేలు చెల్లిస్తున్నాం. మంచానికే పరిమితమైన వారికి దేశంలో ఎక్కడా లేనివిధంగా రూ. 15వేలు చెల్లిస్తున్నాం. అన్నా క్యాంటీన్లు తిరిగి ప్రారంభించాం. అన్నదాత సుఖీభవ, స్త్రీ శక్తి పథకాలను అమలుచేస్తున్నాం. ఇచ్చిన హామీలను నెరవేర్చాం. యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పిస్తున్నాం. కొప్పర్తిలో నేడు రెండు కంపెనీలు ప్రారంభించాం. కొప్పర్తిలో కనీసం లక్ష మంది పనిచేసే విధంగా అభివృద్ధి చేసి కంపెనీలు తీసుకువస్తాం. రైతులు పిల్లల భవిష్యత్ కోసం భూములు ఇచ్చారు. ఎలక్ట్రానిక్స్, ఇతర సంస్థలను తీసుకువచ్చే బాధ్యత మేం తీసుకుంటాం. పక్కనే కడప ఎయిర్ పోర్ట్, ఇతర మౌలిక సౌకర్యాలు ఉన్నాయి. ఇంత అద్భుతమైన ఇండస్ట్రియల్ పార్క్ దేశంలో ఎక్కడా లేదు. అందుకే పెట్టుబడులు తీసుకువచ్చే బాధ్యత నేను తీసుకుంటా.

**వైసీపీ దుష్ప్రచారాన్ని సమర్థంగా తిప్పికొట్టాలి :** సంక్షేమం, అభివృద్ధితో పాటు రాజకీయం కూడా చేయాలి. అధికారంలో ఉన్నా ప్రతిపక్షంలో ఉన్నట్టే వ్యవహరించాలి. ప్రతిపక్షం దుష్ప్రచారాన్ని సమర్థంగా తిప్పికొట్టాలి. సొంత బాబాయిని చంపి నెపం చంద్రబాబు గారిపై వేశారు. సొంత చెల్లి సునీత న్యాయం కోసం పోరాడే పరిస్థితి. ఆస్తి కోసం సొంత చెల్లిని మెడపట్టి బయటకు గెంటేశారు. ఇవన్నీ మనం మాట్లాడాలి. మనం ఏనాడూ హత్యా రాజకీయాలను ప్రోత్సహించలేదు. ఫ్యాక్షన్ ను ఏనాడూ టీడీపీ ప్రోత్సహించలేదు. దీనిని ప్రజల్లోకి తీసుకెళ్లాలి. ఒక అబద్ధాన్ని పదేపదే చెప్పి నిజం చేసే కుట్రలకు పాల్పడుతున్నారు. పెట్టుబడులను అడ్డుకునేందుకు సింగపూర్ కు కుట్రపూరితంగా మెయిల్స్ పంపారు. ఏ ఆశయంతో ప్రజలను మనల్ని గెలిపించారో దానిని నెరవేర్చాలి.

**కడప జిల్లాను టీడీపీ కంచుకోటగా తీర్చిదిద్దాలి :** కార్యకర్తలు, నేతలు అహంకారం వీడాలి. కలిసికట్టుగా పనిచేయాలి. కడప జిల్లాను టీడీపీ కంచుకోటగా తీర్చిదిద్దాలి. కమలాపురం నియోజకవర్గాన్ని అన్నివిధాల అభివృద్ధి చేస్తాం. రెడ్ బుక్ తన పని తాను చేస్తోంది. నేను ఏదీ మర్చిపోలేదు. నందం సుబ్బయ్య, తోట చంద్రయ్యను చంపింది మర్చిపోతానా? చంద్రబాబు గారిని 53 రోజులు అక్రమంగా జైలులో బంధిస్తే కొడుకుగా నేను మర్చిపోతానా? తప్పు చేసిన వారిని చట్ట ప్రకారం శిక్షిస్తామని చెప్పారు.



# రైతులందరికీ యూరియా

(మొదటి పేజీ తరువాయి)

అదే విధంగా యూరియా విషయంలో కూడా రైతులు ఏమాత్రము ఆందోళన చెందాల్సిన పనిలేదని మంత్రి విజ్ఞప్తి చేశారు. దాదాపు 22 లక్షల హెక్టార్లలో ఖరీఫ్ సాగు ప్రారంభమైందని మరియు బఫర్ స్టాక్ తో కలిపి 6.59 లక్షల టన్నుల యూరియా అందులో ఉందని, ఇప్పటివరకు 5.64 లక్షల టన్నుల యూరియా పంపిణీ జరిగిందన్నారు. గతంలో 50:50 రేషియాలో కేటాయించే విదానానికి బదులుగా మన రాష్ట్రానికి వచ్చే యూరియాలో 70 శాతం మార్కుఫెడ్ ద్వారా రైతులకు అందజేయాలని మిగిలిన 30 శాతం ప్రైవేటు డీలర్లకు కేటాయించాలని ముఖ్యమంత్రి ఆదేశించారన్నారు. ఈ విదానాన్ని అనుసరిస్తూ అన్ని ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాలు, రైతు సేవా కేంద్రాలు మరియు ప్రైవేటు డీలర్ల ద్వారా రైతులకు అవసరమైన యూరియాను తగిన ప్రమాణంలో పంపిణీ చేయడం జరుగుతుందని మంత్రి తెలిపారు.

అరకు కాఫీకి అంతర్జాతీయ గుర్తింపు ఉందని, అయితే దాదాపు 20 ఎకరాల్లో అరకు కాఫీ తోటలకు కొత్తగా తెగులు సోకిందని, ఈ తెలుగు మరింత సోక కుండా ఈ పంటను వెంటనే నాశనం చేసి సంబంధిత రైతులకు నష్టపరిహారాన్ని అందజేయాలని రాష్ట్ర ముఖ్యమంత్రి ఆదేశించినట్లు మంత్రి తెలిపారు.

అదే విధంగా దేశంలో ఎక్కడా లేని విధంగా మిర్చి, కోకో, నల్లబెర్లి, మామిడి తదితర వాణిజ్య పంటల విషయంలో కూడా ప్రభుత్వం కనీస మద్దతను ప్రకటించి ఆయా రైతులను ఆదుకోవడం జరిగిందన్నారు. మిర్చి పంట విషయంలో రాష్ట్ర ముఖ్యమంత్రి నేరుగా కేంద్ర వ్యవసాయ మంత్రితో మాట్లాడి మిర్చి రైతులను ఆదుకోవడం జరిగిందన్నారు. ఇప్పటి వరకూ దాదాపు రూ. 54 కోట్లను నల్లబెర్లి రైతుల ఖాతాల్లోకి జమ చేయడం జరిగిందని, మరో రూ. 59 కోట్లను జమచేయడం జరుగుతుందని మంత్రి తెలిపారు. అదే విధంగా చిత్తూరు జిల్లాలో మామిడి రైతులను కూడా ఆదుకోవడం జరిగిందని, కోకో విషయంలో కూడా కేజీకి 50 పైసలు చొప్పున కొంత మేరకు రైతులకు సహాయం అందజేయడం జరిగిందని మంత్రి తెలిపారు.

తమ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన స్వల్ప కాలంలోనే అన్ని వర్గాలకు చెందిన రైతులను ఆదుకోవడం జరుగుతుంటే, ప్రతిపక్ష పార్టీకి చెందిన ప్రతినిధులు అవగాహన లేకుండా ఇష్టానుసారం మాట్లాడుతూ రైతుల విషయంలో మొసలికన్నీరు కారుస్తుందన్న విషయాన్ని రాష్ట్ర లోని రైతులు అందరూ గుర్తించాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

రాష్ట్ర వ్యవసాయ శాఖ సంచాలకులు ఢిల్లీరావు ఈ సమావేశంలో పాల్గొన్నారు.

# ప్రతిపక్ష హోదా అడుక్కుంటే రాదు

(మొదటి పేజీ తరువాయి)

దీపం పథకంతో ఏడాదికి మూడు గ్యాస్ సిలిండర్లు ఉచితంగా ఇస్తున్నాం. దళితులు, గిరిజనులకు కూటమి ప్రభుత్వం ?2.55 లక్షలతో ఇళ్లు నిర్మిస్తోంది" అని వివరించారు.

"సొంత చిన్నాయనపై గొడ్డలి పోటు వేసిన మీరు, మా నాయకుడు చంద్రబాబు నాయుడు గురించి మాట్లాడటం తగదు. అప్పట్లో ఓ మహిళ ప్రభావం నుంచి పార్టీని కాపాడుకునేందుకు ప్రజాస్వామ్యపద్ధతిలోనే చంద్రబాబును ఎన్నుకున్నాం. ఆయనపై వెన్నుపోటు ఆరోపణలు నిజం అయితే ప్రజలు ఈరోజు కూడా ఆయనకు మద్దతు ఇస్తారా?" అని ప్రశ్నించారు.

# నా తల్లిని అవమానించారు.. మోదీ ఆవేదన

(మొదటి పేజీ తరువాయి)

కొన్నిరోజుల క్రితం బిహార్‌లో ఆర్జేడీ- కాంగ్రెస్‌ల వేదికపై తన తల్లిని ఉద్దేశిస్తూ కొందరు అభ్యంతరకరమైన వ్యాఖ్యలు చేశారన్నారు. ఈ వ్యాఖ్యలు కేవలం తన తల్లికి జరిగిన అవమానం మాత్రమే కాదని, దేశంలోని తల్లులు, సోదరీమణులకు జరిగిన అవమానమన్నారు. ఇవి తనను ఎంతో బాధించాయని మోదీ పేర్కొన్నారు. బిహార్ ప్రజలు కూడా తనలాగే బాధ పడ్డారనే విషయం కూడా తెలుసన్నారు.

దివంగత మాతృమూర్తి హీరాబెన్ మోదీ తనను, తోబుట్టువులను పెంచేందుకు ఎంతో కష్టపడ్డారన్నారు. 'అమ్మ అనారోగ్యంతో ఉండేది. అయినా మమ్మల్ని పెంచేందుకు పనిచేస్తూనే ఉండేది. మాకు దుస్తులు కొనేందుకు ప్రతి పైసా ఆదా చేసేది. మన దేశంలో అలాంటి తల్లులు కోట్లాది మంది ఉన్నారు. దేవతల కంటే తల్లి స్థానం చాలా గొప్పది' అని మోదీ పేర్కొన్నారు. ఈసందర్భంగా రాజ కుటుంబాల్లో పుట్టిన యువరాజులు.. పేద తల్లి బాధలు, ఆమె కుమారుడు చేసే పోరాటాలను అర్థం చేసుకోలేరంటూ రాహుల్, ఆర్జేడీ నేత తేజస్వీ యాదవ్‌లను ఉద్దేశిస్తూ విమర్శించారు. వారంతా గోల్డెన్‌స్పూన్‌తో పుట్టారని, బిహార్‌లో అధికారం తమ కుటుంబాలకే దక్కాలనే స్వార్థంతో ఉన్నారని విమర్శించారు. ప్రజలు ఈ పేద తల్లి కుమారుడిని ఆశీర్వదించి, ప్రధానిని చేశారన్నారు. దీన్నినామ్‌దార్లు జీర్ణించుకోలేకపోతున్నారని మండిపడ్డారు.

బిహార్‌లో ఇటీవల కాంగ్రెస్ నిర్వహించిన ఓ సభలో కొందరు కాంగ్రెస్ కార్యకర్తలు మోదీ, ఆయన తల్లిని దూషిస్తూ వ్యాఖ్యలు చేశారని భాజపా ఆరోపించింది. దీనికి సంబంధించి పార్టీ నేతలు పట్నాలోని కొత్వాలి పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు కూడా చేశారు. ఈమేరకు ఓ వ్యక్తిని అరెస్టు చేశారు. ఈ వ్యాఖ్యలపై కేంద్ర హోంమంత్రి అమిత్‌షా ఇటీవల మాట్లాడుతూ.. దీనిపై రాహుల్ క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు.

# రాజధాని ప్రాజెక్టులకు ఎస్పీవీ

**అమరావతి(జర్నలిస్ట్ ఫైల్):** రాజధానిలో కీలక నిర్మాణాలను త్వరితగతిన పూర్తి చేసేలా దృష్టి సారించాలని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అధికారులను ఆదేశించారు. మంగళవారం సీఎం క్యాంప్ కార్యాలయంలో ముఖ్యమంత్రి నేతృత్వంలో 52వ సీఆర్డీఏ అథార్టీ సమావేశం జరిగింది. ఏడు అంశాలకు ఈ సమావేశంలో ఆమోదం లభించింది. రాజధాని పరిధిలో చేపట్టే కీలక ప్రాజెక్టులు కార్యరూపం దాల్చేలా స్పెషల్ పర్పస్ వెహికల్ ఏర్పాటుకు ఆమోదం తెలిపింది. గ్రీన్ ఫీల్డ్ ఎయిర్ పోర్టు, ఎన్టీఆర్ విగ్రహం ఏర్పాటు, స్మార్ట్ ఇండస్ట్రీస్, ఐకానిక్ బ్రిడ్జ్, స్పోర్ట్స్ సిటీ, రివర్ ఫ్రంట్, రోప్ వే, ఇన్నర్ రింగ్ రోడ్ వంటి ప్రాజెక్టుల నిమిత్తం స్పెషల్ పర్పస్ వెహికల్ దోహద పడుతుంది. అయితే ఎస్పీవీ పరిధిలోకి బయో డిజైన్ ప్రాజెక్టును కూడా తీసుకురావాలని ముఖ్యమంత్రి అధికారులకు సూచించారు. స్పోర్ట్స్ సిటీ తరహాలోనే హెల్త్ సిటీ కూడా అమరావతిలో ఏర్పాటు కానుందని.. దాని పరిధిలో బయో డిజైన్ ప్రాజెక్టు ఏర్పాటు చేయాలని సీఎం చెప్పారు. ప్రజారోగ్య సేవల నిమిత్తం బయో డిజైన్ ప్రాజెక్టులో భాగస్వాములుగా ఉండేందుకు ఏడు దేశాలకు చెందిన నిపుణులు, సంస్థలు సిద్దంగా ఉన్నాయని సీఎం తెలిపారు. ఎస్పీవీ పరిధిలోని ప్రాజెక్టుల డిజైన్, రెవెన్యూ జనరేషన్ మొదలు నిర్మాణం పూర్తి అయ్యేంత వరకు ఎస్పీవీనే పూర్తి బాధ్యత వహించనున్నట్టు అధికారులు సీఎంకు వివరించారు.

**గవర్నమెంట్ కాంప్లెక్స్ కు మౌలిక సదుపాయాలపై ఫోకస్ :** అమరావతిలో ప్రభుత్వ భవనాల సముదాయం కోసం అవసరమైన మౌలిక సదుపాయాల కల్పనకు సంబంధించిన పనులు త్వరలో ప్రారంభం కానున్నాయి. దీనికి సంబంధించిన టెండర్ కు సీఆర్డీఏ అథార్టీ ఆమోదించింది. అమరావతి గవర్నమెంట్ కాంప్లెక్స్ భవనాలకు అనుసంధానంగా రోడ్లు, ఫుట్ పాత్ ల నిర్మాణానికి సంబంధించిన పనులు ఇకపై మొదలు కానున్నాయి. దీంట్లో భాగంగా 53.68 కిలోమీటర్ల మేర రోడ్ల నిర్మాణం చేపట్టనున్నారు. రోడ్ల నిర్మాణమే కాకుండా... ఏడేళ్ల పాటు రోడ్ల నిర్వహణ బాధ్యతను కూడా టెండర్ దక్కించుకున్న సంస్థే చేపట్టేలా నిబంధనలు పెట్టినట్టు అధికారులు ముఖ్యమంత్రికి వివరించారు. ఇక రాజధాని ప్రాంతంలో అర్బన్ డిజైన్లు, ఆర్కిటెక్చరల్ గైడ్ లైన్స్ కు సంబంధించిన నోటిఫికేషన్ జారీకి అథార్టీ ఆమోదించింది. డిజైన్లను ఆమోదించే సందర్భంలో జాగ్రత్తలు తీసుకోవాలని.. అమరావతి నగరం మొత్తంగా ఆకర్షణీయంగా కన్పించేలా ఉండాలని చంద్రబాబు సూచించారు. ప్రతి కట్టడమూ ప్రజలను ఆకర్షించేలా ఉండాలని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు. సీఆర్డీఏ పరిధిలో చేపడుతున్న ప్రాజెక్టులతో కార్యాకలాపాలు పెరిగాయని అధికారులు చెప్పగా... ఈ మేరకు అవసరమైన సిబ్బందిని డిప్యుటేషన్, ఆన్ డ్యూటీ విధానంలో నియమించుకునేందుకు సీఎం అనుమతిచ్చారు.



**కన్వెన్షన్ సెంటర్లకు భూములు :** రాజధాని పరిధిలో కన్వెన్షన్ సెంటర్ల నిర్మాణం కోసం కొన్ని ప్రముఖ హోటళ్లు ముందుకు వచ్చాయని అధికారులు ముఖ్యమంత్రికి వివరించారు. రాజధాని పరిధిలో ఇప్పటికే కొన్ని ప్రముఖ హోటళ్లకు భూములు కేటాయించామని.. వాటికి అనుబంధంగా కొందరు కన్వెన్షన్ సెంటర్ల నిర్మాణం చేపట్టాలని భావిస్తున్నారని... అయితే అందుకు భూములు ఇవ్వాలని ప్రతిపాదించాయని చెప్పారు. నిర్మాణాలు ప్రపంచ ప్రమాణాలకు ధీటుగా ఉండాలని సూచిస్తూ... ముందుకొచ్చిన సంస్థలకు కన్వెన్షన్ సెంటర్ల నిమిత్తం భూములు ఇచ్చేందుకు ముఖ్యమంత్రి అంగీకరించారు. మాస్టర్ ప్లాన్ అవసరాలకు అనుగుణంగా ఏమైనా భూ సేకరణ చేపట్టాలంటే రైతులతో మాట్లాడి ఆ ప్రక్రియ చేపట్టనున్నట్టు అధికారులు సీఎం దృష్టికి తెచ్చారు. రైతులతో మాట్లాడి... వారికి ఎలాంటి ఇబ్బంది కలిగించకుండా ప్రక్రియను చేపట్టాలని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు. ఐకానిక్ బ్రిడ్జి నిర్మాణానికి సంబంధించిన పవర్ పాయింట్ ప్రజెంటేషన్ అధికారులు ఇచ్చారు. కృష్ణా నదిలోని ద్వీపాలను అభివృద్ధి చేసి టూరిజాన్ని ఆకర్షించేలా చూడాలని సీఎం సూచించారు. ఈ సమావేశంలో మంత్రి నారాయణ, మున్సిపల్, సీఆర్డీఏ, ఏడీసీ సహా వివిధ శాఖలకు చెందిన అధికారులు పాల్గొన్నారు.

## 50 శాతం జన ఔషధీ షాపులను బీసీలకు కేటాయించాలి



**మంగళగిరి (జర్నలిస్ట్ ఫైల్):** పేదలపై వైద్య భారం తగ్గేలా, నాణ్యమైన మందులను చౌకగా అందించేందుకు,జన ఔషధీ మందుల షాపు( జనరిక్ మెడికల్ షాపు)లను కనీసం ప్రతి మండలానికి ఒకటి చొప్పున ఏర్పాటు చేయాలని, ఆ షాపులలో సగభాగం జనాభాలో సగం గా ఉన్న బీసీ నిరుద్యోగ యువతకు కేటాయించాలని, ఆంధ్రప్రదేశ్ బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షులు ఒక ప్రకటనలో రాష్ట్ర ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. జనరిక్ మెడికల్ స్టోర్లు పెట్టుకునేందుకు అర్హత గల వెనుకబడిన తరగతులకు చెందిన బీసీ వర్గాల యువతీ-యువకులు బీసీ ఫైనాన్స్ కార్పొరేషన్ కు దరఖాస్తు చేసుకోవాలన్నారు. 50 శాతం సబ్సిడీతో,మిగతా 50 శాతం బ్యాంకు రుణాలతో షాపులు పెట్టుకునే వెసులుబాటును ప్రభుత్వం కల్పించాలన్నారు. అనాదిగా సామాజిక అణచివేతకు- ఆర్థిక దోపిడీకి గురై,అన్ని రంగాలలో- అన్ని విధాల వెనుకబడిన బీసీ వర్గాల యువతను ఆదుకొని-అభివృద్ధి చేయాల్సిన బాధ్యత ప్రభుత్వాలదేనన్నారు. పేదరిక నిర్మూలనకు-బడుగుల ఆర్థికాభివృద్ధికి-నిమ్నకుల ఆత్మగౌరవ పెంపుకు,బీసీ యువతకు జన ఔషధీ దుకాణాల ఏర్పాటు ఎంతో దోహదకారి కాగలదన్నారు. ఎన్టీఆర్ ఆరోగ్య శ్రీ ద్వారా, బియ్యం కార్డు ఉన్న ప్రతి పేద కుటుంబానికి,రూ:25 లక్షల బీమా సదుపాయాన్ని సక్రమంగా అమలు చేయాలన్నారు. రాష్ట్రంలో వైద్య సదుపాయాలు మరింత మెరుగుపరిచేందుకు,మరిన్ని వైద్య కళాశాలలు-వైద్యశాలలు ఏర్పాటు చేయాలని,ప్రజలందరికీ ఉచిత వైద్య పరీక్షలు నిర్వహించి, మందులు-ఇతర చికిత్సలన్నీ ఉచితంగా అందేలా ప్రభుత్వం చర్యలు గైకొనాలన్నారు. రాష్ట్రవ్యాప్తంగా ఇప్పుడున్న ఆసుపత్రుల్లో జనాభా ప్రకారం చూస్తే పడకలు ఏ మాత్రం చాలవని, సుమారు 13 వేలకు పైగా కొత్త పడకలు ఏర్పాటు చేయాల్సి ఉంటుందన్నారు. అందుకే కనీసం గా ప్రతి శాసనసభా నియోజకవర్గంలో 100 పడకల ఆసుపత్రుల నిర్మాణానికి వెంటనే వైద్య-ఆరోగ్యశాఖ కార్యాచరణను సిద్ధం చేయాలని కోరుతున్నామన్నారు.

"ఎన్టీఆర్ వైద్య సేవ" ద్వారా మరింత మందికి ఉచిత సేవలు అందేలా చర్యలు గైకొనాలన్నారు. ప్రతి గ్రామం లో "ఆరోగ్య రథం"ఏర్పాటు చేసి,ప్రతి ఒక్కరి"హెల్త్ ప్రొఫైల్" రూపొందించి, తగిన ఉచిత చికిత్సలు అందరికీ అందేలా, వైద్య సేవల్ని మరింత విస్తృత పర్చాలని శంకరరావు ప్రభుత్వ వర్గాలకు విజ్ఞప్తి చేశారు.

## స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ



**మంగళగిరి (జర్నలిస్ట్ ఫైల్):** మంగళగిరి మండలం పెద్దవడ్లపూడి గ్రామంలో రాష్ట్ర మంత్రి మంగళగిరి శాసనసభ్యులు నారా లోకేష్ ఆదేశాల మేరకు కూటమి ప్రభుత్వం ప్రవేశపెట్టిన స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు.మంగళవారం మంగళగిరి వ్యవసాయ మార్కెట్ యార్డ్ చైర్మన్ జవ్వాది కిరణ్ చంద్ పెదవడ్లపూడి గ్రామం లో కొత్తపాలెం, లూథరన్ చర్చి రేషన్ డిపోల వద్ద స్మార్ట్ రేషన్ కార్డులను అందజేశారు.

ఈ సందర్భంగా జవ్వాది మాట్లాడుతూ "కూటమి ప్రభుత్వం పేదల జీవనోన్నతికి, సమర్థవంతమైన రేషన్ సరఫరాకు దృష్టి పెట్టింది. ప్రతి వ్యక్తి సకాలంలో, నాణ్యమైన రేషన్ పొందేలా ఈ పథకాలను కొనసాగిస్తాం" అని అర్హులైన ప్రతి పేదవాడికి న్యాయంగా పారదర్శకంగా రేషన్ అందుతుందని ఆయన తెలియజేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ పార్టీ అధ్యక్షులు యేళ్ళ శివరామయ్య, మాదల రమేష్ బాబు, నడపన దుర్గారావు, అన్నే చంద్రశేఖర్,కఠారి సాంబయ్య, చింతల ఏడుకొండలు, జాలాది సందీప్, బొర్రా శ్రీకాంత్, ఉల్లంగి శ్రీనివాసరావు, నాగేశ్వరావు,భీమినేని రాఘవయ్య,కొప్పాక ఓంకార్,సచివాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## సత్రం కమిటి పెండేల వర్గం మంత్రితో భేటి



**తెనాలి,(జర్నలిస్ట్ ఫైల్)** శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి అమ్మవారి సత్రం కమిటి తాత్కాలిక చైర్మన్ గా నియమితులైన, మునగాల శ్యామ్,ఆ బాధ్యతల నుండి తప్పుకున్న క్రమంలో, మరలా కథ మొదటికొచ్చింది. ఈ నేపథ్యంలో, పెండేల వెంకట్రావ్ వర్గం మంత్రి నాదెండ్ల మనోహర్ తొ భేటీ అయ్యారు. కూటమి పార్టీల కార్యాలయంలో మంగళవారం పెండ్యాల వెంకట్రావు తమ వర్గీయులతొ, రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ ను కలిసి, శ్రీవాసవీ కన్యకాపరమేశ్వరీ అమ్మవారి సత్రం కమిటి ఏర్పాటు వాస్తవ పరిస్థితులను వివరించారు. ఈ అంశంపై జిల్లాఎస్పీ జోక్యం చేసుకునే పరిస్థితి రావడం, ఆర్యవైశ్య నాయకుల, అసమర్థ విధానా లనేభావనను మంత్రి మనోహర్ వ్యక్తం చేశారు. పెండేల వెంకట్రావు గతంలో చోటు చేసుకున్న అంశాలను కూలంకషంగా వివరించారు. మధ్యవర్తిగా వ్యవహరించిన జిల్లా ఎస్పి సతీష్ కుమార్ సూచనలతొ, ఇరు వర్గాల ఆమోదం మేరకు, బాధ్యతలు చేపట్టిన మునగాల శ్యామ్ ఆపదవికి రిజైన్ చేసినట్లు, వైశ్య నాయకులు మంత్రి మనోహర్ కు, వివరించగా, ఈఅంశంపై మంత్రి మనోహర్ తమదైన శైలిలొ స్పందించారు. సమస్య పరిష్కారం దిశగా, పెండేల వెంకట్రావ్ వర్గం,మంత్రి మనోహర్ సహకారాన్ని కోరిన క్రమంలొ, మంత్రి మనోహర్ సున్నితంగా తిరస్కరించారు. ఇరుపక్షాలతొ గతంలొ మాట్లాడానని, ఇతరుల జోక్యం లేకుండా,సంఘీయులె సంయమనంతొ, విధానపరమైన నిర్ణయంతొ ముందుకు వెళ్ళాలని సూచించారు. తాత్కాలికంగా ఉన్న ఇంచార్జి చైర్మన్ మునగాల శ్యామ్ తప్పుకోవడంతొ, మరల శ్రీ వాసవీ అమ్మవారి ఆలయ కమిటీ ఏర్పాటు వ్యవహారం చర్చనీయాంశం కానుందనే భావన ఆవర్గీయులనుండి వ్యక్తమవుతుంది.

## వైఎస్ రాజశేఖరరెడ్డి వర్ధంతి



**మంగళగిరి (జర్నలిస్ట్ ఫైల్):** దివంగత మహానేత స్వర్గీయ వైయస్ రాజశేఖర్ రెడ్డి 16వ వర్ధంతి సందర్భంగా మంగళగిరి మండలం ఆత్మకూరు గ్రామంలో వైఎస్ఆర్సిపి గ్రామ నాయకుల ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమంలో మంగళగిరి నియోజకవర్గ వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ ఇన్చార్జ్ దొంతిరెడ్డి వేమారెడ్డి, మంగళగిరి మండల అధ్యక్షులు నాలి వెంకటకృష్ణ, మంగళగిరి పట్టణ అధ్యక్షులు ఆకురాతి రాజేష్ మరియు తదితర నాయకులు కార్యకర్తలు అభిమానులు పాల్గొన్నారు.

# నాణ్యమైన విద్య అందించాలి


**కమలాపురం (జర్నలిస్ట్ ఫైల్):** దేశంలోనే తొలిసారిగా కమలాపురం నియోజకవర్గం సికె దిన్నె ఎంపిపి పాఠశాల ఆవరణలో రూ. 2కోట్లతో ఏర్పాటుచేసిన సెంట్రలైజ్డ్ అడ్వాన్స్ డ్ స్మార్ట్ కిచెన్ ను రాష్ట్ర విద్య, ఐటి, ఎలక్ట్రానిక్స్ శాఖల మంత్రి నారా లోకేష్ మంగళవారం ప్రారంభించారు. కమలాపురం 2, జమ్మలమడుగు 2, కడపలో 1 స్మార్ట్ కిచెన్ ను మంత్రి లోకేష్ వర్చువల్ గా ప్రారంభించారు. డొక్కాసీతమ్మ మధ్యాహ్న భోజన పథకం కింద ఈ 5 స్మార్ట్ కిచెన్ల ద్వారా 136 పాఠశాలలకు చెందిన 10,332 మంది విద్యార్థులకు 13 ప్రత్యేక వాహనాల్లో ఆహారాన్ని పంపిస్తారు. న్యూట్రిషనిస్ట్ పర్యవేక్షణలో సోలార్ పవర్ తో పనిచేసే ఈ స్మార్ట్ కిచెన్ లో అత్యుత్తమ నాణ్యతా ప్రమాణాలను పాటిస్తారు. మెరుగైన నాణ్యత కోసం ఇక్కడ ప్రత్యేక ఏర్పాటుచేసిన ఆర్ఓ ప్లాంటు నీటినే వంటకు ఉపయోగిస్తారు. ఆర్ఓ ప్లాంటు, ఆహార పంపిణీ వాహనాలను కూడా మంత్రి చేతుల మీదుగా ప్రారంభించారు. ప్రభుత్వం సూచించిన మెనూ ప్రకారం శుచి,రుచితో కూడిన భోజనాన్ని నిర్ణీత సమయానికి తాము అందించగలమని సిబ్బంది తెలిపారు. డిసెంబర్ కల్లా కడప జిల్లాలోని 11 మండలాల్లో 33 స్మార్ట్ కిచెన్ల ద్వారా 1,24,689 మంది విద్యార్థులకు రుచి, శుచికరమైన ఆహారాన్ని అందిస్తామని మంత్రి లోకేష్ చెప్పారు. తల్లిదండ్రుల నుంచి ఫీడ్ బ్యాక్ తీసుకొని స్మార్ట్ కిచెన్లను మరింత మెరుగ్గా తీర్చిదిద్దాలని మంత్రి కోరారు. ఈ సందర్భంగా స్మార్ట్ కిచెన్ ను సందర్శించిన మంత్రి లోకేష్ అక్కడ సరుకుల నాణ్యత, భోజనం తయారీ విధానాన్ని పరిశీలించారు. సికె దిన్నె స్కూలు స్మార్ట్ కిచెన్



పనితీరునుబట్టి దీనిని రాష్ట్రవ్యాప్తంగా అమలుచేస్తామని మంత్రి తెలిపారు.

**విద్యార్థులతో మంత్రి లోకేష్ భేటీ :** ఈ సందర్భంగా పదోతరగతి విద్యార్థినుల తరగతి గదిని పరిశీలించిన లోకేష్, వారితో భేటీ అయ్యారు. గత ఏడాది కాలంగా తాము చేపట్టిన సంస్కరణలు ఎలా ఉన్నాయని విద్యార్థులను వాకబు చేసి, వారి నుంచి సలహాలు స్వీకరించారు. విద్యార్థినులు మాట్లాడుతూ... సెమిస్టర్ వైజ్ టెక్ట్స్ బుక్స్ విధానం అమలుచేయడం వల్ల తమకు మోతబరువు తగ్గిందని తెలిపారు. క్లాస్ లీడర్ జాస్మిన్ మాట్లాడుతూ... సన్నబియ్యం ఇస్తుండటం వల్ల మధ్యాహ్న భోజనం గతంకంటే ఇప్పుడు రుచిగా బాగుంటుందని చెప్పింది. తమ స్కూలులో కంప్యూటర్ ల్యాబ్స్, కొత్త బెంచిలు ఏర్పాటుచేయాలని, కాంపౌండ్ వాల్ ఎత్తు పెంచాలని కోరగా, సాధ్యమైనంత త్వరగా వాటిని కల్పిస్తామని మంత్రి తెలిపారు. లోకేష్ ముఖచిత్రంతో తాను వేసిన డ్రాయింగ్ ను ఈ సందర్భంగా ఓ విద్యార్థిని మంత్రికి బహుకరించింది. ప్రభుత్వం కొత్తగా ఇస్తున్న యూనిఫామ్స్, బ్యాగ్స్ నాణ్యతపై మంత్రి లోకేష్ ఆరా తీశారు. గతంకంటే ఇప్పుడు బాగున్నాయని, బ్యాగుల సైజ్ కొంచెం పెంచాలని విద్యార్థినులు సూచించారు. ఇంటర్నల్ ఎసెస్ మెంట్ కోసం కొత్తగా ఇస్తున్న బుక్ లెట్స్ బాగున్నాయని తెలిపారు. సోషల్ స్టడీస్ లో నాలుగు బుక్స్ ఉన్నాయని, వాటిని రెండింటికీ కుదించాలని కోరారు. ఇంగ్లీషు టెక్ట్స్ బుక్, సప్లిమెంట్ కలిపి ఒకే బుక్ గా ఇస్తే బాగుంటుందని చెప్పారు. తమకు ఆర్ఓ తాగునీటిని అందించాలని కోరగా, మంత్రి అక్కడికక్కడే ఆదేశాలు జారీచేశారు. డిసెంబర్ కన్నా సిలబస్ పూర్తవుతుంది, మీరంతా కష్టపడి చదివి మెరుగైన ఫలితాలు సాధించాలి, ఈసారి మీకు మాత్రమే కాదు, నాకు కూడా పరీక్షేనని అన్నారు.

**విద్యార్థి గంగిరెడ్డికి లోకేష్ అభినందన :** సికె దిన్నె స్కూలు తరగతి గదులను సందర్శించినపుడు గంగిరెడ్డి గణేష్ రెడ్డి అనే పదోతరగతి విద్యార్థికి చెందిన నోట్ బుక్ ను చూసిన లోకేష్... చేతిరాత చాలా బాగుందంటూ ప్రత్యేకంగా



అభినందించారు. ఆ తర్వాత స్కూలు ప్రధానోపాధ్యాయుని శోభారాణితో మంత్రి లోకేష్ సమావేశమై విద్యాప్రమాణాల మెరుగుదలకు సూచనలు ఇవ్వాల్సిందిగా కోరారు. ఈ సందర్భంగా హెచ్ఎం మాట్లాడుతూ... ఎసెస్ మెంట్ బుక్స్ వల్ల విద్యార్థులు రివిజన్ చేసుకోవడానికి బాగుంది, అయితే ఆ పుస్తకాలన్నీ టీచర్లు ఇంటికి తీసుకెళ్లి దిద్దడం కష్టంగా ఉందని అంటూ సైజు తగ్గించే అంశాన్ని పరిశీలించాలని కోరారు. మంత్రి లోకేష్ మాట్లాడుతూ... రాష్ట్రంలో గత ఏడాదికాలంగా విద్యారంగంలో ఎన్నో సంస్కరణలు తెచ్చాం, పారదర్శకమైన విధానాలను అమలు చేస్తున్నాం, ఒక్క పిటిఎం తప్ప మరేఇతర విద్యేతర భారాన్ని టీచర్లపై మోపడంలేదు, ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులను కన్నబిడ్డల్లా భావించి వారికి మెరుగైన విద్యనందించాలని కోరారు. ఈ కార్యక్రమంలో మంత్రి లోకేష్ వెంట జిల్లా ఇన్చార్జి మంత్రి సవిత, జిల్లా కలెక్టర్ చెరుకూరి శ్రీధర్, జాయింట్ కలెక్టర్ అధితి సింగ్, ఎమ్మెల్యేలు పుత్తా చైతన్య రెడ్డి, కడప ఎమ్మెల్యే రెడ్డివారి మాధవీరెడ్డి, ఎమ్మెల్సీ రాంభూపాల్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# అదనంగానే ఎరువుల నిల్వలు!

**అమరావతి(జర్నలిస్ట్ ఫైల్) :** రాష్ట్రంలో ఎరువుల సరఫరాపై రైతులెవరూ ఆందోళన చెందాల్సిన అవసరం లేదని.. డిమాండ్ కంటే అదనంగానే నిల్వలు ఉన్నాయని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు స్పష్టం చేశారు. ఎరువులు బ్లాక్ మార్కెట్ కు తరలి పోకుండా కఠినంగా వ్యవహరించాలని సీఎం ఆదేశాలు జారీ చేశారు. మంగళవారం ఉండవల్లిలోని క్యాంపు కార్యాలయంలో ఉద్యాన పంటలు, ఎరువుల లభ్యత, మార్కెటింగ్ శాఖపై సమీక్ష నిర్వహించారు. ఇ-క్రాప్ ద్వారా రాష్ట్రంలో ఎంత మేర ఏ పంటలు సాగు అవుతున్నాయి. ఎరువుల వినియోగం ఎంత జరుగుతుందన్న లెక్కలు తీయాలని ముఖ్యమంత్రి ఆదేశించారు. నిరంతర పర్యవేక్షణ ద్వారా సమస్య రాకుండా చూడాలని అధికారులను ఆదేశించారు. ఈసారి 2.02 లక్షల మెట్రిక్ టన్నుల యూరియా రాష్ట్రానికి సరఫరా అయ్యిందని.. వాస్తవ డిమాండ్ కంటే అదనంగా నిల్వలు ఉన్నాయని అధికారులు వివరించారు. గతంతో పోలిస్తే ఈసారి 91 వేల మెట్రిక్ టన్నుల యూరియా అదనంగా వచ్చినట్టు తెలిపారు. ఇక డిఏపి 51,700 మెట్రిక్ టన్నుల మేర వచ్చిందని.. గత ఏడాదితో పోలిస్తే 16 వేల మెట్రిక్ టన్నులు ఇది అదనమని అధికారులు సీఎంకు తెలిపారు. కాంప్లెక్స్ ఎరువులు కూడా ప్రస్తుత ఏడాదిలో 2.72 లక్షల మెట్రిక్ టన్నుల మేర వచ్చిందని వివరించారు. గతంతో పోలిస్తే 1.20 లక్షల మెట్రిక్ టన్నులు ఇది అదనమని తెలియచేశారు. దీనిపై స్పందించిన సీఎం రాష్ట్రంలో ఎరువుల లభ్యత ఇంతగా ఉన్నా.. కొందరు కావాలని దుష్ప్రచారం చేస్తున్నారని.. ఇంటిగ్రేటెడ్ ఫెర్టిలైజర్ మేనేజ్మెంట్ సిస్టం ద్వారా యూరియా



వినియోగం కూడా లెక్కించాలని అన్నారు.

**రసాయన ఎరువులు, పురుగుమందులు వాడకం తగ్గితే సబ్సిడీలు :** రసాయన ఎరువులు, పురుగు మందుల రహిత రాష్ట్రంగా ఏపీని తీర్చిదిద్దాలని ముఖ్యమంత్రి అధికారులను ఆదేశించారు. ఆ మేరకు వాటి వినియోగం తగ్గించేలా రైతుల్లో అవగాహన కల్పించాలని స్పష్టం చేశారు. పంటల సాగులో రసాయన ఎరువులు, పురుగుమందుల వినియోగం తగ్గించిన రైతులకు రాయితీలు ఇచ్చే అంశంపై ప్రణాళికలు చేయాలని సీఎం స్పష్టం చేశారు. ఎవరు ఎంత వినియోగిస్తున్నారనే అంశాన్ని రైతు సేవా కేంద్రాల ద్వారా పర్యవేక్షించాలని అధికారులకు ఆదేశాలు ఇచ్చారు. ఎప్పటికప్పుడు రైతు సేవా కేంద్రాల ద్వారా కూడా ఎరువుల వినియోగంపై గణాంకాలు నమోదు చేయాలని స్పష్టం చేశారు.

**11 ఉద్యాన పంటలకు సాగు ధర దక్కాలి :** రాష్ట్రంలోని 11 ఉద్యాన పంటలకు సంబంధించి సాగు వ్యయానికి తగినట్టే ఆయా పంటలకు కనీస ధర వచ్చేలా చూడాలని సీఎం ఆదేశాలు జారీ చేశారు. రైతులు ఎట్టి పరిస్థితుల్లోనూ నష్టపోవడానికి వీల్లేదని ముఖ్యమంత్రి తేల్చి చెప్పారు. మరోవైపు కాఫీ తోటలకు కొత్తగా వచ్చిన బోరర్ తెగులు పై తక్షణమే చర్యలు చేపట్టాలని సీఎం ఆదేశాలు జారీ చేశారు. కొత్త తెగులు వచ్చిన కాఫీ పంట 20 ఎకరాల్లో ఉందని...దానిని తక్షణం తొలగించాల్సిన అవసరం ఉందని అధికారులు సీఎంకు తెలిపారు. ఇతర ప్రాంతాలకు తెగులు ఇతర ప్రాంతాలకు వ్యాపించకుండా చర్యలు చేపట్టాలని సీఎం సూచించారు. అలాగే తొలగించిన పంటకు నష్టపరిహారం చెల్లించి రైతులను ఆదుకోవాలని స్పష్టం చేశారు. వచ్చే మూడేళ్ల పాటు ట్రాప్ లను ఏర్పాటు చేసి నిరంతరం పర్యవేక్షించాల్సిందిగా ముఖ్యమంత్రి సూచనలు జారీ చేశారు. మరోవైపు ఉల్లి పంట మొత్తాన్ని కొనుగోలు చేయాల్సిందిగా అధికారులకు సీఎం స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు. కొనుగోలు చేసిన ఉల్లిని స్థానికంగా కమ్యూనిటి హాళ్లను తీసుకుని ఆరబెట్టాలని సీఎం సూచనలు జారీ చేశారు. ఇప్పటి వరకూ హెచ్డీ బర్లీ పొగాకు కొనుగోళ్లకు సంబంధించి రూ.54 కోట్ల రూపాయల చెల్లింపులు జరిగాయని .. మరో రూ.59 కోట్లు చెల్లించాల్సి ఉందని తెలిపారు. అలాగే ఈ సమీక్షకు వ్యవసాయ శాఖ మంత్రి అచ్చెన్నాయుడు, సీఎస్ కె.విజయానంద్, వ్యవసాయ, మార్కెటింగ్ శాఖ ఉన్నతాధికారులు హాజరయ్యారు.

## రికార్డు స్థాయిలో ఎరువుల కేటాయింపు

**అమరావతి(జర్నలిస్ట్ ఫైల్) :** గతంలో ఎన్నడూ లేనంతగా రాష్ట్రానికి ఎరువుల కేటాయింపు జరుగుతోంది. ప్రస్తుత కేటాయింపులకు అదనంగా 53 వేల మెట్రిక్ టన్నుల యూరియాను కేంద్ర ప్రభుత్వం ఇచ్చింది. ఈ యూరియా నౌకల ద్వారా కాకినాడ, గంగవరం, కృష్ణపట్నం పోర్టులకు చేరుకుంది. యూరియా, డీఏపీ, కాంప్లెక్స్ ఎరువుల విషయంలో గత ఏడాది కంటే ఈ ఏడాది గణనీయంగా విక్రయాలు పెరిగాయని వ్యవసాయ శాఖ తెలిపింది. రాష్ట్రంలో ఉన్న పరిస్థితిని కేంద్రానికి ఎప్పటికప్పుడు వివరిస్తూ ఉండడంతో రాష్ట్రానికి ఎక్కువ కేటాయింపులు జరుపుతూ కేంద్రం నిర్ణయం తీసుకుందని అధికారులు చెప్పారు. కేంద్రం ఇచ్చిన ఎరువులు, యూరియా నిల్వలను మార్క్ఫెడ్ సమన్వయంతో రైతులకు సమయానికి అందేలా ప్రభుత్వం కృషి చేస్తోందని స్పష్టం చేశారు. కాకినాడ పోర్టుకు 17,154 మెట్రిక్ టన్నులు, కృష్ణపట్నం పోర్టుకు 9,200 మెట్రిక్ టన్నులు, గంగవరం పోర్టుకు 26,547 మెట్రిక్ టన్నుల యూరియా చేరుకుంది. ఈ సరఫరాతో పాటు గత 10 రోజుల్లో రాష్ట్రానికి 22 వేల మెట్రిక్ టన్నుల యూరియా చేరగా..వచ్చే 10 రోజుల్లో అదనంగా 30 వేల మెట్రిక్ టన్నులు రానున్నట్టు వ్యవసాయ శాఖ తెలియచేసింది. దీనికి తోడు దేశీయంగా వివిధ కంపెనీల నుంచి సరఫరా అయ్యే ఎరువులు కూడా అందుబాటులో ఉన్నాయని... రైతులకు ఎరువుల సమస్య తలెత్తే అవకాశం లేదని వ్యవసాయ శాఖ అధికారులు వెల్లడించారు. ఖరీఫ్ సీజన్ కు ఇప్పటి వరకూ 5.65 లక్షల మెట్రిక్ టన్నుల యూరియా రైతులకు సరఫరా అయినట్టు వ్యవసాయశాఖ తెలియచేసింది. అటు వచ్చే రబీ సీజన్ కు కూడా మరో 9 లక్షల మెట్రిక్ టన్నుల్ని సిద్ధం చేస్తున్నట్టు వెల్లడించింది.

**మార్క్ ఫెడ్ ద్వారా ఎరువుల సరఫరాలో 78% వృద్ధి :** ఖరీఫ్ సీజన్ కు సంబంధించి గత ఏడాదితో పోలిస్తే మార్క్ ఫెడ్ ద్వారా ఎరువుల సరఫరా గణనీయంగా పెరిగిందని వ్యవసాయశాఖ ఉన్నతాధికారులు తెలిపారు. యూరియా, డీఏపీ, కాంప్లెక్స్ ఎరువులు అన్నీ కలిపి గతేడాది కంటే 1.20 లక్షల మెట్రిక్ టన్నుల మేర అదనంగా మార్క్ ఫెడ్ ద్వారా సరఫరా చేశామని అధికారులు తెలిపారు. గతేడాది 1.53 లక్షల మెట్రిక్ టన్నుల ఎరువులు సరఫరా చేస్తే... ఈ ఏడాది ప్రస్తుత సీజన్లో 2,72,000 మెట్రిక్ టన్నుల మేర మార్క్ ఫెడ్ ద్వారా సరఫరా జరిగిందని వెల్లడించారు. గతంతో పోలిస్తే ఇది 78 శాతం మేర అధికమని వ్యవసాయశాఖ ఉన్నతాధికారులు స్పష్టం చేస్తున్నారు. ఇక గత ఏడాదిలో 1,11,000 మెట్రిక్ టన్నుల యూరియా సరఫరా చేస్తే..ఈ ఏడాది 2.02 లక్షల మెట్రిక్ టన్నుల యూరియా సరఫరా జరిగిందని వివరించారు. గతాని కంటే అధికంగా 91 వేల మెట్రిక్ టన్నులను సరఫరా చేశామని వివరించారు. ఇక డీఏపీ సరఫరా కూడా గతానికి మించి 85 శాతం జరిగిందని వెల్లడించారు. గత ఏడాది 23,700 మెట్రిక్ టన్నులు మాత్రమే సరఫరా చేయగా... ఈ ఏడాది 51,700 మెట్రిక్ టన్నుల మేర సరఫరా జరిగిందని స్పష్టం చేశారు. ఈసారి 28 వేల మెట్రిక్ టన్నులు ఎక్కువగా సరఫరా చేశామని వ్యవసాయ శాఖ అధికారులు వివరించారు. ఈ స్థాయిలో జరిగిన భారీ కేటాయింపులతో ప్రస్తుత సీజన్ తో పాటు వచ్చే రబీ సీజన్లోనూ రైతులకు ఎరువుల కొరత ఉండదని ప్రభుత్వం స్పష్టం చేస్తోంది. యూరియా, ఎరువుల కేటాయింపుల విషయంలో కేంద్రంతో, రైతులకు సరఫరా చేసే అంశంలో మార్క్ఫెడ్ తో సమన్వయం చేసుకుంటున్నామని అధికారులు చెప్పారు. క్షేత్ర స్థాయిలో పరిస్థితిని ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తున్నామని వివరించారు.

# సోమసుందరపాలెంలో.... జనసేనసందడి

**తెనాలి,(జర్నలిస్ట్ ఫైల్)** మండలంలోని సోమ సుందర పాలెం గ్రామంలో,మంత్రి నాదెండ్ల మనోహర్ సమక్షంలో తెలుగుదేశం నుండి జనసేన పార్టీలోకి చేరికలు.జనసేన పార్టీ అధినేత, రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి కొణిదల పవన్ కళ్యాణ్ జన్మదిన వేడుకలను మండలంలోని సోమ సుందర పాలెం గ్రామంలో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమాలలో రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా గ్రామంలో ఏర్పాటు చేసిన జనసేన పార్టీ జెండాను, మంత్రి నాదెండ్ల మనోహర్ ఆవిష్కరించారు. అనంతరం గ్రామంలో అన్నదాన సేవలను ప్రారంభించారు. గ్రామంలోని పలువురు మహిళలు మంత్రి నాదెండ్ల మనోహర్ కు సాదర స్వాగతం పలికారు. ప్రభుత్వ అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు గురించి, జనసేన పార్టీ విధి విధానాల గురించి మంత్రి నాదెండ్ల మనోహర్ మహిళలకు వివరించారు. మహిళల చేత జనసేనకు జై కొట్టించారు. అనంతరం తెలుగుదేశం పార్టీకి చెందిన 20 మంది యువకులు మంత్రి నాదెండ్ల మనోహర్ సమక్షంలో జనసేన పార్టీలొ చేరగా, వారికి మంత్రి మనోహర్ పార్టీ కండువాలు కప్పి, పార్టీలోకి స్వాగతించారు. పండుగ వాతావరణం లో కొనసాగిన కార్యక్రమంలో విశేషంగా మహిళలు గ్రామస్తులు పాల్గొన్నారు.



# ఏఐతో విద్యుత్ ప్రమాదాల నివారణ

**అమరావతి(జర్నలిస్ట్ ఫైల్) :** విద్యుత్ ప్రమాదాల శాశ్వత నివారణే లక్ష్యంగా ఎలక్ట్రికల్ సేఫ్టీ అధికారులు పని చేయాలని విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ ఆదేశాలు జారీ చేశారు. రాష్ట్రవ్యాప్తంగా జరుగుతున్న విద్యుత్ ప్రమాదాలపై విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవి కుమార్ సచివాలయంలో మంగళవారం సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రమాదాలు జరగడానికి గల కారణాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. మానవ తప్పిదాలు, నిర్వహణ లోపాల వలన ప్రమాదాలు జరుగుతున్నాయని ఈ సందర్భంగా కొందరు అధికారులు మంత్రి దృష్టికి తీసుకు వచ్చారు. విద్యుత్ ప్రమాదాలు జరగకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని, ప్రతి ఏడాదికి ప్రమాదాల సంఖ్య తగ్గించేందుకు కఠిన చర్యలు చేపట్టాలని మంత్రి గొట్టిపాటి ఆదేశించారు. ప్రమాదాలు జరిగిన తరువాత బాధితులకు కేవలం నష్ట పరిహారం చెల్లించడమే సమాధానం కాదన్నారు. రాష్ట్రవ్యాప్తంగా అన్ని కాలాల్లోనూ ఎటువంటి విద్యుత్ ప్రమాదాలు జరగకుండా నివారించడమే ప్రధాన లక్ష్యంగా పనిచేయాలని ఆయన స్పష్టం చేశారు. ప్రజల ప్రాణ రక్షణే కూటమి ప్రభుత్వానికి ప్రథమ ప్రాధాన్యతగా పేర్కొన్న మంత్రి



గొట్టిపాటి., ప్రమాదాల వలన ఇకపై ఎవరూ నష్టపోకుండా తగిన చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. అదే విధంగా విద్యుత్ ప్రమాదాల విషయంలో ప్రజలు కూడా అప్రమత్తంగా ఉండాలని సూచించారు.

**సాంకేతికత వినియోగంతో..... :** విద్యుత్ ప్రమాదాల నివారణకు సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించుకోవడం అవసరమని మంత్రి గొట్టిపాటి అధికారులకు సూచించారు. ముఖ్యంగా ఆర్టిఫీషియల్ ఇంటిలిజెన్స్ (ఏఐ) ఆధారంగా ప్రమాదాలను తగ్గించే దిశగా కసరత్తు చేయాలని అధికారులను ఆదేశించారు. ప్రతి త్రైమాసికానికి ఒకసారి ప్రమాదాల నివారణకు తీసుకుంటున్న చర్యలపై సంబంధిత డిస్కంలకు సమగ్ర నివేదిక పంపాలని ఎలక్ట్రికల్ సేఫ్టీ అధికారులను ఆదేశించారు. అదే విధంగా విద్యుత్ శాఖ టోల్ ఫ్రీ నంబర్ 1912ను విస్తృతంగా ప్రచారం చేసి ప్రజల్లోకి తీసుకెళ్లాలని మంత్రి సూచించారు. విద్యుత్ ప్రమాదాల పట్ల ప్రజల్లో అవగాహన పెంచేందుకు సోషల్ మీడియా, మీడియా వేదికలను ఉపయోగించుకోవాలన్నారు. భవిష్యత్తు తరాల వారికి కూడా అవగాహన కల్పించడం ద్వారా పూర్తి స్థాయి ప్రమాదాల నివారణ సాధ్యపడుతుందని ఈ సందర్భంగా మంత్రి అభిప్రాయపడ్డారు. ఇందులో భాగంగానే పాఠశాలలు, కళాశాలల్లో విద్యార్థులకు విద్యుత్ ప్రమాదాల నివారణకు చేపట్టాల్సిన చర్యల పట్ల ప్రత్యేక అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని మంత్రి సూచించారు. అదే విధంగా పక్క రాష్ట్రాల్లో విద్యుత్ ప్రమాదాల నివారణకు అనుసరిస్తున్న విధానాలను అధ్యయనం చేసి, వాటిని ఆంధ్రప్రదేశ్ లో అమలు చేసే దిశగా చర్యలు తీసుకోవాలని విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో ఎలక్ట్రికల్ సేఫ్టీ అధికారులతో పాటు పలువురు ఇంధన శాఖ అధికారులు పాల్గొన్నారు.

## కాణిపాకం వరసిద్ధి వినాయక బ్రహ్మోత్సవాలు



**చిత్తూరు (జర్నలిస్ట్ ఫైల్):** శ్రీశైల దేవస్థానం తరపున శ్రీ వరసిద్ధి వినాయక స్వామివారి బ్రహ్మోత్సవాల సందర్భంగా మంగళవారం పట్టువస్త్రాలను సమర్పించారు. గత నెల 27న ప్రారంభమైన బ్రహ్మోత్సవాలు ఈ నెల 16న ముగియనున్నాయి. ఈ సందర్భంగా శ్రీశైల దేవస్థానం ఈఓ ఎం. శ్రీనివాసరావు, అర్చకులు, వేదపండితులు, పలువురు అధికారులు కలిసి పట్టువస్త్రాలను సమర్పించారు. ముందుగా కాణిపాక దేవస్థానం ఈఓ కె. పెంచల కిషోర్, అర్చకులు, వేదపండితులు సాదరంగా వారిని ఆహ్వానించారు. సంప్రదాయబద్ధంగా మేళతాళాల నడుమ స్వయంభు వం-సిద్ధి వినాయక స్వామివారికి పట్టువస్త్రాలు సమర్పించి పూజాదికాలు నిర్వహించారు.

తరువాత కాణిపాక ఈఓ, అర్చకులు, వేదపండితులు శ్రీశైల దేవస్థానం అధికారులను వేదాశీర్వచనాలతో సత్కరించారు. ఆలయ సంప్రదాయాల ప్రకారం ప్రతి ఏడాది బ్రహ్మోత్సవాల సమయంలో శ్రీశైల దేవస్థానం తరపున పట్టువస్త్రాల సమర్పణ జరుగుతున్నది.

## ప్రేక్షకులను అలరించిన చిన్నారుల అష్ట వినాయక ఆంగికాభినయ ప్రదర్శన



విశాఖపట్టణం, సెప్టెంబర్ 2(జర్నలిస్ట్‌ఫైల్):

వినాయక చవితి సందర్భంగా విశాఖపట్టణం నగరంలోని అతిపెద్ద గాజువాక 'సెలస్ట్' అపార్ట్మెంట్ లో చిన్నారుల అష్ట వినాయక ఆంగికాభినయ ప్రదర్శన వందలాది మంది నివాసితుల మధ్య అత్యంత వైభవంగా జరిగింది. ఐదు రోజులపాటు విశేష పూజలు అందుకున్న విఘ్నేశ్వరునికి రాత్రి వైభవోపేతంగా నిమజ్జనోత్సవం జరిగింది. ఈ సందర్భంగా మూడు గంటల పాటు జరిగిన పలు రకాల సాంస్కృతిక కార్యక్రమాలు ఆహూతులను అలరించాయి. ప్రధానంగా దాదాపు 25 మందికి పైగా చిన్నారులలో 8 మంది వినాయకుడు, మరో 8 మంది పార్వతి పాత్రలలో వినాయకుని చరిత్రను సంక్షిప్తంగా కళ్ళకు కట్టినట్టు ప్రదర్శించి, అలరించారు. నైతిక విలువలు కలిగిన, నీతి నిజాయితీని పెంపొందింపజేసే చరిత్రతో పాటు ముఖ్యంగా పురాణేతిహాసాలను మరిచిపోతున్న నేటికాలంలో ఇలాంటి రూపకాలు ముఖ్య సందర్భాల్లో నివాస ప్రాంతాలు, విద్యాసంస్థల్లో ప్రదర్శితమయ్యేలా చూడాలని పలువురు కోరుతున్నారు.

## మండల కురుబ సంఘం అధ్యక్షులుగా ఎంసీ కృష్ణప్ప



వి కోట, సెప్టెంబర్ 2(జర్నలిస్ట్‌ఫైల్):

చిత్తూరు జిల్లా వీకోట మండల నూతన కురబ కుల సంఘాన్ని రాష్ట్ర గౌరవ అధ్యక్షులు నాగభూషణం నేతృత్వంలో ఎంపిక చేశారు. సోమవారం వీకోటలోని వేణుగోపాలస్వామి ఆలయ ఆవరణంలో జరిగిన సమావేశంలో మండల కురబ కుల నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎంపిక చేశారు.ఈ మేరకు సంఘ అధ్యక్షులుగా దొడ్డిపల్లి కి చెందిన ఎమ్.సి.కృష్ణప్ప, ఉపాధ్యక్షులుగా యాలకల్లు కు చెందిన శంకరప్ప, ప్రధాన కార్యదర్శిగా కమ్మేపల్లికి చెందిన సి.అమర్ గౌడ్, కోశాధికారిగా బెల్లకుంటకు చెందిన కె.అమర్నాథ్ గౌడ్, గౌరవాధ్యక్షులుగా బి.సి.పల్లి చెందిన జయప్ప, చింతమాకులపల్లి చెందిన రాధాకృష్ణ గౌడు, మండల యూత్ అధ్యక్షులుగా వెంకటేపల్లికి చెందిన సురేష్ లను ఎంపిక చేశారు. కార్యక్రమంలో కురబ సంఘ నాయకులు విశ్వనాథ్, బలరాం, జయరామే గౌడు, ఈశ్వర్, మూర్తి, ఉమాపతి, బాలకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

## శ్రీరామభజన మందిరానికి మోహన్ రెడ్డి, కొంగాటం విజయ్ ల చేయూత

### చెరో లక్ష రూపాయల సమర్పణ



వి.కోట, సెప్టెంబర్ 2(జర్నలిస్ట్‌ఫైల్):

చిత్తూరు జిల్లా వి.కోట పట్టణ నడిబొడ్డున ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న శ్రీరామ భజన మందిర నిర్మాణానికి విరాళాలు కొనసాగుతూనే ఉన్నాయి. సోమవారం స్థానిక వ్యవసాయ మార్కెట్ యార్డుకు చెందిన మోహన్ రెడ్డి,కొంగాటం విజయ్ లు లక్షా వెయ్యి నూట పదహార్లు సమర్పించారని కమిటీ సభ్యులు తెలిపారు. ఈ కార్యక్రమంలో నాగరాజేంద్ర ,కృష్ణమూర్తి, రాధాకృష్ణ, శ్రీనివాసులు,డా, సురేంద్ర గౌడ తదితరులు పాల్గొన్నారు.

## హెచ్‌బీ, ప్రియదర్శిని కాలనీల్లో ఇంటి ముందుకు వర్షపు నీరు

- నిరసన వ్యక్తం చేసిన కాలనీ ప్రజలు
- విషయం తెలుసుకుని స్పందించిన జనసేన పార్టీ నాయకురాలు తిరుపతి అనూష



విజయవాడ, సెప్టెంబర్ 2(జర్నలిస్ట్‌ఫైల్):

భవానీపురంలోని హెచ్‌బీ కాలనీ, ప్రియదర్శిని కాలనీల్లో వర్షపు నీరు ఇళ్ల ముందు రోడ్లపై నిలిచిపోవడంతో స్థానికులు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. ఈ సమస్యతో విసిగిపోయిన కాలనీవాసులు నిరసన కార్యక్రమం చేపట్టారు. విషయం తెలుసుకున్న జనసేన పార్టీ నాయకురాలు తిరుపతి అనూష వెంటనే స్పందించి సంఘటన స్థలానికి చేరుకుని పరిస్థితిని పరిశీలించారు. సమస్యను దగ్గరగా చూసి తక్షణ చర్యలు చేపట్టిన ఆమె నాలుగు ట్యాంకర్లను పిలిపించి నీటిని తొడిరించేలా ఏర్పాట్లు చేశారు. కాలనీవాసులు ఎదుర్కొంటున్న ఇబ్బందులను పరిష్కరించడంలో తిరుపతి అనూష చూపిన చొరవను చూసి ప్రజలు హర్షం వ్యక్తం చేశారు. తమ సమస్యలపై ఇంత వేగంగా స్పందించి పరిష్కారం చూపినందుకు ఆమెను కొనియాడారు. "ఏ సమస్య అయినా జనసేన దృష్టికి వస్తే పరిష్కారం కానిది లేదు" అంటూ కాలనీవాసులు వ్యాఖ్యానించారు.

# మాట ఇచ్చారు... నిలబెట్టుకోండి



- పాత పెన్షన్ విధానం పునరుద్ధరించండి
- కొత్త పెన్షన్ విధానం ఉద్యోగులకు తీవ్ర నష్టం
- సిపిఎస్ ఉద్యోగులకు పూర్తి మద్దతు
- నినాదాలతో మారుమోగిన ధర్నా చౌక్
- సుప్రీం తీర్పును అమలు చేయండి
- ఏపీ ఎన్జీజీవో రాష్ట్ర అధ్యక్షుడు అలపర్తి విద్యాసాగర్



విజయవాడ, సెప్టెంబర్ 2(జర్నలిస్ట్‌ఫైల్):

రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులకు తీవ్ర ఆర్థిక నష్టం కలిగించే సిపిఎస్ విధానాన్ని రద్దుచేసి పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించేంతవరకు సిపిఎస్ ఉద్యోగులు చేస్తున్న ప్రతి ఆందోళన కార్యక్రమానికి ఏపీ ఎన్జీజీవో అసోసియేషన్ సంపూర్ణ మద్దతు ప్రకటిస్తుందని ఏపీ ఎన్జీజీవో రాష్ట్ర అధ్యక్షులు అలపర్తి విద్యాసాగర్ అన్నారు. ఓ పి ఎస్ విధానం అమలు చేయాలంటూ సి పి ఎస్ ఉద్యోగులు తలపెట్టిన చలో విజయవాడ పేరుతో సోమవారం గాంధీ నగర్ లోని ధర్నా చౌక్ లో జరిగిన నిరసన కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం చేసిన చట్టం ప్రకారం 2004 నుంచి అమలు చేస్తున్న కొత్త పెన్షన్ విధానం వల్ల ప్రభుత్వ ఉద్యోగులకు జరిగే నష్టాన్ని నివారించేందుకు కొత్త పెన్షన్ విధానాన్ని సమీక్షించి మరింత మెరుగైన పెన్షన్ విధానం అమలు చేస్తామని ప్రస్తుత కూటమి ప్రభుత్వం మేనిఫెస్టోలో ఇచ్చిన హామీ నిలబెట్టుకోవాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సిపిఎస్ రద్దు చేసి పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించాలని కోరుతూ రాష్ట్ర నలుమూలల నుండి పెద్ద సంఖ్యలో ఉద్యోగ ఉపాధ్యాయులు హాజరై సిపిఎస్ ను రద్దు చేయాలని పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించి ఉద్యోగులకు న్యాయం చేయాలని కోరుతూ పెద్ద ఎత్తున నినాదాలు చేశారు.కొన్ని రాష్ట్రాలు ఇప్పటికే ఓపిఎస్ ను పునరుద్ధరించాయి. ఆ రాష్ట్రాల ఉద్యోగులు పొందుతున్న భద్రత మాకు కూడా రావాలి. ప్రభుత్వం ఈ అంశంపై సానుకూలంగా ఆలోచించాలి. లేకపోతే ఉద్యమాలు మరింత ముమ్మరం అవుతాయి. మేము అడుగుతున్నది ప్రత్యేక ప్రయోజనం కాదు. ఇది ఉద్యోగుల కనీస హక్కు. ఓపిఎస్ పునరుద్ధరణ మా భవిష్యత్తుకు, మా కుటుంబ భద్రతకు తప్పనిసరి. ప్రభుత్వం వెంటనే నిర్ణయం తీసుకోవాలని మా సంఘం మళ్లీ మళ్లీ కోరుతోందన్నారు. సిపిఎస్ ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కోరుకొండ సతీష్ మాట్లాడుతూ గత ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి సిపిఎస్ ఉద్యోగులకు అధికారంలోకి వచ్చిన వారంలోనే సిపిఎస్ విధానాన్ని రద్దు చేస్తానని చెప్పి మోసం చేయడం జరిగిందన్నారు. ఈ మోసాన్ని ఎండగడుతూ అప్పటి ప్రతిపక్ష నాయకులైన ఇప్పటి ముఖ్యమంత్రి ఉప ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, పవన్ కళ్యాణ్ సిపిఎస్ ఉద్యోగులకి వారంలో రద్దు చేస్తామని మోసం చేశావు... కానీ మేము అధికారంలోకి వచ్చిన సంవత్సరంలోపే సిపిఎస్ ఉద్యోగులను పిలిపించి వారితో చర్చించి వారికి ఆమోదయోగ్యమైన పెన్షన్ విధానాన్ని ప్రకటిస్తామని హామీ ఇచ్చారని గుర్తు చేశారు. అదే అంశాన్ని వారి ఉమ్మడి మేనిఫెస్టోలో కూడా పెట్టారన్నారు. కానీ ఇప్పటికీ 18 నెలలు పూర్తయినప్పటికీ ప్రభుత్వం నుండి చర్చల కొరకు ఎటువంటి ప్రతిపాదన చేయలేదు. చాలాసార్లు ముఖ్యమంత్రి, ఉప ముఖ్యమంత్రిలను కలిసే ప్రయత్నాలు చేసిన కూడా గత ప్రభుత్వం వలె ముఖ్యమంత్రి అపాయింట్మెంట్ దొరకడం లేదు. ఎన్నికల హామీలు నీటి మూటలువలే మారిపోతున్నాయన్నారు. ఏ ప్రభుత్వం వచ్చినా సిపిఎస్ ఉద్యోగులను నిర్లక్ష్యం చేస్తూ వారి భవిష్యత్తు జీవితాన్ని అంధకారంలోకి తోసే ప్రయత్నాలే చేస్తున్నాయి తప్ప సిటీ ఉద్యోగులను ఆదుకోవడానికి ఎటువంటి చర్యలు తీసుకోవడం లేదన్నారు. ప్రధాన కార్యదర్శి చింతగుంట్ల మరియ దాసుగారు మాట్లాడుతూ గత ఆరు సంవత్సరాలుగా సిపిఎస్ ఉద్యోగులకు చెల్లించాల్సిన డిఏ బకాయలు చెల్లించలేదన్నారు. తక్షణమే వాటిని సిపిఎస్ ఉద్యోగుల రాన్ అకౌంట్లకు జమ చేయాలని డిమాండ్ చేశారు. అదేవిధంగా సెంట్రల్ గవర్నమెంట్ సిపిఎస్ ఉద్యోగులకు అమలు చేస్తున్న అనేక మెమోలను రాష్ట్ర ప్రభుత్వం నిర్లక్ష్యం చేస్తూ ఉద్యోగులను మోసం చేస్తుందని, సెంట్రల్ మెమో 57 ప్రకారం 2003 డీఎస్సీ ఉపాధ్యాయులకు మరియు అదే సమయంలో అపాయింట్ అయిన ఇతర డిపార్ట్మెంట్ ఉద్యోగులకు తక్షణమే పాత పెన్షన్ విధానంలోకి మార్చాలని కోరారు. అదేవి ధంగా చనిపోయిన సిపిఎస్ ఉద్యోగుల కుటుం బాల నామినీలకు ప్రాన్ అకౌంట్లో ఉన్న అమౌంట్ లో 50% అమౌంట్ చెల్లిం చాలని కోరారు. పాత పెన్షన్ విధానం జీవితకాల భద్రతను కల్పించే దని, కానీ కొత్త విధానం మార్కెట్ ఆధారంగా ఉండటం వల్ల స్థిరత్వం లేనిదన్నారు. జీతంలో భాగాన్ని ఉద్యోగులు స్వయంగా కాంట్రిబ్యూట్ చేయవలసి రావడం, రిటైర్మెంట్ తర్వాత ఖచ్చితమైన పెన్షన్ హామీ లేకపోవడం వల్ల కుటుంబ భవిష్యత్ అస్థిరంగా మారుతుందన్నారు. సంవత్సరాల తరబడి సేవ చేసిన ఉద్యోగులు వృద్ధాప్యంలో కనీస భద్రత కోసం డిమాండ్ చేస్తున్నామన్నారు. మార్కెట్‌పై ఆధారపడే పెన్షన్‌తో కాకుండా, ఓపిఎస్ వంటి స్థిరమైన విధానం మాత్రమే వారికి రక్షణ కల్పిస్తుందన్నారు. ఓపిఎస్ విధానాన్ని ఇప్పటికే అమలు చేస్తున్న రాజస్థాన్, చత్తీస్ గడ్, జార?ండ్, పంజాబ్, హిమాచల్ ప్రదేశ్ రాష్ట్రాలను నమూనాగా తీసుకోవాలన్నారు."మేము సంవత్సరాల తరబడి ప్రభుత్వానికి అంకితభావంతో సేవలందిస్తున్నాం. కానీ రిటైర్మెంట్ తర్వాత మా భవిష్యత్‌ను మార్కెట్ ఆధారంగా వదిలేయడం మాకు అంగీకారమేమీ కాదు. పాత పెన్షన్ విధానం లో ఉద్యోగికి జీవితకాలం ఖచ్చితమైన పెన్షన్ లభిస్తుంది. కానీ కొత్త విధానం లో అది లేదు. ఉద్యోగి ఎంత కష్టప డినా, చివరికి మార్కెట్ పరిస్థితులమీదే అతని వృద్ధాప్యం ఆధారపడి పోతుంది. ఇది ఒక రకంగా అన్యాయం. మా డిమాండ్ చాలా సూటిగా ఉంది. ఓపిఎస్ ను తిరిగి అమలు చేసి, ఉద్యోగి కుటుంబానికి ఆర్థిక భద్రత కల్పించాలన్నారు. ఏపీ ఎన్జీజీవో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, అసిస్టెంట్ సెక్రెటరీ జనరల్ డి. వి. రమణ, పిడిఎఫ్ ఎమ్ ఎల్ సి బుర్ర గోపి మూర్తి, ఏపి టి ఎఫ్ నాయకులు పాండురంగ శర్మ, ఏపిటిఎఫ్ రాష్ట్ర నాయకులు హృదయ రాజు,యు టిఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు నక్క వెంకటేశ్వర్లు, పార్థసారథి, యుటి యు అధ్యకులు సాయి శ్రీనివాస్, 2003 డిఎస్ సి ఫారం నాయకులు కె. ఎల్. శ్రీనాద్, సీపీఎస్ఈఎ నాయకులు రాజేష్, రవి కుమార్, అప్పలనాయుడు, ఏపీ ఎన్జీజీవోస్ పశ్చిమ కృష్ణ అధ్యక్షులు సత్యనారాయణ రెడ్డి, కార్యదర్శి పి రమేష్ , ఏపి టి ఎఫ్ నాయకులు భానుమూర్తి, తదితరులతో సహా పలువురు రాష్ట్రస్థాయి ఉద్యోగ సంఘాల నాయకులు పాల్గొన్నారు.

# జిల్లాలో అందుబాటులో 21,167 మెట్రిక్ టన్నుల ఎరువులు

- సీజన్ లో ఇప్పటివరకు 48,158 మెట్రిక్ టన్నుల ఎరువులు సరఫరా
- ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ డా. జి. లక్ష్మీశ

విజయవాడ, సెప్టెంబర్ 2(జర్నలిస్ట్‌ఫైల్):

ఎన్ టి ఆర్ జిల్లాలో ఖరీఫ్ బి 2025 సీజన్ అవసరాలకు ప్రస్తుతం 21,167 మెట్రిక్ టన్నుల ఎరువులు అందుబాటులో ఉన్నాయని ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సీజన్ లో ఇప్పటివరకు 48,158 మెట్రిక్ టన్నులు ఎరువులు రైతులకు సరఫరా చేయటం జరిగిందని.. సోమవారం నాటికి సాధారణ విస్తీర్ణంలో 91 శాతం (94,931 హె. కు 86,492 హె.లలో) పంటలు సాగు చేయటం జరిగిందన్నారు. ఆగస్టు 31 నుంచి సెప్టెంబర్ 2వ తేదీ వరకు జిల్లాకు మరో 1,500 మెట్రిక్ టన్నుల యూరియా సరఫరా చేయటం జరుగుతుందని.. అదేవిధంగా సెప్టెంబర్ 7వ తేదీలోగా ఇంకా 2,750 మెట్రిక్ టన్నుల యూరియాను అందుబాటులోకి తీసుకురావటం జరుగుతుందన్నారు. కావున రైతులు ఆందోళన చెందవలసిన అవసరం లేదని తెలిపారు. ఎక్కువ ధరలకు కొనుగోలు చేయకండనీ.. ఏ షాప్ వారైనా ఎక్కువ ధర డిమాండ్ చేసినట్లయితే కలెక్టరేట్ లోని కమాండ్ కంట్రోల్ రూమ్ నెంబర్ 9154970454 కు కాల్ చేసి ఫిర్యాదు చేయాలని కలెక్టర్ లక్ష్మీశ సూచించారు.

# రైతులను దగా చేస్తున్న కూటమి ప్రభుత్వం





### మాజీ ఎమ్మెల్యే వెంకటే గౌడ

వి.కోట, సెప్టెంబర్ 2(జర్నలిస్ట్‌ఫైల్):

కళ్ళబొల్లి హామీలు ఇచ్చి ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్రంలో అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం రైతులను ఘోరంగా మోసగిస్తోందని పలమనేరు మాజీ శాసనసభ్యులు వెంకటేగౌడ అన్నారు. వి.కోట మండలంలోని గోనుమాకులపల్లి గ్రామపంచాయతీలో సోమవారం నిర్వహించిన రీకాలింగ్ చంద్రబాబూస్ మేనిఫెస్టో "క్యూ ఆర్ కోడ్ పోస్టర్" పంపిణీ కార్యక్రమానికి వారు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గతంలో రైతన్నలకు అన్ని విషయాల్లో తోడుగా ఉండేందుకు వైఎస్సార్సీపీ ప్రభుత్వం పలమనేరు నియోజకవర్గంలో 88 రైతు భరోసా కేంద్రాలు ఏర్పాటు చేసి రైతుల ప్రతి అవసరాన్నీ తీర్చి గ్రామీణ ప్రాంత రైతులకు సేవలందించాయన్నాని గుర్తుచేశారు. కానీ ప్రస్తుతం కూటమి ప్రభుత్వంలో యూరియా కోసం రైతులు గంటల తరబడి క్యూలో నిలబడాల్సిన అవస్థలు, రవాణా ఖర్చుతో పాటు సమ యం కూడా వృథా చేస్తున్నారని రైతన్నలు మండిపడుతున్నారని తెలిపారు. రాష్ట్రంలోని రైతులందరికీ 2024 సంవత్సరానికి గానూ అన్నదాత సుఖీభవ ఎగనామం పెట్టడమే కాక.. ఈ పర్యాయం ఏడువేలమంది రైతులకు అన్నదాత సుఖీభవ ఎగకొట్టారన్నారు. గత ప్రభుత్వంలో లబ్ధిదారులుగా ఉండి కూటమి ప్రభుత్వంలో కోతకు గురైన 7,021 మంది రైతుల పరిస్థితి ఏమిటని ఆవేదన వ్యక్తం చేశారు. "బాబు షూరిటీ ౦ మోసం గ్యారంటీ" సమావేశాలు ప్రతి ఒక్క వార్డులో ఏర్పాటు చేయాలని ఉమ్మడి చిత్తూరు జిల్లా పరిషత్ చైర్మన్ శ్రీనివాసులు స్థానిక నాయకులను ఆదేశించారు. గ్రామాల్లోని ఇంటింటికి ప్రచారం చేయాలని, చంద్రబాబు పాలనలో చోటుచేసుకుంటున్న అవినీతి, ప్రజా వ్యతిరేక విధానాలను స్పష్టంగా ప్రజల్లోకి తీసుకెళ్లడమే లక్ష్యంగా ప్రతి ఒక కార్యకర్త కృషి చేయాలని పిలుపునిచ్చారు. ప్రతి కార్యకర్త ఈ ఉద్యమంలో భాగస్వామి కావాలని ప్రజలను మోసం చేసిన కూటమి పాలకులని నిలదీయాలని పిలుపునిచ్చారు. వైసీపి అధినేత మాజీ ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి నాయకత్వంలో ప్రజాసంక్షేమ కార్యక్రమాలు గ్రామాల్లో ప్రజలకు తెలియజేయాలని సూచించారు.ఈ కార్య క్రమంలో వైస్సార్సీపీ మండల అధ్యక్షులు యువరాజ్, వైస్ ఎంపీపీ డా.తమిమ్ ఖాన్,గోనుమాకులపల్లి పంచాయతీ వైయస్ ఆర్ సీపీ నాయకులు, వివిధ అనుబంద సంఘాల నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

# యుద్ధానికి సత్వరముగింపే పరిష్కారం!

## రష్యా అధ్యక్షుడు పుతిన్‌తో ప్రధాని మోడీ చిట్‌చాట్



**తియాంజిన్, సెప్టెంబరు 2:** ఉక్రెయిన్ సంక్షోభంపై భారత ప్రధాని నరేంద్ర మోదీ తన వైఖరిని మరోసారి ప్రపంచ వేదికపై స్పష్టం చేశారు. యుద్ధానికి త్వరగా ముగింపు పలికి, శాంతిని పునరుద్ధరించాలని రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్‌తో అన్నారు. చైనాలోని తియాంజిన్‌లో జరుగుతున్న షాంఘై సహకార సంస్థ (ఎస్‌సీఓ) సదస్సు సందర్భంగా సోమవారం ఇరువురు నేతలు ప్రత్యేకంగా సమావేశమయ్యారు. ఈ భేటీలో ప్రధాని మోదీ మాట్లాడుతూ, ఉక్రెయిన్ సంక్షోభ పరిష్కారానికి ఇటీవల జరుగుతున్న ప్రయత్నాలను మేం స్వాగతిస్తున్నాం. ఇందులో భాగస్వాములైన అన్ని పక్షాలు నిర్మాణాత్మకంగా ముందుకు సాగుతాయని ఆశిస్తున్నాం. ఈ ఘర్షణను వీలైనంత త్వరగా ముగించి, ప్రాంతీయంగా శాంతి, స్థిరత్వాన్ని నెలకొల్పే మార్గాలను మనం కనుగొనాలి. ఇది యావత్ మానవాళి పిలుపుఅని స్పష్టం చేశారు. మోదీ వ్యాఖ్యలకు పుతిన్ కూడా సానుకూలంగా స్పందించారు. ఎస్‌సీఓ సదస్సులో తన ప్రసంగం సందర్భంగా, ఉక్రెయిన్ సంక్షోభ పరిష్కారంలో భారత్, చైనా వంటి వ్యూహాత్మక భాగస్వాములు అందిస్తున్న సహకారాన్ని తాము ఎంతగానో గౌరవిస్తున్నామని పుతిన్ పేర్కొన్నారు. గత నెలలో అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌తో కుదిరిన అవగాహనలు ఉక్రెయిన్‌లో శాంతికి మార్గం సుగమం చేశాయని ఆయన ప్రస్తావించారు. ఈ భేటీ తర్వాత ప్రధాని మోదీ స్పందిస్తూ, పుతిన్‌తో సమావేశం అద్భుతంగా జరిగిందని తెలిపారు. వాణిజ్యం, ఎరువులు, అంతరిక్షం, భద్రత, సాంస్కృతిక రంగాల్లో ద్వైపాక్షిక సహకారాన్ని మరింత బలోపేతం చేసుకోవడంపై చర్చించామని వెల్లడించారు. ఉక్రెయిన్ సంక్షోభానికి శాంతియుత పరిష్కారంతో సహా ప్రాంతీయ, అంతర్జాతీయ పరిణామాలపై మేం అభిప్రాయాలు పంచుకున్నాం. మన ప్రత్యేక, విశేషాధికార వ్యూహాత్మక భాగస్వామ్యం ప్రాంతీయ, ప్రపంచ స్థిరత్వానికి కీలక స్తంభంగా నిలుస్తుందని ఆయన పేర్కొన్నారు. మరోవైపు, ఎస్‌సీఓ సదస్సు కోసం చైనాకు వచ్చిన వెంటనే శనివారం ప్రధాని మోదీకి ఉక్రెయిన్ అధ్యక్షుడు వొలొదిమిర్ జెలెన్‌స్కీ ఫోన్ చేయడం గమనార్హం. అమెరికా అధ్యక్షుడు ట్రంప్, యూరప్ నేతలతో వాషింగ్టన్‌లో జరిగిన చర్చల వివరాలను జెలెన్‌స్కీ ప్రధానికి వివరించారు. ఈ సంక్షోభ పరిష్కారానికి అవసరమైన ప్రయత్నాలు చేసేందుకు భారత్ సిద్ధంగా ఉందని, ఎస్‌సీఓ సదస్సు వేదికగా రష్యాకు సరైన సంకేతాలు పంపుతామని మోదీ ఆయనకు హామీ ఇచ్చినట్లు తెలిసింది.

## ఇసి, రాజకీయ పార్టీల మధ్య విభేదాలు దురదృష్టకరం

### బీహార్ సర్‌పై సుప్రీం వ్యాఖ్యలు




**న్యూఢిల్లీ, సెప్టెంబరు 2:** బీహార్ ఓటర్ల జాబితా సవరణ ప్రక్రియపై దాఖలైన పిటిషన్ల విచారణ సందర్భంగా సుప్రీంకోర్టు కీలక వ్యాఖ్యలు చేసింది. ఓటర్ల జాబితాలో మార్పులు, చేర్పుల కోసం నామినేషన్ల దాఖలుకు చివరి తేదీ వరకు అవకాశం ఉంటుందని ఎన్నికల సంఘం (ఈసీ) కోర్టుకు స్పష్టం చేసింది. దీంతో సెప్టెంబర్ 1తో ముగిసిన గడువుపై ఆందోళన చెందాల్సిన అవసరం లేదని తేలిపోయింది. బీహార్‌లో అసెంబ్లీ ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో, ఎన్నికల సంఘం ఆగస్టు 1న ఓటర్ల ముసాయిదా జాబితాను విడుదల చేసింది. దీనిపై అభ్యంతరాలు తెలిపేందుకు సెప్టెంబర్ 1ని తుది గడువుగా నిర్ణయించింది. ఈ గడువును పొడిగించాలని కోరుతూ కొందరు సుప్రీంకోర్టును ఆశ్రయించారు. ఈ పిటిషన్‌పై ఈరోజు విచారణ జరిగింది. ఈ సందర్భంగా ఎన్నికల సంఘం తన వైఖరిని తెలియజేసింది. అభ్యంతరాలను సెప్టెంబర్ 30 తర్వాత కూడా స్వీకరిస్తామని, నామినేషన్ల ప్రక్రియ ముగిసేంత వరకు సవరణలు కొనసాగుతాయని సుప్రీంకోర్టుకు హామీ ఇచ్చింది. ఈసీ వివరణ అనంతరం, సుప్రీంకోర్టు కీలక వ్యాఖ్యలు చేసింది. ఎన్నికల సంఘం, రాజకీయ పార్టీల మధ్య ఇలాంటి విభేదాలు తలెత్తడం దురదృష్టకరమని అభిప్రాయపడింది. అదే సమయంలో, ఓటర్ల జాబితాలో ఫిర్యాదులు చేయడంపై ప్రజలకు అవగాహన కల్పించేందుకు వాలంటీర్లను నియమించాలని బీహార్ లీగల్ సర్వే అథారిటీని ఆదేశించింది. కాగా, ఈసీ విడుదల చేసిన ముసాయిదా జాబితా నుంచి సుమారు 65 లక్షల మంది ఓటర్ల పేర్లను తొలగించడం, పౌరసత్వంపై అనుమానాలున్న 3 లక్షల మందికి నోటీసులు జారీ చేయడం రాష్ట్రంలో తీవ్ర చర్చనీయాంశంగా మారిన విషయం తెలిసిందే. ఈ పరిణామాల నేపథ్యంలోనే ఈ అంశం సుప్రీంకోర్టుకు చేరింది.

## రూటు మార్చిన అమెరికా..భారత్‌పై ప్రశంసల వర్షం

**తియాంజిన్, సెప్టెంబరు 2:** షాంఘై సహకార సదస్సు (ఎస్‌సీవో) వేదికగా ఆసక్తికర రాజకీయ పరిణామం చోటుచేసుకుంది. భారత ప్రధాని నరేంద్ర మోదీ, రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్‌ల ద్వైపాక్షిక సమావేశానికి కొద్ది నిమిషాల ముందు, భారత్ పట్ల అమెరికా తన వైఖరిని మార్చుకుంది. ఇప్పటివరకు భారత్‌పై విమర్శలు గుప్పించిన ట్రంప్ యంత్రాంగం నుంచి అనూహ్యంగా ప్రశంసలు వెల్లువెత్తడం అంతర్జాతీయ వర్గాల్లో చర్చనీయాంశమైంది. అమెరికా విదేశాంగ మంత్రి మార్కో రూబియో, భారత్‌తో తమ బంధం అత్యంత పటిష్టంగా ఉందని సోషల్ మీడియా వేదికలో పేర్కొన్నారు. ఇరు దేశాల మధ్య వ్యాపారం, రక్షణ, సృజనాత్మకత వంటి అనేక రంగాల్లో సహకారం అద్భుతంగా ముందుకు సాగుతోందని ఆయన కొనియాడారు. 21వ శతాబ్దంలో భారత్ అమెరికా సంబంధాలు సరికొత్త శిఖరాలను అధిరోహిస్తున్నాయి. ఇరు దేశాల ప్రజల మధ్య ఉన్న స్నేహమే మా బంధానికి పునాది అని రూబియో తన పోస్టులో వివరించారు. అయితే, రూబియో ఈ ప్రశంసలు గుప్పించడానికి కొన్ని గంటల ముందే ట్రంప్ వాణిజ్య సలహాదారు పీటర్ నవారో నుంచి భారత్‌పై తీవ్రమైన ఆరోపణలు రావడం గమనార్హం. ఉక్రెయిన్ యుద్ధానికి భారత్ కారణమంటూ ఆయన అనుచిత వ్యాఖ్యలు చేశారు. ఈ నేపథ్యంలో అమెరికా ప్రభుత్వం నుంచి భిన్న స్వరాలు వినిపించడం గందరగోళానికి తావిచ్చింది. మరోవైపు, ట్రంప్ విధించిన వాణిజ్య సుంకాలు చట్టవిరుద్ధమంటూ అమెరికా ఫెడరల్ అప్పీల్స్ కోర్టు తాజాగా తీర్పు ఇవ్వడం కూడా ట్రంప్ ప్రభుత్వానికి ఇబ్బందికరంగా మారింది. ఈ ప్రతికూల పరిణామాల నేపథ్యంలో, నష్ట నివారణ చర్యల్లో భాగంగానే రూబియో ఈ ప్రకటన చేసి ఉండవచ్చని రాజకీయ విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. ఎస్‌సీవో వేదికపై భారత్, రష్యా, చైనా వంటి దేశాలు ఒకే చోట చేరడం కూడా అమెరికా వ్యూహాత్మక మార్పునకు కారణమై ఉండొచ్చని వారు భావిస్తున్నారు.

## షాంఘై సదస్సులో పాక్ పిఎంను పట్టించుకోని మోడీ



**తియాంజిన్, సెప్టెంబరు 2:** చైనాలోని తియాన్‌జిన్ వేదికగా షాంఘై సహకార సంస్థ (ఎస్‌సిఒ) 25వ శిఖరాగ్ర సదస్సు సోమవారం ప్రారంభమైంది. చైనా అధ్యక్షుడు షీ జిన్‌పింగ్ అధ్యక్షతన జరుగుతున్న ఈ సదస్సుకు భారత ప్రధాని నరేంద్ర మోడీ, రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్ సహా వివిధ దేశాధినేతలు హాజరయ్యారు. ప్రధాని మోడీ రష్యా అధ్యక్షుడు పుతిన్, జిన్‌పింగ్ షేక్‌హ్యాండ్ ఇచ్చి ఆలింగనం చేసుకుంటూ సరదాగా మాట్లాడుకుంటూ చిరునవ్వులు చిందిస్తున్న దృశ్యాలు అందరినీ ఆకర్షించాయి. కాగా ఆపరేషన్ సిందూర్ తర్వాత మొదటిసారిగా షాంఘై సదస్సులో భారత్, పాక్ ప్రధానులు ఎదురుపడిన దృశ్యాలు సోషల్ మీడియాలో వైరల్‌గా మారాయి. అందులో ప్రధాని నరేంద్రమోడీ, పుతిన్ కలిసి వెళ్తుండగా పాక్ ప్రధాని షెహబాజ్ షరీఫ్ అక్కడే నిల్చున్నప్పటికీ మోడీ ఆయనను పట్టించుకోకుండా, పలకరించకుండా వెళ్లిపోయిన దృశ్యాలు కనిపిస్తున్నాయి. మరో సందర్భంలో పుతిన్ అక్కడి నేతలను పలకరిస్తున్న సమయంలో పాక్ ప్రధాని అక్కడున్న వారిని దాటుకొని పుతిన్‌కు షేక్‌హ్యాండ్ ఇవ్వడానికి ప్రయత్నిస్తున్న దృశ్యాలు వైరల్‌గా మారాయి.

## చిరువ్యాపారికి రూ.141 కోట్ల ఐటి నోటీసులు

**బులంద్‌షహర్, సెప్టెంబరు 2:** ఉత్తరప్రదేశ్‌లోని బులంద్‌షహర్‌లో ఓ చిన్న కిరాణా దుకాణం నడుపుకునే వ్యక్తికి ఆదాయ పన్ను (ఐటీ) శాఖ నుంచి ఊహించని షాక్ తగిలింది. ఏకంగా రూ. 141 కోట్లకు పైగా అమ్మకాలు జరిపినట్లు ఆయనకు నోటీసులు అందాయి. తన పాన్ కార్డును ఎవరో దుర్వినియోగం చేసి ఈ భారీ మోసానికి పాల్పడ్డారని బాధితుడు వాపోతున్నాడు. ఖుర్జాలోని నయాగంజ్ ప్రాంతానికి చెందిన సుధీర్ అనే వ్యక్తి తన ఇంట్లోనే ఓ చిన్న కిరాణా దుకాణం నడుపుతూ జీవనం సాగిస్తున్నాడు. అయితే, ఆయన పేరు మీద ఢిల్లీలో ఆరు కంపెనీలు రిజిస్టర్ అయినట్లు, వాటి ద్వారా రూ. 141,38,47,126 విలువైన అమ్మకాలు జరిగినట్లు ఐటీ శాఖ నుంచి ఆయనకు నోటీసులు వచ్చాయి. ఇది చూసి సుధీర్ కంగుతిన్నారు. ఈ విషయంపై సుధీర్ మాట్లాడుతూ ఈ ఏడాది జులై 10న నాకు ఐటీ శాఖ నుంచి నోటీసు వచ్చింది. నేను రూ. 141 కోట్లకు పైగా అమ్మకాలు జరిపినట్లు అందులో ఉండటం చూసి దిగ్భ్రాంతికి గురయ్యానని తెలిపారు. తనకు 2022లోనే తొలిసారి నోటీసు వచ్చిందని, అప్పుడే ఐటీ అధికారులను కలిసి ఆ కంపెనీలతో తనకు ఎలాంటి సంబంధం లేదని వివరించినట్లు ఆయన చెప్పారు. గుర్తుతెలియని వ్యక్తులు తన పాన్ కార్డును మోసపూరితంగా ఉపయోగించి ఈ కంపెనీలను సృష్టించారని ఆయన ఆరోపించారు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామని, ప్రస్తుతం దర్యాప్తు కొనసాగుతోందని పోలీసులు వెల్లడించారు.

## 8న అసోంలో పర్యటించనున్న ప్రధాని మోడీ

### ప్రత్యేక కానుకను సిద్ధం చేసిన స్థానిక నేత కార్మికురాలు



**గౌహతి, సెప్టెంబరు 2:** ప్రధాని నరేంద్ర మోడీ సెప్టెంబర్ 8న అస్సాంలో పర్యటించనున్న నేపథ్యంలో అక్కడి స్థానిక నేత కార్మికురాలు పూర్ణిమ బైశ్యా ప్రధాని మోడీ కోసం ప్రత్యేక కానుకను సిద్ధంచేసింది. స్థానిక మీడియా వరాలు తెలిపిన వివరాల ప్రకారం నల్బరి జిల్లాకు చెందిన నేత కార్మికురాలు పూర్ణిమ బైశ్యా ప్రధానమంత్రి మోడీ చిత్రపటాన్ని కలిగి ఉన్న ప్రత్యేకమైన చేతితో నేసిన గమూసాను తయారు చేసింది. వెదురురెల్లు, కాటన్ దారాలతో సంప్రదాయ అస్సామీ డిజైన్లతో దీనిని నేసినట్లు ఆమె పేర్కొంది. ప్రధాని అస్సాంకు వచ్చినప్పుడు తను స్వయంగా తయారుచేసిన చేసిన గమూసాను బహుమతిగా ఇచ్చి ఆయనపై తనకున్న అభిమానాన్ని చాటుకోవాలనుకుంటున్నట్లు తెలిపింది. అస్సామీ వస్త్రకళపై మక్కువతో తనకు 12 ఏళ్ల వయసు నుంచే పూర్ణిమ బైశ్యా గమూసాను నేస్తోంది.

# రూ.7 కోట్ల హాంగ్‌కీ కారులో చక్కర్లు కొట్టిన మోడీ



**బీజింగ్, సెప్టెంబరు 2:** ప్రధాని మోదీ చైనాలో రెండు రోజుల పర్యటనలో ఉన్న ప్రధానిమోదీ చైనా దేశాధ్యక్షుడు జీ జిన్‌పింగ్ వినియోగించే అత్యంత విలాసవంతమైన కారులో చక్కర్లు కొట్టారు. హాంగ్‌కీ ఎల్5 లిమినోసిన్ కారులో మోదీ ప్రయాణించారు. షాంఘై సహకార సంస్థ సమావేశాల్లో పాల్గొంటున్న ఆయన ఈ కారును వినియోగించారు. మోదీ పర్యటించిన హాంగ్‌కీ ఎల్5 మోడల్ కారునే చైనా దేశాధ్యక్షుడు జీ జిన్‌పింగ్ కూడా వాడుతున్నారు. చైనీస్ టాప్ నేతలతో పాటు ప్రముఖ విదేశీ నేతలకు మాత్రమే ఈ కారును వినియోగిస్తుంటారు. 2019లో ఇండియాలోని మహాబలిపురంకు జీ జిన్‌పింగ్ వచ్చిన సమయంలో ఎల్5 కారులోనే ఆయన తిరిగారు. హాంగ్‌కీని హాంగ్‌చీ అని పలుకుతారు. మాండరిన్ భాషలో దీని అర్థం ఎరుపు జెండా అని. ఫస్ట్ ఆటోమోబైల్ వర్క్స్ గ్రూపు దీన్ని తయారు చేస్తోంది. ఇది పూర్తిగా మేడిన్ చైనా వాహనం. 1958లో ఈ కారును తొలిసారి లాంచ్ చేశారు. చైనాలో అతిపురాతన ప్యాసింజెర్ కారుగా దీన్ని భావిస్తారు. చైనాలోని సంపన్న వర్గాలు ఈ కారును వినియోగిస్తుంటారు. డిజైన్, నిర్మాణం, ప్రమోషన్ మొత్తం చైనాలోనే సాగుతుంది. నిజానికి తొలుత కమ్యూనిస్టు పార్టీ నేతల కోసం మాత్రమే ఈ కారును ఉత్పత్తి చేశారు. హాంగ్‌కీ కార్ల ఉత్పత్తి 1981లో నిలిచిపోయింది. ఆ తర్వాత మళ్లీ 1990 మధ్య కాలంలో ఉత్పత్తి ప్రారంభించారు. హాంగ్‌కీ వర్షన్‌కు చెందిన ఎల్5 మోడల్‌కు ప్రత్యేక గుర్తింపు ఉన్నది. హాంగ్‌కీ ఎల్5 కారులో 6.0 లీటర్ల వీ12 ఇంజిన్ ఉంది. సుమారు 400 హార్స్‌పవర్ల శక్తి ఉత్పత్తి చేస్తుంది. కేవలం 8.5 సెకన్లలో అది వంద కిలోమీటర్ల వేగాన్ని అందుకుంటుంది. దీని టాప్ స్పీడ్ గంటకు 210 కిలోమీటర్లు. ఈ కారు 5.5 మీటర్ల పొడుగు, మూడు టన్నుల బరువు ఉంటుంది. కారులోపల చాలా స్పేసియస్ సీటింగ్ ఉంటుంది. లెదర్ సీట్లు ఉంటాయి.

రియర్ సీట్ల వద్ద మసాజ్, హీటింగ్, వెంటిలేషన్ సౌకర్యాలు ఉంటాయి. ఆల్ వీల్ డ్రైవ్, క్రూయిజ్ కంట్రోల్, పార్కింగ్ సెన్సార్లు, 360 డిగ్రీ కెమెరాలు ఉన్నాయి. హాంగ్‌కీ ఎల్ 5 కారు ఖరీదు సుమారు 5 మిలియన్ల యువాన్లు. అంటే భారత కరెన్సీలో సుమారు ఏడు కోట్లు. చైనాలో ఉత్పత్తి అవుతున్న అత్యంత ఖరీదైన కారు ఇదే. చైనా అధ్యక్షుడు జీ జిన్‌పింగ్ తరుచుగా జరిగే పబ్లిక్ కార్యక్రమాలకు హాంగ్‌కీ ఎల్ 5 కారులోనే వెళ్తుంటారు. అమెరికా అధ్యక్షుడు ప్రయాణించే ది బీస్ట్ కారుకు సమానంగా ఉన్న హాంగ్‌కీ ఎన్701 మోడల్ కారులో కూడా జీ జిన్‌పింగ్ ప్రయాణిస్తారు. కమ్యూనిస్టు దిగ్గజ నేత మావో జిదాంగ్ హాంగ్‌కీ వర్షన్ కారును వాడినట్లు తెలుస్తోంది. అమెరికా అధ్యక్షుడు నిక్సన్ 1972లో చైనాలో పర్యటించిన సమయంలో ఆయన ఈ కారు ఎక్కినట్లు తెలుస్తోంది.

## సంక్షిప్తంగా..

### షార్ట్‌కట్‌లో వెళితే షార్ట్ అయిపోతాం:కేంద్ర మంత్రి గడ్కరీ



**నాగ్‌పూర్, సెప్టెంబరు 2:** కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీ మరోసారి రాజకీయాలపై తనదైన శైలిలో సంచలన వ్యాఖ్యలు చేశారు. ప్రజలను మోసం చేసేవారినే గొప్ప నాయకులుగా పరిగణిస్తారని, తాను పనిచేసే రంగంలో మనస్ఫూర్తిగా నిజం మాట్లాడటం నిషిద్ధమని అన్నారు. నిర్మొహమాటంగా మాట్లాడతారనే పేరున్న గడ్కరీ చేసిన ఈ వ్యాఖ్యలు ఇప్పుడు రాజకీయ వర్గాల్లో హాట్ టాపిక్‌గా మారాయి. నాగ్‌పూర్‌లో 'అఖిల భారత మహానుభావ పరిషత్తు' నిర్వహించిన ఒక కార్యక్రమంలో నితిన్ గడ్కరీ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, జీవితంలో విజయం సాధించడానికి అడ్డదారులను ఎంచుకోవద్దని ప్రజలకు సూచించారు. ఏదైనా సాధించడానికి ఒక షార్ట్ కట్ ఉంటుంది. కానీ, మీరు షార్ట్ కట్ వాడితే, అది మిమ్మల్ని షార్ట్‌గా కట్ చేస్తుంది. అందుకే నిజాయితీ, విశ్వసనీయత వంటి విలువలను పాటించాలని ఆయన హితవు పలికారు. సమాజంలో నిజం, అంకితభావం వంటి విలువలు దీర్ఘకాలిక విజయాన్ని అందిస్తాయని గడ్కరీ పేర్కొన్నారు.



## 24 గంటల్లో ముంబయిని వీడి వెళ్లాల్సిందే..

### మరాఠా రిజర్వేషన్ ఆందోళనకారులకు ముంబై హైకోర్టు ఆదేశం

**ముంబయి, సెప్టెంబరు 2:** మరాఠాలకు పదిశాతం రిజర్వేషన్లు కల్పించాలనికోరుతూ సామాజిక కార్యకర్త మనోజ్ జరాంగే చేస్తున్న ఉద్యమం తీవ్రరూపం దాల్చింది. మరోవైపు మరాఠా కోటా నిరసనలపై బాంబే హైకోర్టు ఆగ్రహం వ్యక్తం చేసింది. ఈ నిరసనలు ముంబయిలో తీవ్ర ట్రాఫిక్ జామ్‌కు కారణం కావడంతో హైకోర్టు అసహనం వ్యక్తంచేసింది. మంగళవారం లోగా నిరసనకారులు ముంబయి వీధులను వీడాలని ఆదేశించింది. సోమవారం ముంబయిలోని ఆజాద్‌మైదాన్‌లో మరాఠా రిజర్వేషన్ల ఆందోళన చేపట్టారు. వేలాదిమంది నిరసనకారులు దక్షిణముంబయికి చేరుకోవడంతోసిఎస్టీ, పోర్ట్, చర్చిగేట్ తదితర మార్గాల్లో భారీగా ట్రాఫిక్ నిలిచిపోయింది. నిరసనకారులు పలు మార్గాలను బ్లాక్‌చేసారు. దీనితో వాహనదారులకు తీవ్ర ఇబ్బందులు ఎదురయ్యాయి. ఈనిరసనలపై హైకోర్టు ఆగ్రహం వ్యక్తంచేసింది. నిరసనలు శాంతియుతంగా జరగడంలేదని, నిబంధనలు ఉల్లంఘిస్తున్నారని వ్యాఖ్యలు చేసింది. ఉద్యమకారుడు మనోజ్ జరాంగేపాటిల్ ఆతడి మద్దతుదారులు ముంబయి వీధులను మంగళవారం మధ్యాహ్నంలోగా ఖాళీచేయాలని ఆదేశించింది. రిజర్వేషన్లు కల్పించాలన్న తన డిమాండ్ నెరవేరేవరకూ ముంబయి విడిచి వెళ్లనని కోటా ఉద్యమకారుడు మనోజ్ జరాంగే ముందురోజే స్పష్టంచేసిన సంగతి తెలిసిందే.

## షాంఘై సహకార సదస్సులో నెగ్గిన భారత్ పంతం



**బీజింగ్, సెప్టెంబరు 2:** షాంఘై సహకార సంస్థ (ఎస్‌సిఒ)లో పహల్గాం ఉగ్రదాడిని ఖండించే విషయంలో భారత్ తన పంతం నెగ్గించుకొంది. ఉగ్రవాదం అంశంలో భారత్ రాజీ లేని వైఖరి ఎట్టకేలకు ఎస్‌సిఒను ఏకతాటిపైకి తెచ్చి పహల్గాం ఉగ్రదాడిని ఖండించేలా తీర్మానం చేయించింది. భారత్‌కు ఇదో పెద్ద దౌత్య విజయంగా నిలిచింది.

**నాడు పహల్గాంను నిరాకరించి.. బలూచ్‌ను చేర్చి..**

ఇదే ఎస్‌ఇఒకు సంబంధించిన రక్షణ మంత్రుల సదస్సు క్వింగ్డావోలో జరిగింది. నాడు పహల్గాం ఉగ్రదాడి ఘటనను దాటవేస్తూ చేసిన సంయుక్త ప్రకటనపూ నిర్మొహమాటంగా సంతకం చేయకుండా తన వైఖరిని భారత్ స్పష్టంగా చెప్పింది. ప్రస్తుతం ఎస్‌సిఒకు అధ్యక్షత వహిస్తున్న చైనాతో పాకిస్థాన్‌కు సన్నిహిత సంబంధాలున్నాయి. క్లింగ్డావో సదస్సు సంయుక్త ప్రకటనలో పహల్గాం ఉగ్రదాడిని చేర్చేందుకు బీజింగ్ నిరాకరించింది. కానీ, నాటి భారత్ రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ ప్రతిస్పందన చాలా ఘాటుగా ఉంది. చైనా ముందే పాకిస్థాన్‌కు ఆయన చురకలు అంటించారు. సీమాంతర ఉగ్రవాదాన్నే కొన్ని దేశాలు ప్రభుత్వ విధానంగా ఎంచుకొన్నాయని మండిపడ్డారు.

శాంతి, ఉగ్రవాదం ఒకే మార్గంలో ఉండటం అసాధ్యమని నిలకడగా తన వాదనను భారత్ లేవనెత్తింది. ఎంత ప్రఖ్యాత వేదిక అయినా సూత్రాలు, విలువల విషయంలో రాజీ లేదని పేర్కొంది. దీనికితోడు నాడు పాక్‌కు అనుకూలంగా బలోచిస్థాన్ అంశాన్ని డిక్లరేషన్‌లో చేర్చడం గమనార్హం.

**శిఖరాగ్ర సదస్సు నాటికి మారిన పరిస్థితులు..**

ఇక ఎస్‌సిఒ శిఖరాగ్ర సదస్సు నాటికి అమెరికా అధ్యక్షుడు ట్రంప్ దుందుడుతనం గణనీయంగా పెరిగిపోయింది. ఈ క్రమంలో చైనా, భారత్ రెండూ వాషింగ్టన్ వైఖరితో ఇబ్బంది పడుతున్నాయి. దీనికితోడు ఇరు దేశాల విదేశాంగ మంత్రులు, ప్రత్యేక ప్రతినిధులతో సరిహద్దు వివాదం పరిష్కారంలో కొంత ముందడుగు వేశారు. ఈ క్రమంలో జిన్‌పింగ్ నుంచి భారత రాష్ట్రపతికి ఓ రహస్య లేఖ వచ్చినట్లు ప్రచారం జరిగింది. ఇరుదేశాల సంబంధాల పునరుద్ధరణపై పలు అంశాలను ప్రస్తావించినట్లు తెలుస్తోంది. ఈ లేఖ రాష్ట్రపతి భవన్ నుంచి ప్రధాని మోడీకి చేరింది.

తొలుత దీనిని తేలిగ్గా తీసుకొన్న ప్రభుత్వం ట్రంప్ బెదరింపులతో ఇంకో ప్లాన్ దిశగా అడుగులు వేసింది. వేగంగా ఇరు దేశాల మధ్య పురోగతి వేగంగా కనిపించింది. విమానాల రాకపోకలు మొదలయ్యాయి. ఈ క్రమంలో ఎస్‌సిఒ శిఖరాగ్ర సదస్సుకు మోడీ హాజరు కావడం ఖాయమైంది. ఉగ్రవాదంపై భారత్ రాజీలేని వైఖరికి మద్దతుగా ఎస్‌సిఒ 'పహల్గాం దాడి'ని ఖండిస్తూ తీర్మానం చేసింది. పాక్ సమక్షంలోనే ఇది జరగడం భారత్‌కు దౌత్యవిజయంగా నిలిచింది.

## ఇ-పెట్రోల్ వాడకంపై పిల్‌ను కొట్టివేసిన సుప్రీం




**న్యూఢిల్లీ, సెప్టెంబరు 2:** దేశవ్యాప్తంగా పెట్రోల్‌లో 20 శాతం ఇథనాల్ కలపాలన్న కేంద్ర ప్రభుత్వ నిర్ణయాన్ని సవాలు చేస్తూ దాఖలైన ప్రజా ప్రయోజన వ్యాజ్యాన్ని (పిల్) సుప్రీంకోర్టు కొట్టివేసింది. ఈ తీర్పుతో 2025-26 నాటికి దేశంలో ఈ20 పెట్రోల్ వాడకానికి ఉన్న అడ్డంకులు తొలగిపోయాయి. ప్రధాన న్యాయమూర్తి బీఆర్ గవాయ్, జస్టిస్ కె.వినోద్ చంద్రన్ నేతృత్వంలోని ధర్మాసనం ఈ పిటిషన్‌పై విచారణ జరిపింది. 2023 కంటే ముందు తయారైన పాత వాహనాల్లో ఇ20 పెట్రోల్ వాడటం వల్ల ఇంధన సామర్థ్యం (మైలేజీ) 6 శాతం వరకు తగ్గుతుందని నీతి ఆయోగ్ 2021 నివేదికలో పేర్కొన్న విషయాన్ని పిటిషనర్ తరఫు సీనియర్ న్యాయవాది షాదాన్ ఫరాసత్ కోర్టు దృష్టికి తెచ్చారు. తాము ఇ20 విధానాన్ని వ్యతిరేకించడం లేదని, అయితే పాత వాహనాల కోసం ఇ10 పెట్రోల్‌ను అందుబాటులో ఉంచాలని కోరారు. కేంద్ర ప్రభుత్వం తరఫున వాదనలు వినిపించిన అటార్నీ జనరల్ ఆర్ వెంకటరమణి పిటిషనర్ వాదనలను వ్యతిరేకించారు.

# రష్యా చమురు కొనుగోళ్లలో ఉల్లంఘనలు లేవు..

### కేంద్ర పెట్రోలియం మంత్రి హార్‌దీప్‌సింగ్ పూరీ



**న్యూఢిల్లీ, సెప్టెంబరు 2:** వైట్‌హౌస్ వాణిజ్య సలహాదారు పీటర్ నవారో చేసిన 'లాండ్రోమాట్' వ్యాఖ్యలను కేంద్ర పెట్రోలియంశాఖ మంత్రి హార్దీప్ సింగ్ పూరి తప్పుపట్టారు. ఉక్రెయిన్ యుద్ధం తర్వాత రష్యా చమురు కొనుగోలులో భారత్ ఎలాంటి నియమాలను ఉల్లంఘించలేదని ఆయన స్పష్టం చేశారు. భారత ఇంధన వాణిజ్య విధానం ప్రపంచ మార్కెట్‌ను స్థిరంగా ఉంచడంలో ధరలను నియంత్రించడంలో సహాయపడిందని ఆయన స్పష్టం చేశారు. లాండ్రోమాట్ అంటే అనుమానాస్పద వస్తువులను చట్టబద్ధంగా కనిపించేలా చేసే ప్రక్రియ లేదంటే ప్రదేశం అని అర్థం. ఉక్రెయిన్‌పై రష్యా దాడికి చాలా ముందు నుంచే భారత్ ప్రపంచంలో నాల్గో అతిపెద్ద పెట్రోలియం ఉత్పత్తులను ఎగుమతి దేశంగా ఉందని యుద్ధం తర్వాత కూడా భారతదేశం ఎగుమతులు, లాభాలు దాదాపు అలాగే ఉన్నాయని ఆయన స్పష్టం చేశారు. భారత్ రష్యన్ చమురు కోసం 'లాండ్రోమాట్'గా మారిందని కొందరు ఆరోపిస్తున్నారని దీనికంటే తప్పు మరొకటి ఉండదని ఆయన పేర్కొన్నారు. వైట్‌హౌస్ సలహాదారు పీటర్ నోవారో గత వారంలో ఉక్రెయిన్ యుద్ధాన్ని 'మోడీ యుద్ధం'గా అభివర్ణించారు. భారత్, రష్యన్ అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్ యుద్ధ యంత్రంకి నిధులు సమకూరుస్తోందని ఆరోపించారు. ఇరాన్, వెనిజులా లాగా రష్యన్ చమురుపై ప్రత్యక్ష నిషేధం లేదని పూరి పేర్కొన్నారు. బీ7, యూరోపియన్ యూనియన్ రష్యన్ చమురుపై ధరల పరిమితి వ్యవస్థను విధించాయని, ఇది చమురు సరఫరాను కొనసాగించడం, రష్యా ఆదాయాన్ని పరిమితం చేయడం లక్ష్యంగా పెట్టుకుందన్నారు. భారత్ ప్రతి లావాదేవీలు చట్టబద్ధమైనవని స్పష్టం చేశారు. భారత్ చట్టబద్ధమైన షిప్పింగ్, భీమా, సర్టిఫైడ్ వ్యాపారులు, పరీక్షించిన మార్గాల ద్వారా మాత్రమే వ్యాపారం చేసిందన్నారు. భారతదేశం ఏ నియమాలను ఉల్లంఘించలేదని, కానీ ప్రపంచ మార్కెట్‌ను స్థిరీకరించడంతో పాటు ధరలు పెరుగకుండా నిరోధించిందన్నారు. భారత్ రష్యన్ చమురు దిగుమతిని ఆపివేస్తే ముడి చమురు ధరలు బ్యారెల్‌కు 90 నుంచి 100 డాలర్లకు చేరుకోవచ్చని పేర్కొన్నారు.

## ప్రధాని మాటల స్ఫూర్తితో రోజుకు రూ.20 వేల సంపాదన

### బీహార్ వాసి బల్వీర్ చంద్రవంశీ



**పాట్నా, సెప్టెంబరు 2:** పకోడీలు అమ్ముకుని కూడా ఉపాధి పొందవచ్చని కొన్నేళ్ల క్రితం ప్రధాని నరేంద్రమోడీ వ్యాఖ్యానించిన సంగతి తెలిసిందే. ఆ మాటలను స్ఫూర్తిగా తీసుకున్న బీహార్‌లోని గయ ప్రాంతానికి చెందిన బల్వీర్ చంద్రవంశీ మోడీ పేరు మీదే ఒక స్టాల్ పెట్టి రోజుకు రూ.20 వేలు సంపాదిస్తున్నారు. దరియాపూర్ గ్రామానికి చెందిన బల్వీర్ మోడీ మాటలపై విశ్వాసం ఉంచి 2017లో న 'మోడీజీ టీ అండ్ పకోడా షాప్' పేరుతో ఒక షాప్ తెరిచారు. గయ షెర్ఘాటీ రోడ్డు మార్గంలో దానిని ఏర్పాటు చేశారు. టీ, పకోడీలతో పాటు లిట్టి-చోకాను విక్రయించడం ప్రారంభించారు. తొలుత ఆయన రోజుకు రూ.100 మాత్రమే సంపాదించారు. ఇప్పుడు రోజుకు రూ.20 వేలు సంపాదించడమే కాకుండా మరికొందరికి ఉపాధి కల్పించే స్థాయికి ఎదిగారు. కేంద్రమంత్రి జీతన్‌రామ్ మాంఝీ షెర్ఘాటీ మార్గంలో ఎప్పుడు వెళ్లినా బల్వీర్ స్టాల్ వద్ద ఆగి, టీ - పకోడీలు రుచి చూస్తుంటారు.

## రష్యా దిగుమతులతో బ్రాహ్మణులకు లబ్ధి

### పీటర్ నవర్రో సంచలన వ్యాఖ్యలు



**న్యూయార్క్, సెప్టెంబరు 2:** అమెరికా శ్వేతసౌధం వాణిజ్య సలహాదారుడు పీటర్ నవర్రో చేసిన వ్యాఖ్యలు దుమారం రేపాయి. ఇండియా దిగుమతులపై 50 శాతం సుంకాన్ని విధిస్తున్న అంశంపై మాట్లాడుతూ బ్రహ్మణులు లాభపడుతున్నట్లు ఆయన పేర్కొన్నారు. ఫాక్స్ న్యూస్‌కు ఇచ్చిన ఇంటర్వ్యూలో మాట్లాడుతూ భారత ప్రజలను వాడుకుని బ్రహ్మణులు లాభపడుతున్నారని, దీన్ని ఆపాలని ఆయన అన్నారు. రష్యాకు లాండ్రీగా ఇండియా మారినట్లు ఆయన ఆరోపించారు. అమెరికాకు పోటీగా ఇండియా వాణిజ్య అసమానతలను సృష్టిస్తున్నట్లు ఆరోపించారు. ఆయన ఇంటర్వ్యూలో ప్రాఫిటీరింగ్ బ్రహ్మిన్స్ అనే పదాన్ని వాడడం చర్చనీయాంశమైంది.

## మెడికల్ విద్యార్థినికి ఆర్థిక సాయం



మంగళగిరి (జర్నలిస్ట్ ఫైల్): మంగళగిరి దామర్ల నాంచారమ్మ ప్రాంగణంలోని పట్టణ పద్మశాలియ బహుతమ సంఘం కార్యాలయంలో సంఘం ఆధ్వర్యంలో మంగళవారం సంఘం నాయకులు, పద్మశాలియ ప్రముఖులు ఆర్థిక సహకారంతో ఎంబీబీఎస్ సీటు సాధించిన పేద విద్యార్థిని వెనిగళ్ళ సాహిత్యకు 70 వేల రూపాయలు ఆర్థిక సాయం అందజేశారు. సంఘం ప్రధాన కార్యదర్శి దామర్ల కుబేరస్వామి, నాయకుల చేతుల మీదగా సాహిత్యకు నగదు సాయం అందజేశారు. అనంతరం సంఘం ప్రధాన కార్యదర్శి దామర్ల మాట్లాడారు. సంఘం ఆధ్యాత్మిక కార్యక్రమాలతో పాటు పేద విద్యార్థులలో ప్రతిభను ప్రోత్సహిస్తూ వారికి సహాయం అందిస్తూ ముందుకు వెళుతుందన్నారు. విద్యార్థిని సాహిత్య విద్యలో మరింత రాణిస్తూ ఉన్నత స్థాయికి చేరుకొని సమాజానికి, సామాజిక వర్గానికి మంచి పేరు తీసుకురావాలని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో సంఘం నాయకులు గుత్తికొండ ధనుంజయరావు, రామనాథం పూర్ణచంద్రరావు, గంజి రవీంద్రనాథ్, జొన్నాదుల బిక్షారావు, బిట్రా భాస్కరరావు, దామర్ల ప్రసాద్, తిడా త్రిమూర్తులు, జొన్నాదుల కోటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

## మట్టి ఖర్చులకు ఆర్థిక సాయం



మంగళగిరి (జర్నలిస్ట్ ఫైల్): మంగళగిరి–తాడేపల్లి నగరపాలక సంస్థ పరిధిలోని నిడమర్రు గ్రామంలో మంగళవారం మృతి చెందిన పటాన్ జుబేదా కుటుంబానికి మట్టి ఖర్చుల నిమిత్తం శ్రీ ఉయ్యూరు నాగిరెడ్డి చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో రూ.5,000ల ఆర్థిక సహాయాన్ని ట్రస్ట్ ప్రతినిధి ఉయ్యూరు నరేంద్ర రెడ్డి అందజేశారు. ఈ సందర్భంగా గ్రామస్తులు ట్రస్ట్ సేవలను ప్రశంసించారు. ఈ కార్యక్రమంలో తాడిబోయిన చిన్న, కోడూరి వెంకటస్వామి తదితరులు పాల్గొన్నారు.

## స్మార్ట్ రేషన్ కార్డులు పంపిణీ



మంగళగిరి (జర్నలిస్ట్ ఫైల్): పెనుమాక గ్రామంలో కూటమి ప్రభుత్వం ప్రవేశపెట్టిన స్మార్ట్ రేషన్ కార్డులు లబ్ధిదారులకు అందించారు. టీడీపీ నాయకులు కొల్లి శేషు పెనుమాక గ్రామ టిడిపి అధ్యక్షులు,పాలెపు వీరేంద్రనాద్ అధికారులతో కలసి ఇంటింటికి వెళ్లి కార్డుల పంపిణీ చేశారు. కూటమి ప్రభుత్వం ప్రతి పేదవాడికి రేషన్ అందాలనే ఆలోచనతో స్మార్ట్ రేషన్ కార్డు ప్రవేశపెట్టడం జరిగిందని అర్హులైన ప్రతిఒక్కరికి ప్రభుత్వ పథకాలు అందేలా చూస్తామని కొల్లి, శేషు అన్నారు. రేషన్ డీలర్స్ తో పాటు స్థానిక టీడీపీ నాయకులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

## పవన్ కళ్యాణ్ జన్మదిన వేడుకలు



బ్రహ్మంగారిమఠం (జర్నలిస్ట్ ఫైల్)-రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి జనసేన పార్టీ అధినేత సిని ఈ హీరో కొణిదల పవన్ కళ్యాణ్ 54 వ జన్మదిన వేడుకలు బి.మఠంలో ఘనంగా నిర్వహించారు. పవన్ కళ్యాణ్ పుట్టిన రోజు సందర్భముగా బ్రహ్మంగారి మఠం ఐదు రోడ్ల కూడలి నందు కూటమి నాయకులు అభిమానులు జనసేన పార్టీ అభిమానులు కార్యకర్తలు భారీగా పాల్గొని బాణసంచా పేల్చి కేక్ కటింగ్ చేసి సంబరాలు జరుపుకున్నారు. ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు బ్రహ్మంగారి మఠం మండల టిడిపి అధ్యక్షులు చెన్నుపల్లి సుబ్బారెడ్డి సహకార బ్యాంకు చైర్మన్ సాంబ శివారెడ్డి మండల టిడిపి నాయకులు కానాల మల్లిఖార్జున రెడ్డి అంబిశెట్టి వెంకట సుబ్బయ్య దరిమిశెట్టి మురళీకృష్ణ దర్మిశెట్టి రాజేష్ కోనేటి వీర నాగరాజు పత్తి సురేష్ తదితరులు పాల్గొన్నారు.

# స్మార్ట్ రేషన్ కార్డులు దేశంలోనే ప్రథమం

- సీఎం చంద్రబాబు విజనరీకి నిదర్శనం
- గుంటూరు తూర్పులో 99 వేల కార్డుల జారీ
- ఇంటింటికీ వెళ్లి కార్డులు పంపిణీ చేసిన ఎమ్మెల్యే నసీర్



గుంటూరు (జర్నలిస్ట్ ఫైల్): ప్రజలకు సేవలను అత్యంత వేగంగా అందించడంతో సీఎం చంద్రబాబు నాయుడు దేశానికే ఆదర్శమని గుంటూరు తూర్పు ఎమ్మెల్యే, అసెంబ్లీ మైనారిటీస్ కమిటీ చైర్మన్ నసీర్ అన్నారు. స్థానిక 52వ డివిజన్ వెంగళరావు నగర్, 12వ డివిజన్ అహ్మద్ నగర్ ప్రాంతాల్లో మంగళవారం ఇంటింటికీ వెళ్లి స్మార్ట్ రేషన్ కార్డులు పంపిణీ చేశారు. స్మార్ట్ రేషన్ కార్డులు అందుకున్న లబ్ధిదారులు సీఎం చంద్రబాబు నాయుడు, ఎమ్మెల్యే నసీర్ కు ధన్యవాదాలు తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే నసీర్ మాట్లాడుతూ టెక్నాలజీ అందిపుచ్చుకుని రాష్ట్ర ప్రజలకు అందించడంలో సీఎం చంద్రబాబు నాయుడు ప్రథమస్థానంలో ఉంటారని తెలిపారు. స్మార్ట్ రేషన్ కార్డుల ఆలోచన ద్వారా రాష్ట్రంలో కోట్ల మంది ప్రజలకు సులభరీతిలో సేవలు అందనున్నాయని చెప్పారు. గుంటూరు తూర్పు నియోజకవర్గం లో 99 వేల రేషన్ కార్డులు పంపిణీ చేస్తున్నామని వెల్లడించారు. గత ప్రభుత్వంలో అడ్డగోలు ఆంక్షలు పెట్టి నిరుపేదల రేషన్ కార్డులు తీసేసిందని గుర్తు చేశారు. తమ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే గ్రీవెన్స్ ద్వారా పేదల రేషన్ కార్డుల అర్జీలు స్వీకరించి అందించామని తెలిపారు. కార్యక్రమంలో చిట్టాబత్తిని చిట్టిబాబు, క్లస్టర్ ఇంచార్జ్ గోళ్ళ ప్రభాకర్, డివిజన్ అధ్యక్షులు గుడిమెట్ల దయా రత్నం, పొదిలి వెంకటేశ్వర్లు, బాలకోటయ్య, తిరుపతిరావు, రమేష్, రవిశంకర్, మోషే, ఆరోగ్య రావు, ఖాజా ఖాన్, జై రావు, బాలాజీ తదితరులు పాల్గొన్నారు.

# కూటమి ప్రభుత్వం... బడుగు, బలహీన వర్గాల ప్రభుత్వం

- ప్రభుత్వ స్థలాల్లో ఇళ్లు కట్టుకుని జీవిస్తున్న కుటుంబాలకు ఇళ్ల స్థలాల క్రమబద్ధీకరణ
- కేవలం రూ.50 మాత్రమే మీ అకౌంట్ ద్వారా రెవెన్యూ శాఖకు చెల్లించి అర్జీ వేసుకోవాలి
- ఇళ్ల స్థలాల క్రమబద్ధీకరణపై అవగాహన సదస్సులో ఎమ్మెల్యే డాక్టర్ రామాంజనేయులు




గుంటూరు రూరల్ (జర్నలిస్ట్ ఫైల్): ప్రత్తిపాడు ఎమ్మెల్యే డాక్టర్ బూర్ల రామాంజనేయులు ఆధ్వర్యంలో గుంటూరు రూరల్ 41వ డివిజన్‌లో హౌస్ రెగ్యులరైజేషన్‌పై విస్తృత అవగాహన కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమంలో రామాంజనేయ కాలనీ, పుచ్చలపల్లి సుందరయ్య కాలనీ, ఐద్వా నగర్, అస్మితా కాలనీల్లో దశాబ్దాలుగా ప్రభుత్వ స్థలాల్లో నివసిస్తున్న పేద ప్రజలు పాల్గొన్నారు. ప్రభుత్వ స్థలాల్లో ఇళ్లు కట్టుకుని సంవత్సరాల తరబడి జీవిస్తున్న కుటుంబాలకు ఇళ్ల స్థలాల క్రమబద్ధీకరణ చేసే దిశగా రాష్ట్ర ప్రభుత్వం తీసుకువచ్చిన జీవో నెం.30 ప్రయోజనాలు, దానిని ఎలా ఉపయోగించుకోవాలో ఎమ్మెల్యే ప్రజలకు వివరించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ... “జీవో నెంబర్ 30 ప్రకారం ఎవరైనా కేవలం రూ.50 మాత్రమే మీ అకౌంట్ ద్వారా రెవెన్యూ శాఖకు చెల్లించి అర్జీ వేసుకోవాలి. అధికారులు కానీ, రాజకీయ నాయకులు కానీ, మధ్యవర్తులు కానీ ఎవరికీ ఒక్క రూపాయి కూడా ఇవ్వొద్దు. ఎవరికైనా డబ్బులు ఇచ్చినట్లయితే వారి పట్టాలను రద్దు చేస్తాం. అలాగే మోసగాళ్లపై ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకుంటుంది” అని ప్రజలకు స్పష్టంగా తెలియజేశారు. దళారులను నమ్మి మోసపోకుండా జాగ్రత్తగా ఉండాలని సూచించారు. తరువాత రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ కార్యక్రమాన్ని ప్రారంభించి లబ్ధిదారులకు స్వయంగా కార్డులు అందజేశారు. పేదల సంక్షేమం కోసం ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలను ఎమ్మెల్యే వివరించి, ప్రతి పేద కుటుంబం న్యాయం పొందే వరకు తాను కృషి చేస్తానని హామీ ఇచ్చారు.

# ఎస్.ఆర్.ఎం. యూనివర్సిటీ (ఏపీ)లో డిప్యూటీ సీఎం జన్మదిన వేడుకలు



మంగళగిరి (జర్నలిస్ట్ ఫైల్): ఈ రోజు ఉప ముఖ్యమంత్రి, జనసేన అధినేత శ్రీ పవన్ కళ్యాణ్ గారి జన్మదిన సందర్భంగా మంగళగిరి మండలం, నీరుకొండ ఎస్.ఆర్.ఎం. యూనివర్సిటీ వద్ద పవన్ కళ్యాణ్ గారి వీర అభిమానులు పవర్ స్టార్ యూత్ ఆధ్వర్యంలో డీజేతో బైక్ ర్యాలీ, బాణసంచా కాల్పులుతో పుట్టినరోజు వేడుకలు నిర్వహించారు. ఈ వేడుకల్లో ఎ.పి.ఎస్.ఎం.ఐ.డి.సి చైర్మన్ & జనసేన పార్టీ మంగళగిరి నియోజకవర్గ ఇంచార్జ్ శ్రీ చిల్లపల్లి శ్రీనివాసరావు గారు మరియు జనసేన సీనియర్ నాయకులు కిలారి వెంకట రోశయ్య గారు పాల్గొని నాయకులు, స్టూడెంట్స్ తో కలిసి కేక్ కట్ చేయడం జరిగింది. ఈ సందర్భంగా చిల్లపల్లి శ్రీనివాసరావు గారు మాట్లాడుతూ ఉప ముఖ్యమంత్రి శ్రీ పవన్ కళ్యాణ్ గారికి హృదయపూర్వక జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఆయన ఆశయాలకు అనుగుణంగా విద్యార్థులు ఉత్తమ విద్యా ప్రమాణాలు, పరిశోధనలతో రాష్ట్రాభివృద్ధిలో కీలకపాత్ర పోషించాలని ఆకాంక్షించారు. రాష్ట్ర విద్య మరియు ఐటీ శాఖ మాత్యులు నారా లోకేష్ గారి సృజనాత్మకతతో, రాజధాని పేరు దేశస్థాయిలో ప్రతిష్ఠాత్మకంగా నిలవాలని ఆకాంక్ష వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ పద్మశాలీ వెల్ఫేర్ అండ్ డెవలప్మెంట్ కార్పొరేషన్ డైరెక్టర్ పర్వతం మధుసూదన్ రావు, ఎం.టి.ఎం.సి అధ్యక్షులు మునగపాటి వెంకట మారుతీరావు, ఉపాధ్యక్షులు షేక్ కైరుల్లా, మంగళగిరి మండల అధ్యక్షులు వాసా శ్రీనివాసరావు, తాడేపల్లి మండల అధ్యక్షులు సామల నాగేశ్వరరావు, తాడేపల్లి పట్టణ అధ్యక్షులు అంబటి తిరుపతిరావు, మంగళగిరి శివాలయం ట్రస్ట్ బోర్డ్ సభ్యులు తిరుమలశెట్టి మురళీకృష్ణ, కార్యదర్శి బళ్ళ ఉమామహేశ్వరావు, తాడేపల్లి మండల ప్రధాన కార్యదర్శి తిరుమలశెట్టి శ్రీధర్, జనసేన పార్టీ మంగళగిరి నియోజకవర్గ యువజన నాయకులు చిట్టెం అవినాష్, తాడేపల్లి పట్టణ 19వ వార్డు అధ్యక్షులు దినేష్ చక్రవర్తి, జనసేన నాయకులు తిరుమలశెట్టి గోపీనాథ్, వివిధ హోదాల్లో ఉన్న జనసేన నాయకులు, కార్యకర్తలు, వీర మహిళలు తదితరులు పాల్గొన్నారు.

# రాజన్న అమరం - ప్రజల గుండెల్లో పదిలం

- బందా రవీంద్రనాథ్, ఈచంపాటి వెంకటకృష్ణ (ఆచారి)



గుంటూరు(జర్నలిస్ట్ ఫైల్): పేదవాడి గుండె చప్పుడు తెలిసిన నిజమైన ప్రజా నాయకుడు దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వైయస్ రాజశేఖరరెడ్డి అని గుంటూరు అర్బన్ బ్యాంక్ డైరెక్టర్ బందా రవీంద్రనాథ్ కీర్తించారు. స్థానిక 32వ డివిజన్‌లో కార్పొరేటర్ ఈచంపాటి వెంకటకృష్ణ (ఆచారి) ఆధ్వర్యంలో వైయస్సార్ వర్ధంతి వేడుకలు ఘనంగా జరిగాయి. పలువురు నేతలు ఆయన విగ్రహానికి పూలమాల వేసి ఘన నివాళులు అర్పించారు.

ఈ సందర్భంగా బందా రవీంద్రనాథ్ మాట్లాడుతూ, విలువలు, విశ్వసనీయతకు సరైన నిర్వచనం రాజశేఖరరెడ్డి ప్రజాప్రస్థానం అని పేర్కొన్నారు. ఆయన నడవడిక నేటి తరం రాజకీయ నేతలకు ఆదర్శప్రాయమని తెలిపారు. ప్రగతి, సంక్షేమ పథకాల సాక్షిగా “రాజన్న అమరం – ప్రజల గుండెల్లో పదిలం” అని ప్రస్తుతించారు. కార్పొరేటర్ ఈచంపాటి వెంకటకృష్ణ (ఆచారి) మాట్లాడుతూ, సంక్షేమ పథకాల సృష్టికర్త డాక్టర్ వైయస్ రాజశేఖరరెడ్డి అని శ్లాఘించారు. రాష్ట్ర రాజకీయ చరిత్రలో చెరగని ముద్ర వేసుకున్న వైయస్సార్ ఆశయ సాధనకు కృషి చేయడమే ఆయనకు అర్పించే ఘనమైన నివాళి అవుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో పార్టీ నేతలు వెలుగూరి రత్నప్రసాద్, బత్తుల దేవానంద్, భాగ్యారావు, శంకర్, విజయమ్మ, విజయమాధవి, శ్రావణి, గనిక జాన్సీ, డేవిడ్, సింగు నరసింహారావు, సాంబశివరావు, సాగర్ రెడ్డి, ఆదిలక్ష్మి, సంజీవరెడ్డి, గంగాధరరెడ్డి, పుల్లారెడ్డి, పండ్ల నారాయణ, చందు, వెంకటరెడ్డి, గోపీకృష్ణ, రెడ్డి కోటేశ్వరరావు, సుబ్బరాజు, నాగార్జున తదితరులు పాల్గొన్నారు.

## వినాయక మండపాలను సందర్శించిన ఎమ్మెల్యే గళ్ళా మాధవి



గుంటూరు (జర్నలిస్ట్ ఫైల్): గుంటూరు పశ్చిమ నియోజకవర్గం ఎమ్మెల్యే గళ్ళా మాధవి మంగళవారం నియోజకవర్గంలోని పలు వినాయక మండపాలను సందర్శించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అమరావతి రోడ్, గౌతమి నగర్ 3వ లైన్, విద్యానగర్ 1వ లైన్, కొండయ్య కాలనీ మండపాలలో భక్తులతో కలిసి ప్రార్థనలు చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే గళ్ళా మాధవి మాట్లాడుతూ గణేశ్ చతుర్థి పండుగలు మత సామరస్యం, ఐక్యతకు ప్రతీక అని, ప్రతి ఒక్కరూ శాంతి సౌభ్రాతృత్వంతో ముందుకు సాగాలని ఎమ్మెల్యే గళ్ళా మాధవి పిలుపునిచ్చారు. స్థానికులు ఎమ్మెల్యే గళ్ళా మాధవికి తమ కాలనీల సమస్యలను వివరించగా, వాటి పరిష్కారానికి తక్షణ చర్యలు తీసుకుంటానని ఆమె హామీ ఇచ్చారు.

## జిన్నా టవర్-మణిపురం బ్రిడ్జి రోడ్డుపై ఆక్రమణల తొలగింపు తప్పనిసరి



గుంటూరు (జర్నలిస్ట్ ఫైల్): జిన్నా టవర్ సెంటర్ నుండి మణిపురం బ్రిడ్జి వరకు రోడ్లు, డ్రైన్లపై ఉన్న ఆక్రమణలు తప్పనిసరిగా తొలగించుకోవాలని నగర కమిషనర్ పులి శ్రీనివాసులు తుది హెచ్చరిక జారీ చేశారు. ఈ నెల 6వ తేదీ లోపు స్వచ్ఛందంగా ఆక్రమణలు తొలగించకపోతే, జిఎంసి ప్రత్యేక బృందాలు పోలీసుల సహకారంతో సమూలంగా తొలగిస్తాయని ఆయన మంగళవారం ప్రకటించారు.

వర్షాకాలంలో డ్రైన్లు పొంగిపొర్లడంతో మురుగు నీరు రోడ్లపైకి వచ్చి, లోతట్టు ప్రాంతాల్లో ఇళ్లలోకి ప్రవహించి ప్రజలకు ఇబ్బందులు కలిగిస్తున్నదని కమిషనర్ పేర్కొన్నారు. డ్రైన్ టు డ్రైన్ రోడ్ విస్తరణ చేపట్టే పనులకు ఆక్రమణలు అడ్డంకిగా మారుతున్నాయని, పూడికతీత పనులు కూడా సరిగా సాగడం లేదని తెలిపారు.

ఆక్రమణదారులకు ఇప్పటికే పలు సార్లు నోటీసులు ఇచ్చినా, పెద్దగా స్పందన లభించలేదని కమిషనర్ చెప్పారు. ఈ నెల 6 తర్వాత జరిగే తొలగింపులో కలిగే నష్టానికి ఆక్రమణదారులే బాధ్యత వహించాల్సి ఉంటుందని స్పష్టం చేశారు. ట్రాఫిక్ క్రమబద్ధీకరణ, రోడ్ల విస్తరణ, మురుగుపారుదల సమస్యల పరిష్కారం కోసం ఆక్రమణల తొలగింపు అత్యవసరమని, అందరూ సహకరించాలని పిలుపునిచ్చారు.

## ఘనంగా డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ జన్మదిన వేడుకలు



మంగళగిరి (జర్నలిస్ట్ ఫైల్): ఉప ముఖ్యమంత్రి, జనసేన అధినేత పవన్ కళ్యాణ్ జన్మదిన సందర్భంగా మంగళగిరి లోని జనసేన పార్టీ కేంద్ర కార్యాలయం వద్ద జనసేన నాయకుల ఆధ్వర్యంలో నిర్వహించిన పుట్టినరోజు వేడుకల్లో ఎ.పి.ఎం.ఎస్.ఐ.డి.సి. చైర్మన్ & జనసేన పార్టీ మంగళగిరి నియోజకవర్గ ఇంచార్జ్ చిల్లపల్లి శ్రీనివాసరావు పాల్గొని నాయకులతో కలిసి కేక్ కట్ చేసి పవన్ కళ్యాణ్ పుట్టినరోజు వేడుకలు ఘనంగా నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ పద్మశాలీ వెల్ఫేర్ అండ్ డెవలప్మెంట్ కార్పొరేషన్ డైరెక్టర్ పర్వతం మధుసూదన్ రావు, గుంటూరు జిల్లా సంయుక్త కార్యదర్శి బడే కోమలి, ఎం.టి.ఎం.సి. అధ్యక్షులు మునగపాటి వెంకట మారుతిరావు, జనసేన పార్టీ సీనియర్ నాయకులు గంజి చిరంజీవి, కంకణాల శంకర్, ఎం.టి.ఎం.సి కార్యదర్శి, మంగళగిరి శివాలయం ట్రస్ట్ బోర్డు సభ్యులు తిరుమలశెట్టి మురళీకృష్ణ, ఎం.టి.ఎం.సి కార్యదర్శి బళ్ళ ఉమామహేశ్వరావు, జనసేన యువజన నాయకులు చిట్టెం అవినాష్, తాడేపల్లి పట్టణ 19 వార్డు ఉపాధ్యక్షులు వీరిశెట్టి వెంకటేశ్వరరావు, కార్యదర్శి వీరిశెట్టి జ్యోతి, జనసేన నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.


## గుండె పోటుతో యువకుడు మృతి





బ్రహ్మంగారిమఠం (జర్నలిస్ట్ ఫైల్) బ్రహ్మంగారిమఠం ఐదు రోడ్ల కూడలి నందు పెద్దోళ్ల మహేంద్ర (32)గుండెపోటుతో మృతి చెందడం జరిగింది. వివరాల్లోకి వెళితే మృతి చెందిన మహేంద్ర ది అట్లూరు మండలం తంబల్ల గొంది గ్రామ నివాసి అయిన బ్రహ్మంగారి మఠం నరసన్న పల్లె గ్రామంలో వివాహం చేసుకొన్నాడు. మంగ్లవారం తంబళ్ల గొండి నుండి అత్త గారి ఊరుకి వచ్చి, పని నిమిత్తం ఐదు రోడ్ల కూడలికి వచ్చి తిరిగి అత్తగారి ఇంటికి నడుచుకుంటూ వెళ్తుండగా సాయంత్రం గుండె పోటు రావడంతో అక్కడిక్కడే మరణించడం జరిగింది. మృతుడు మహేంద్ర కు భార్య ఝాన్సీ (25) ముగ్గురు కుమార్తెలు కలరు. ప్రస్తుతం భార్య గర్భిణీతో ఉంది. ఈ ఘటన తో కుటుంబ పెద్దదిక్కును కోల్పోవడంతో ఇరు కుటుంబాల లో విషాద ఛాయలు నెలకొన్నాయి.

# ఏపీవీజేయూ గౌరవాధ్యక్షునిగా శిరందాసు నాగార్జున



మంగళగిరి (జర్నలిస్ట్ ఫైల్): ఏపీ వెటరన్ జర్నలిస్టుల యూనియన్ గౌరవాధ్యక్షులుగా గుంటూరు జిల్లా మంగళగిరికి చెందిన సీనియర్ జర్నలిస్ట్ శిరందాసు నాగార్జున రావుని ఎంపిక చేసినట్లు యూనియన్ అధ్యక్షుడు డాక్టర్ టి. జనార్దన్, ప్రధాన కార్యదర్శి జి. చంద్రశేఖర్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. విజయవాడ సిద్ధార్థ నగర్‌లో సోమవారం జరిగిన వెటరన్ జర్నలిస్ట్స్ యూనియన్ రాష్ట్రస్థాయి కమిటీ సమావేశంలో తీసుకున్న నిర్ణయాలను వారు వివరించారు. యూనియన్ రిజిస్ట్రేషన్ ప్రక్రియను మన యూనియన్ ఉపాధ్యక్షులు వెంకటరత్నం సారధ్యంలో ఈనెల 30లోగా పూర్తి చేయాలని రాష్ట్ర కార్యవర్గం తీర్మానించింది. ఈ ప్రక్రియలో ఆయనకు అందరూ సహకరించాలని కమిటీ నిర్ణయించింది. యూనియన్ కార్యవర్గంలోకి గౌరవ అధ్యక్షులుగా శిరందాసు నాగార్జున రావు (మంగళగిరి) సహాయ కార్యదర్శులుగా పి.భుజంగ రావు (ధర్మవరం) ఆర్.రాజశేఖర్ (విజయవాడ)లను తీసుకోవాలని కమిటీ నిర్ణయించింది. జర్నలిస్టులుగా 20 ఏళ్లు పూర్తి అయి, తగిన ఆధారాలు కలిగి ఉండి, 58 ఏళ్లు నిండిన వారు, తాజాగా అక్రెడిటేషన్ కలిగినవారిని సభ్యులుగా చేర్చుకోవాలని నిర్ణయించారు. సభ్యత్వ రుసుము రూ. 500గా, ప్రతి ఏడాది రెన్యూవల్ కోసం రూ. 100 చెల్లించాలని నిర్ణయించారు. యూనియన్‌లో 221 మంది తమ పేర్లు నమోదు చేసుకున్నారు. అయితే, వారిలో 130 మంది మాత్రమే సభ్యత్వ రుసుం చెల్లించారు. మిగతా 91 మంది ఈనెల 15లోగా సభ్యత్వ రుసుంతో పాటు, దరఖాస్తును విజయవాడలోని మన కోశాధికారి రామారావు(7286964554)కి పంపాలని తెలిపారు. లేనిచో జాబితా నుండి పేర్లు తొలగించాలని కార్యవర్గం నిర్ణయించింది. మన సభ్యుల ప్రవర్తన గౌరవప్రదంగా హుందాగా ఉండాలని, అలా లేని పక్షంలో, ఎవరిపైనైనా ఫిర్యాదులు అందితే, వారిపై క్రమశిక్షణా చర్యలకు సిఫార్సు చేసేందుకు ముగ్గురితో కమిటీ ఏర్పాటు ఏర్పాటు చేశారు. ఈ కమిటీ సభ్యులుగా ఎంవీ.రామారావు(విజయవాడ), హెచ్.ఆజాద్(అనంతపురం), వేగి రామ చంద్రరావు(విశాఖపట్నం)లుగా ఉంటారు. 58 ఏళ్లు నిండి, వెటరన్ జర్నలిస్టులుగా అక్రెడిటేషన్ కలిగిన వారు కొత్త సభ్యులుగా చేరమని కమిటీ పిలుపు ఇచ్చింది.

**జాతీయ పెన్షన్ విధానం కోసం త్రివేండ్రం మహాసభ తీర్మానం**

ఆగస్టు 19 నుండి 21 వరకు సీనియర్ జర్నలిస్ట్ ఫోరం కేరళ రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించిన జాతీయ మహాసభల్లో సీనియర్ జర్నలిస్టులకు కేంద్ర ప్రభుత్వం జాతీయ పెన్షన్ విధానం అమలు చేయాలని కోరుతూ తీర్మానించినట్లు యూనియన్ రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ టి. జనార్ధన్, ఉపాధ్యక్షులు ఎస్. అజాద్, కోశాధికారి ఎం.వి. రామారావు, సంయుక్త కార్యదర్శి పి. భుజంగ రావులు తెలిపారు. విజయవాడ ప్రెస్ క్లబ్ లో మంగళవారం జరిగిన విలేకర్ల సమావేశంలో వారు మాట్లాడారు. 21 రాష్ట్రాల నుండి 250 మంది సీనియర్ జర్నలిస్టులు ప్రథమ జాతీయ మహాసభకు విచ్చేశారని, ప్రారంభ సభకు కేరళ ముఖ్యమంత్రి పినరయ్ విజయన్, ముగింపు సమావేశానికి ప్రతిపక్ష నేత సతీషన్, గోవా మాజీ గవర్నర్ పిళ్ళై హాజరై మహాసభ విజయాన్ని కాంక్షించారని చెప్పారు. దేశవ్యాప్తంగా 20 రాష్ట్రాలలో వెటరన్స్ కు పెన్షన్ అందిస్తున్న నేపథ్యంలో, దేశవ్యాప్తంగా నెలకు రు.20,000తో జాతీయ పెన్షన్ విధానం ఉండాలని మహాసభ తీర్మానించినట్టు తెలిపారు. రైల్వే పాసులను పునరుద్ధరించాలని మహాసభ డిమాండ్ చేసిందన్నారు. హెల్త్ ఇన్సూరెన్స్ ను రు. 5 లక్షలకు పెంచాలని కోరారు. మధ్యప్రదేశ్ తరహాలో వెటరన్స్ కు పర్మినెంట్ అక్రిడిటేషన్ సౌకర్యం కల్పించాలన్నారు. కర్ణాటక తరహాలో అన్ని బస్సుల్లో (ఏసితోసహా) ఉచిత ప్రయాణ సౌకర్యం కల్పించాలని కోరారు.

కేరళ మహా సభలో రాష్ట్రం నుంచి ఎంవీ రామారావు, హెచ్.ఆజాద్, ఎం.నరేంద్ర రెడ్డి, శిరందాసు నాగార్జున రావులను జాతీయ సమితి సభ్యులుగా, డాక్టర్ టి.జనార్దన్ ను జాతీయ ఉపాధ్యక్షులుగా ఎన్నిక చేసినట్లు తెలిపారు.

విలేకరుల సమావేశం ముగిసిన అనంతరం, కమిటీ సభ్యులు రాష్ట్ర సమాచార పౌర సంబంధ శాఖ సంచాలకులు హిమాన్షు శుక్లను, అడిషనల్ డైరెక్టర్ ఎల్.స్వర్ణలతలను కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమం లో ఏ.పి. వెటరన్ జర్నలిస్ట్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ టి.జనార్దన్, గౌరవ అధ్యక్షులు శిరందాసు నాగార్జున రావు, ఉపాధ్యక్షులు ఎస్.అజాద్, ఎం. నరేంద్ర రెడ్డి, కోశాధికారి ఎం.వి.రామారావు, సంయుక్త కార్యదర్శి పి.భుజంగ రావు తదితరులు పాల్గొన్నారు.

INK OF TRUTH
జర్నలిస్ట్ ఫైల్
తెలుగు దినపత్రిక
జర్నలిస్ట్ ఫైల్ దినపత్రిక చందాదారులుగా చేరాలని అనుకుంటున్నారా?
అయితే ఈ నెంబర్‌కు ఫోన్ చేయండి
సర్క్యులేషన్ మేనేజర్
76 61 80 59 68

## జగం మెచ్చిన నాయకుడు పవన్ కళ్యాణ్



○ డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ కు హృదయపూర్వక జన్మదిన శుభాకాంక్షలు తెలిపిన మంత్రి కందుల దుర్గేష్

**అమరావతి (జర్నలిస్ట్ ఫైల్):** డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ కు మంత్రి కందుల దుర్గేష్ జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఎన్ని ఒడిదుడుకులు, అవమానాలు ఎదురైనా అంతిమంగా రికార్డు విజయం సాధించిన జన సేనాని పవన్ కళ్యాణ్ ప్రజాసేవలో తనదైన ముద్ర వేస్తున్నారన్నారు. తనకు ఎమ్మెల్యేగా, మంత్రిగా అవకాశం కల్పించిన తమ నాయకుడు పవన్ కళ్యాణ్ కి జీవితాంతం రుణపడి ఉంటానని పేర్కొన్నారు. పవన్ ఒక ప్రభంజనం.. ఆయన మాట ప్రకంపనం.. జనహితం ఆయన అభిమతం అని అభివర్ణించారు. ప్రజాసేవలో పవన్ కళ్యాణ్ చూపిస్తున్న అంకితభావం చిరస్మరణీయంగా నిలబడుతుందన్నారు. పవన్ కళ్యాణ్ సినీ, రాజకీయ ప్రయాణం విశిష్టమైనదని, రెండింటిలోనూ స్టార్ డమ్ సంపాదించుకున్న వ్యక్తి పవన్ కళ్యాణ్ అని అన్నారు. తెలుగు తల్లికి, తెలుగు కళామతల్లికి ముద్దుబిడ్డ పవన్ కళ్యాణ్ అని రాజకీయ, సినీ రంగాల్లో ఆయన ఉన్నత స్థాయికి ఎదగాలని ఆకాంక్షిస్తున్నట్లు మంత్రి దుర్గేష్ ఒక ప్రకటనలో తెలిపారు. సీఎం చంద్రబాబు నాయుడుతో కలిసి డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ ఆంధ్రప్రదేశ్ పునర్నిర్మాణంలో కీలకపాత్ర పోషిస్తున్నారని, ప్రజల అభ్యున్నతే లక్ష్యంగా పనిచేస్తున్నారని మంత్రి దుర్గేష్ తెలిపారు. అభిమానులు, జన సైనికులు, వీర మహిళలు ప్రజల దీవెనలతో డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ ఆయురారోగ్యాలతో వర్ధిల్లాలని భగవంతున్ని ప్రార్థించారు.

## మూడు మెడికల్ కాలేజీలకు కొత్త ప్రిన్సిపాళ్లు

○ నాలుగు బోధనాసుపత్రులకు సూపరింటెండెంట్లు

**అమరావతి (జర్నలిస్ట్ ఫైల్):** వైద్యారోగ్య శాఖా మంత్రి సత్యకుమార్ యాదవ్ ఆదేశాల మేరకు రాష్ట్రంలో ప్రభుత్వ వైద్య కళాశాలలకు సంబంధించిన కీలక నియామకాలు జరిగాయి. మూడు ప్రభుత్వ వైద్య కళాశాలలకు ప్రిన్సిపాళ్లను, నాలుగు బోధనాసుపత్రులకు సూపరింటెండెంట్లను నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఈ నియామకాలకు ముఖ్యమంత్రి ఆమోదం తెలిపారు. విజయనగరం మెడికల్ కాలేజీ ప్రిన్సిపాల్‌గా డాక్టర్ దేవి మాధవి, అనంతపురం మెడికల్ కాలేజీ ప్రిన్సిపాల్‌గా డాక్టర్ విజయశ్రీ బాధ్యతలు చేపట్టనున్నారు. విజయనగరం జిజిహెచ్ సూపరింటెండెంట్‌గా పనిచేస్తున్న డాక్టర్ అప్పల నాయుడు శ్రీకాకుళం ప్రభుత్వ వైద్య కళాశాల ప్రిన్సిపాల్‌గా బదిలీ అయ్యారు. మచిలీపట్నం జిజిహెచ్ సూపరింటెండెంట్‌గా డాక్టర్ సౌమిని నియమితులయ్యారు. ఆంధ్ర మెడికల్ కాలేజీ ప్రొఫెసర్ డాక్టర్ జె. కిషోర్ పదోన్నతిపై పలాస కిడ్నీ రీసెర్చ్ సెంటర్ సూపరింటెండెంట్‌గా నియమితులయ్యారు. ఇంతకుముందు పలాస కిడ్నీ రీసెర్చ్ సెంటర్‌లో సూపరింటెండెంట్‌గా ఉన్న డాక్టర్ అల్లు పద్మజను విజయనగరం బోధనాసుపత్రి సూపరింటెండెంట్‌గా బదిలీ చేశారు. నంద్యాల ఆసుపత్రి సూపరింటెండెంట్‌గా ఉన్న డాక్టర్ డి. మల్లీశ్వరి అనంతపురం జిజిహెచ్ సూపరింటెండెంట్‌గా బదిలీ అయ్యారు.

## 10న తెనాలిలో తెలంగాణ గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ పర్యటన.



**తెనాలి,(జర్నలిస్ట్ ఫైల్)** తోళ్ల పరిశ్రమకు అంతర్జాతీయ స్థాయిలో గుర్తింపు తెచ్చి, చర్మకారుల గౌరవాన్ని పెంచిన శాస్త్రవేత్త డాక్టర్ యలవర్తి నాయుడమ్మ,104వ జయంతి ఉత్సవాలు ప్రతిష్టాత్మకంగా నిర్వహించనున్నట్లు నాయుడమ్మ ఫౌండేషన్ చైర్మన్ యడ్లపాటి రఘునాదబాబు పేర్కొన్నారు. స్థానిక పారిశ్రామికవాడ లోని కుమార్ పంప్స్ సంస్థ కార్యాలయంలో మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో యలవర్తి నాయుడమ్మ ఫౌండేషన్ చైర్మన్ ఎడ్లపాటి రఘునాథ బాబు మాట్లాడుతూ ఈనెల 10వ తేదీన తెనాలిరామకృష్ణ కవి కళాక్షేత్రం వేదికగా యలవర్తి నాయుడమ్మ స్మారక అవార్డు ప్రధానోత్సవ, సభా కార్యక్రమం ఘనంగా నిర్వహించనున్నట్లు వివరించారు. ఈ సంవత్సరం యలవర్తి నాయుడమ్మ స్మారక అవార్డును , కృష్ణా జిల్లాకు చెందిన ఫైనాన్స్ సెక్రటరీ మద్దిరాల నాగరాజుకు, తెలంగాణ రాష్ట్ర గవర్నర్ జిష్ణు దేవ్ వర్మ ముఖ్య అతిథిగా పాల్గొని,అవార్డు ప్రధానం చేయనున్నట్లు తెలిపారు. కుమార్ పంప్స్ అధినేత, కొత్త సుబ్రహ్మణ్యం మాట్లాడుతూ తెనాలి సమీపంలోని యలవర్రు గ్రామంలో జన్మించిన, యలవర్తి నాయుడమ్మ దేశం గర్వించదగ్గ శాస్త్రవేత్త అని అన్నారు. ఆయన పేరిట అందించే స్మారక అవార్డు ప్రధానోత్సవ సభ,ప్రాధాన్యతను వివరించారు. అనంతరం ప్రచార బ్రోచర్లను ఆవిష్కరించారు. మీడియా సమావేశంలో సహజకవి అయినాల మల్లేశ్వరరావు, కడియాల నందకిషోర్, తదితరులు పాల్గొన్నారు.

## డ్రైవర్లు-కండక్టర్లకు సమాన ఇన్సెంటివ్ ఇవ్వాలి

### ఏపిపిటిడి ఎంప్లాయీస్ యూనియన్

**అమరావతి (జర్నలిస్ట్ ఫైల్):** ఆర్టీసీ డ్రైవర్లు, కండక్టర్లకు చెల్లిస్తున్న టార్గెట్ ఇన్సెంటివ్‌లను ఇద్దరికీ సమానంగా ఇవ్వాలని ఏపిపిటిడి ఎంప్లాయీస్ యూనియన్ (ఈ.యూ) రాష్ట్ర కమిటీ డిమాండ్ చేసింది. ప్రస్తుతం రోజువారీ టార్గెట్ సాధించిన కండక్టర్లకు 70 శాతం, డ్రైవర్లకు 30 శాతం ఇన్సెంటివ్ చెల్లిస్తున్నారని, అయితే ఇద్దరి కృషి సమానమే కాబట్టి చెల్లింపులు కూడా సమానంగా ఉండాలని యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు పలిశెట్టి దామోదరరావు, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జి.వి. నరసయ్య ఒక ప్రకటనలో పేర్కొన్నారు. మంగళవారం ఆర్టీసీ విసి, ఎండి ద్వారకా తిరుమలరావు, ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ (ఆపరేషన్) అందవరపు అప్పలరాజులకు లేఖలు అందజేసినట్లు తెలిపారు. "స్త్రీశక్తి" పథకం అమలు తర్వాత డైలీ డ్యూటీల్లో మంచి ఇన్సెంటివ్‌లు వస్తున్నప్పటికీ డ్రైవర్లకు తక్కువ శాతం రావడం వల్ల తీవ్ర అసంతృప్తి నెలకొన్నదని వారు అన్నారు. విలీనం తర్వాత పెండింగ్‌లో పెట్టిన అల్ట్రా పల్లె వెలుగు, సప్తగిరి సర్వీసులకు కూడా ఇన్సెంటివ్‌లు చెల్లించేలా యూనియన్ నిరంతర కృషితో యం.డి ఆదేశాలు ఇచ్చినందుకు సిబ్బంది సంతోషం వ్యక్తం చేస్తున్నారని తెలిపారు. డ్రైవర్లలో ఉన్న అసంతృప్తిని నివారించేందుకు, కండక్టర్లతో సమానంగా ఇన్సెంటివ్ చెల్లించేలా వెంటనే చర్యలు తీసుకోవాలని ఈ.యూ రాష్ట్ర కమిటీ విజ్ఞప్తి చేసింది.

# మంత్రి నారా లోకేష్ చొరవతో కృష్ణా పశ్చిమ డెల్టా ఆధునికీకరణ

○ డెల్టా ఆధునికీకరణకు రూ. 7.32 కోట్ల నిధులను మంజూరు చేసిన కూటమి ప్రభుత్వం

○ రైతాంగానికి ఆధునికీకరణ గొప్ప వరం

○ హర్షం వ్యక్తం చేస్తున్న అన్నదాతలు

○ కృష్ణా పశ్చిమ డెల్టా ఆధునికీకరణకు నిధులు మంజూరు చేయించిన మంత్రి లోకేష్ కు కృతజ్ఞతలు



**మంగళగిరి (జర్నలిస్ట్ ఫైల్):** కృష్ణా పశ్చిమ డెల్టాలో సాగు, మురుగునీటి కాలువలకు కూటమి ప్రభుత్వంలో మహర్దశ పట్టనుంది. వైకాపా పాలనలో జల వనరుల శాఖ తీవ్ర నిర్లక్ష్యానికి గురైంది. కాలువల నిర్వహణను గాలి కొదిలేసింది. లాకుల వంతెనలు శిథిలావస్థకు చేరినా, తుప్పు పట్టిన షట్టర్లు కొట్టుకుపోయి సాగునీరు సముద్రం పాలైనా అధికారులు చోద్యం చూశారు. రైతులు ఎదుర్కొంటున్న సాగు, ముంపు సమస్యలు పరిష్కరించడానికి ప్రస్తుత కూటమి ప్రభుత్వం నిధులను కేటాయించింది.

నియోజకవర్గ ఎమ్మెల్యే, రాష్ట్ర ఐటీ, విద్యాశాఖల మంత్రి నారా లోకేష్ ప్రత్యేక చొరవతో కృష్ణా పశ్చిమ డెల్టా ఆధునికీకరణ నిమిత్తం కూటమి ప్రభుత్వం రూ. 7.32కోట్ల నిధులను విడుదల చేసింది. మంగళగిరి నియోజకవర్గ పరిధిలోని దుగ్గిరాల మండలం కంఠంరాజు కొండూరు బ్రాంచ్ కెనాల్ పై కల్వర్టు పునర్నిర్మాణం నిమిత్తం రూ. 20లక్షలు, రేవేంద్రపాడు వద్ద కె.డబ్ల్యు బ్యాంక్ కెనాల్ హెడ్ స్లూయిస్ అప్ స్ట్రీమ్ రక్షణ గోడల మరమ్మతు, పునరుద్ధరణ కు రూ. 30.60లక్షలు, దుగ్గిరాల వద్ద కె.డబ్ల్యు.డి ప్రధాన కాలువపై కొమ్మమూరు హెడ్ స్లూయిస్ డి/ఎస్ వద్ద ఆప్రాన్ మరమ్మతులు, పునరుద్ధరణ నిమిత్తం రూ. 51.30లక్షలు, రేవేంద్రపాడు కె.డబ్ల్యు. బ్యాంక్‌కెనాల్ హెడ్ స్లూయిస్ డి/ఎస్ వద్ద రిటైనింగ్ వాల్స్ మరమ్మతులు, పునరుద్ధరణ నిమిత్తం రూ. 77.30 లక్షలు, దుగ్గిరాల లోని కొమ్మమూరు కాలువ కుడి ఒడ్డుకు రిటైనింగ్ గోడల మరమ్మతులు, పునరుద్ధరణ కు రూ. 51.60 లక్షలు, దుగ్గిరాలలోని అలీ నగర్ కొమ్మమూరు కాలువ రిటైనింగ్ వాల్ నిర్మాణానికి రూ. 2.06 కోట్ల నిధులను మంజూరు చేశారు. గుంటూరు ఛానల్ ప్రధాన కాలువపై గట్ల బలోపేతానికి రూ. 73.90లక్షలు, మంగళగిరి నియోజకవర్గ పరిధిలోని ఆత్మకూరు మేజర్ లోని గుంటూరు ఛానల్‌లోని ఆఫ్ టేక్ స్లూయిస్ మరమ్మతులకు రూ. 23.05 లక్షలు, మంగళగిరి నగరంలోని 16వ నెంబరు జాతీయ రహదారి ఏపీఎస్పీ బెటాలియన్ కాంపౌండ్ నుంచి బైపాస్ సర్వీస్ రోడ్డు వరకు స్థానిక వాగుకు అత్యవసర పనుల నిర్మాణానికి రూ. 42.10లక్షలు, దుగ్గిరాల మండలం చిలువూరు గ్రామ పరిధిలోని పాత టిబి డ్రెయిన్ పై రిటైనింగ్ వాల్ నిర్మాణం నిమిత్తం రూ. 1.20 కోట్లు, దుగ్గిరాల మండలం దంతలూరు కోడు మీడియం డ్రెయిన్ పై రిటైనింగ్ వాల్ నిర్మాణానికి రూ. 36.62లక్షల నిధులను కూటమి ప్రభుత్వం విడుదల చేసింది. గత వైకాపా పాలనలో వివిధ కారణాలతో కృష్ణా పశ్చిమ డెల్టా ఆధునికీకరణ పనులు అటకెక్కాయి. అంతక ముందు అనేక సంవత్సరాలుగా కృష్ణా డెల్టా ఆధునికీకరణ ప్రతిపాదనలు, పనులకు ఆటంకాలు కొనసాగుతూనే ఉన్నాయి. ఈ నేపథ్యంలో అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం కృష్ణా డెల్టా ఆధునీకరించడం ద్వారా రైతులకు సాగునీటి సరఫరాను మెరుగుపరచాలనే లక్ష్యంతో నిధులు మంజూరు చేయడంతో అన్నదాతలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. కృష్ణా పశ్చిమ డెల్టా ఆధునికీకరణ కు నిధులు మంజూరు చేయించిన రాష్ట్ర ఐటీ, విద్యాశాఖల మంత్రి నారా లోకేష్ కు కృతజ్ఞతలు తెలుపుతున్నారు.

## ఎమ్మెల్యే గళ్ళా మాధవి విజ్ఞప్తి మేరకు 3 సబ్ స్టేషన్లు మంజూరు చేసిన మంత్రి గొట్టిపాటి రవి

**గుంటూరు (జర్నలిస్ట్ ఫైల్):** గుంటూరు పశ్చిమ నియోజకవర్గంలో కొత్తగా మూడు(3), 33/11కేవీ సబ్ స్టేషన్లు ఏర్పాటు చేయాలని గుంటూరు పశ్చిమ నియోజకవర్గ ఎమ్మెల్యే గళ్ళా మాధవి విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవిని కోరారు. మంగళవారం ఆయనను మర్యాదపూర్వకంగా కలసి సబ్ స్టేషన్ల ఏర్పాటు కోసం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే గళ్ళ మాధవి, మంత్రి గొట్టిపాటి రవితో మాట్లాడుతూ... గుంటూరులో విద్యుత్ డిమాండ్ రోజు రోజుకీ పెరుగుతోందని, వేసవి కాలంలో 11కేవీ ఫీడర్లు ఓవర్ లోడ్ అవ్వడం వల్ల తక్కువ వోల్టేజ్ సమస్యలు వస్తున్నాయని మంత్రి దృష్టికి తీసుకువెళ్లారు. రాజధాని సమీపంలో ఉన్న గుంటూరు నగరం వేగంగా విస్తరిస్తోందని, భవిష్యత్తులో మరింత డిమాండ్ పెరగబోతోందని దృష్టిలో పెట్టుకొని 24 గంటలు నిరంతరాయంగా మంచి వోల్టేజ్ తో కరెంట్ సరఫరా అందించాలంటే కొత్త సబ్ స్టేషన్లు అత్యవసరమని తెలిపారు. కాబట్టి ఏటీ అగ్రహారం, జడ్పీ.కాంపౌండ్, సంపత్ నగర్ సబ్ స్టేషన్లు మంజూరు చేయాలని కోరగా, వెంటనే మంత్రి గొట్టిపాటి రవి సబ్ స్టేషన్ల ఏర్పాటుకు ఆమోదం తెలిపారు. అయితే లో ఓల్టేజి సమస్య దృష్ట్యా, రెండు సబ్ స్టేషన్ పనులు వెంటనే ప్రారంభించాలని ఎమ్మెల్యే గళ్ళా మాధవి కోరగా, మంత్రి గొట్టిపాటి రవి సానుకూలంగా స్పందించి తక్షణ చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ఈ సబ్ స్టేషన్లు పూర్తికావడం ద్వారా గుంటూరు పశ్చిమలో వోల్టేజ్ సమస్యలకు శాశ్వత పరిష్కారం లభిస్తుందని, ప్రజలకు నాణ్యమైన విద్యుత్ సరఫరా అందుతుందని ఎమ్మెల్యే గళ్ళా మాధవి ఆశాభావం వ్యక్తం చేశారు.



## డీఎస్సీ కంటే ముందుగా లాంగ్వేజ్ పండిట్లు, పీడీలకు పదోన్నతులు కల్పించాలి

○ నవ్యాంధ్ర టీచర్స్ అసోసియేషన్

**అమరావతి (జర్నలిస్ట్ ఫైల్):** రాష్ట్ర పాఠశాలల్లో ఉపాధ్యాయుల కొరత కారణంగా విద్యా నాణ్యత దెబ్బతింటోందని నవ్యాంధ్ర టీచర్స్ అసోసియేషన్ ఆందోళన వ్యక్తం చేసింది. విద్యార్థుల భవిష్యత్తు దృష్ట్యా ప్రభుత్వం తక్షణ చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేసింది. సంఘం నాయకులు కరణం హరికృష్ణ, మాగంటి శ్రీనివాసరావు సంయుక్త ప్రకటనలో తెలిపారు.

డీఎస్సీ నియామకాల కంటే ముందుగా లాంగ్వేజ్ పండిట్లు, పీడీలకు పదోన్నతులు కల్పించాలన్నారు. ప్రస్తుతం కేవలం 1100 మంది మాత్రమే అగైనెస్ట్ పోస్టుల్లో తిరుగుతూ ఇబ్బందులు పడుతున్నారని, వీరిని అధిక ఎన్రోల్మెంట్ ఉన్న పాఠశాలల్లో సర్దుబాటు చేయాల ని కోరారు. ఉపాధ్యాయులపై ఉన్న పని భారాన్ని డీఎస్సీ నియామకాల ద్వారా తగ్గించాల్సిన అవసరం ఉందని, విద్యాహక్కు చట్టం ప్రకారం వారానికి గరిష్టంగా 32 పీరియడ్లకే పరిమితం చేయాలని డిమాండ్ చేశారు. ఒక సెక్షన్‌లో గరిష్టంగా 40 మంది విద్యార్థులకే అవకాశం ఇవ్వాలని, 40 దాటితే రెండో సెక్షన్, 80 దాటితే మూడో సెక్షన్‌గా పరిగణించాల్సిందిగా పేర్కొన్నారు. మోడల్ ప్రాథమిక పాఠశాలలో 200 మంది విద్యార్థులు దాటితే ప్రతి తరగతికి రెండు సెక్షన్లు ఏర్పాటు చేసి కనీసం 10 ఎస్జీటీలు, ఒక హెడ్‌మాస్టర్‌ను నియమించాలని సూచించారు. ఉన్నత పాఠశాలలో 250మంది విద్యార్థులు దాటితే 10 సెక్షన్లకు 14o2 స్టాఫ్ ప్యాటర్న్ అమలు చేయాలని, 450 మందికి మించితే 15 సెక్షన్లకు అనుగుణంగా సిబ్బందిని పెంచాలని కోరారు. బదిలీల్లో రిలీవర్ లేక పాత పాఠశాలలోనే పనిచేస్తున్న ఉపాధ్యాయులను వెంటనే రిలీవ్ చేయాలని, క్లస్టర్ స్థాయిలో రిజర్వ్‌గా ఉన్న ఉపాధ్యాయులను సబ్జెక్టు వారీగా నియమించాలని డిమాండ్ చేశారు. ఉపాధ్యాయుల కొరత వల్ల విద్యార్థుల భవిష్యత్తు ప్రభావితం కాకుండా ఉండేందుకు అంతర్ జిల్లా బదిలీలు, పదోన్నతులు వెంటనే కల్పించి అనంతరం డీఎస్సీ నియామక ప్రక్రియ పూర్తి చేయాలని వారు స్పష్టం చేశారు.

## మానవత్వానికి చిరునామా పవన్ : ఎమ్మెల్యే నసీర్

○ పవన్ పోరాటం నేటి తరానికి స్ఫూర్తి

○ గెలుపోటములను సమానంగా స్వీకరించే వ్యక్తిత్వం

○ పవన్ జన్మదినం సందర్భంగా కేక్ కట్ చేసిన గుంటూరు తూర్పు ఎమ్మెల్యే నసీర్



**గుంటూరు (జర్నలిస్ట్ ఫైల్):** డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ మానవత్వానికి, మంచితనానికి చిరునామా అని గుంటూరు తూర్పు ఎమ్మెల్యే, అసెంబ్లీ మైనారిటీస్ కమిటీ చైర్మన్ నసీర్ అన్నారు. పవన్ కళ్యాణ్ జన్మదినోత్సవం సందర్భంగా మంగళవారం స్థానిక తూర్పు శాసనసభ్యుల వారి కార్యాలయంలో జనసేన నాయకులు బోనబోయిన శ్రీనివాస యాదవ్ , కూటమి నేతలతో కలిసి ఎమ్మెల్యే నసీర్ కేక్ కట్ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే నసీర్ మాట్లాడుతూ పవన్ కళ్యాణ్ ఒక అసాధారణమైన వ్యక్తి అని అసామాన్యంగా ఎదిగిన నాయకుడని అన్నారు. పవన్ కేవలం నటుడు మాత్రమే కాదని, ఒక తరం యువతకు స్ఫూర్తినిచ్చిన నేత అని కొనియాడారు. ఆయన నటనలో ఒక సహజత్వం, నిబద్ధత కనిపిస్తాయని, ఇది నిజ జీవితంలోనూ ఆచరించి చూపుతారని అన్నారు. సమాజానికి ఏదైనా చేయాలనే తపనతో రాజకీయాల్లోకి అడుగుపెట్టి గత ఎన్నికల్లో వంద శాతం విజయాలు సాధించారని చెప్పారు. ఆయన ఓడిపోయినప్పుడు కుంగిపోలేదని, గెలిచినప్పుడు పొంగిపోలేదని పేర్కొన్నారు. అందుకే పవన్‌ను ఒక బ్రాండ్ ఇమేజ్ గా అభిమానులు వర్ణిస్తారని చెప్పారు. సమాజం పట్ల ఆయనకు లోతైన అవగాహన ఉందని అన్నారు. ఈ కార్యక్రమంలో గుంటూరు తూర్పు నియోజకవర్గం పరిశీలికలు గంజం రాఘవేంద్ర, దాసరి రాజా మాస్టర్, జాగర్లమూడి శ్రీనివాసరావు, కార్పొరేటర్ శంకురి శ్రీనివాసరావు, డాక్టర్ సనక్కాయల ఉమా శంకర్, గోళ్ళ ప్రభాకర్, ఐల శ్రీనివాసరావు, కొనకళ్ళ సత్యం, వంగర ఏడుకొండలు, చెల్లా ఆంజనేయ ప్రసాద్, హఫీజ్, పోతురాజు చంద్ర, వెల్చూరి కిరణ్, జానీ, చిలక వెంకటేశ్వర్లు, రబ్బాని, రియాజ్, మొవ్వ శైలజ, ఉస్మాన్, జబి, వీరారెడ్డి, బ్రహ్మ సాని శ్రీనివాసరావు, తదితరులు పాల్గొన్నారు.

## సూపర్ లీగ్ సిటీస్‌లో మెరిసిన గుంటూరు



**గుంటూరు (జర్నలిస్ట్ ఫైల్):** స్వచ్ఛ సూపర్ లీగ్ సిటీస్‌లో గుంటూరు నగరం జాతీయస్థాయిలో ఉత్తమ స్థానాన్ని సాధించింది. ఈ విజయాన్ని అధ్యయనం చేసేందుకు గుజరాత్, ఇండోర్, చండీఘర్‌ల నుంచి బృందాలు త్వరలో గుంటూరుకు రానున్నాయి. నగరాన్ని మరింత సుందరంగా తీర్చిదిద్దడంలో ప్రజలు, ప్రజాప్రతినిధులు, అధికారులు, సచివాలయ కార్యదర్శులు, ప్రజారోగ్య కార్మికులు సమిష్టిగా కృషి చేయాలని కమిషనర్ పులి శ్రీనివాసులు సూచించారు.

మంగళవారం వెంకటేశ్వర విజ్ఞాన మందిరంలో కార్పొరేటర్లు, విభాగాధిపతులు, అధికారులు, సచివాలయ కార్యదర్శులతో నిర్వహించిన ప్రత్యేక సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన ఐవీఆర్ఎస్, సచివాలయ విభాగ సర్వేలలోనూ గుంటూరు ప్రతిభ చూపిందని, ప్రజల సహకారం, కార్మికుల కృషి దీనికి మూలమని చెప్పారు. సాధించిన స్థానాన్ని నిలబెట్టుకోవడమే కాక మరింత ముందుకు తీసుకెళ్లాలని పిలుపునిచ్చారు.

ఇంటింటి చెత్త సేకరణ, వర్మీ కంపోస్టుల తయారీ, కొబ్బరిబొండాల ప్రాసెసింగ్ యూనిట్, వ్యర్థాల విభజన, తరలింపు వంటి అంశాలపై గుంటూరులో అమలు జరుగుతున్న విధానాలను అధ్యయనం చేయడానికి జాతీయ బృందాలు రానున్నాయని తెలిపారు. ఈ నేపథ్యంలో పారిశుధ్య విభాగం మరింత నిబద్ధతతో పనిచేయాలని, కార్పొరేటర్ల మార్గదర్శకత్వంలో సమర్థవంతంగా విధులు నిర్వర్తించాలని కమిషనర్ సూచించారు.

సమావేశంలో అదనపు కమిషనర్ చల్లా ఓబులేసు, డిప్యూటీ కమిషనర్లు డి. శ్రీనివాసరావు, సి. హెచ్. శ్రీనివాస్, టి. వెంకట కృష్ణయ్య, సిటీ ప్లానర్ రాంబాబు, ఇన్‌చార్జ్ యస్. ఈ. సుందరరామి రెడ్డి, ఇన్‌చార్జ్ యం. హెచ్. ఓ. రామరావు, కార్పొరేటర్లు, అధికారులు పాల్గొన్నారు.

## డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్‌కు పుట్టినరోజు శుభాకాంక్షలు తెలిపిన మంత్రి సత్యకుమార్



**అమరావతి(జర్నలిస్ట్ ఫైల్):** రాష్ట్ర డిప్యూటీ ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ జన్మదినం సందర్భంగా వైద్యారోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ శుభాకాంక్షలు తెలిపారు. పదికాలాల పాటు ప్రజాసేవ కొనసాగించేలా ఆయురారోగ్యాలతో పవన్ కళ్యాణ్‌ను భగవంతుడు కాపాడాలని ప్రార్థిస్తున్నానని పేర్కొన్నారు. ప్రజాశ్రేయస్సుపై ఆయనకున్న తపన, ఆలోచనలు రాష్ట్ర సమగ్రాభివృద్ధికి చిరకాలం అండగా నిలుస్తాయని ఆశాభావం వ్యక్తం చేశారు. రాష్ట్ర ప్రజల ఆశలు నెరవేర్చే దిశగా ఆయన నిరంతర కృషి కొనసాగాలని మంత్రి ఆకాంక్షించారు.

# అంగ రంగ వైభవంగా జనసేనాని జన్మదిన వేడుకలు

○ కాకుమాను లో జనసేన మండల నాయకులు, కొసన.సురేష్ నేతృత్వంలో వేడుకలు

○ పాల్గొన్న అతిరధ మహారధులు

○ అందరికీ ఆదర్శనీయుడు డిప్యూటీ సిఎం :ఎంఎల్ఏ రామాంజనేయులు



**కాకుమాను,(జర్నలిస్ట్ ఫైల్):** ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర డిప్యూటీ సిఎం,జనసేన పార్టీ అధ్యక్షులు కొణిదెల. పవన్ కళ్యాణ్ జన్మదిన వేడుకలు కాకుమాను మండలంలో అంగరంగ వైభవంగా నిర్వహించారు. జనసేనా పార్టీ సీనియర్ నాయకులు కొసన. సురేష్ బాబు నేతృత్వంలో కాకుమాను గ్రామంలో భారీ స్థాయిలో వేడుకలు నిర్వహించారు. ఈ కార్యక్రమం లో ఉమ్మడి కూటమి కి చెందిన అతిరథ మహారథులు హాజరయ్యారు. ఈ కార్యక్రమ లో భాగంగా ముఖ్య అతిథిగా హాజరైన ప్రత్తిపాడు నియోజకవర్గ శాసనసభ్యులు డా. బూర్ల. రామాంజనేయులు పాల్గొని మాట్లాడుతూ పవన్ కళ్యాణ్ నటన తో యావత్ తెలుగు రాష్ట్రాలలో ఒక ప్రత్యేక స్థానం కలిగి ఉన్నారని అన్నారు. తొలి నుండి ఎన్నో ఒడిదుడుకులను ఎదుర్కొని ఉన్నత శిఖరాలకు చేరుకున్నారన్నారు. సమాజ సేవ చేయాలని ధృఢ సంకల్పంతో రాజకీయాల్లోకి వచ్చిన నాటి నుండి కూడా ప్రజలతో కలిసి నడుస్తూ రాష్ట్ర ప్రజల అభిమానాన్ని పొందరన్నారు. గత పాలనలో చంద్రబాబు ను అక్రమంగా అరెస్టు చేసిన సమయంలో పెద్దరికంగా నిలబడ్డారని అన్నారు. మాట మీద నిలబడి ఉండే మహోన్నతమైన వ్యక్తి పవన్ కళ్యాణ్ అని అన్నారు. నేడు డిప్యూటీ సిఎం గా రాష్ట్ర ప్రజలకు నిస్వార్థంగా సేవలందిస్తున్నారన్నారు. నేటి తరం యువత కు పవన్ కళ్యాణ్ స్ఫూర్తిగా నిలుస్తున్నారాన్నారు. ఈ సందర్భంగా కేక్ కటింగ్ నిర్వహించారు.

వేడుకలలో భాగంగా గ్రామానికి చెందిన వితంతు మహిళలకు కొసన . సురేష్ బాబు అందించిన చీరలను ముఖ్య అతిథుల చేతుల మీదుగా పంపిణీ చేశారు. కోలాటం ప్రత్యేక ఆకర్షణ గా నిలిచింది. ఈ సందర్భంగా అత్యంత ఘనంగా డిప్యూటీ సిఎం జన్మదిన వేడుకలను అందరినీ కలుపుకుంటూ సమాజ సేవ దృక్పథంతో కార్యక్రమం లు నిర్వహించడం పట్ల కొసన. సురేష్ బాబు ను పలువురు ప్రత్యేకంగా అభినందనలు తెలియజేశారు. ఈ కార్యక్రమం లో ఉమ్మడి కూటమి నాయకులు కుర్రపాటి. నాగేశ్వరరావు, జానసేనా అధికార ప్రతినిధి కన్నా. రజినీ, రాయపాటి. అరుణ, ఉగ్గిరాల. సీతారామయ్య, వడ్రాణం. హరిబాబు, గుంజుపల్లి. వేంకటేశ్వర రావు, దేగల. ప్రభాకర్, గద్దం. శ్రీనివాసరావు, మామిళ్ళ పల్లి. రాం గోపాల్, కొసన. సురేష్, పూర్ణ చంద్ర రావు,నక్కల. అగస్టిన్, వెంకట లక్ష్మీ, శ్రీధర్ శర్మ,ఆది లక్ష్మీ,పలువురు నాయకులు తదితరులు పాల్గొన్నారు.

Edited, Printed and Published by D.Ajay at Express Printers and Publishers D.No. 3-28-1, Brundavan Gardens, Guntur (A.P)-522006. RNI No. 52813/1993.
Administration Office : 126-352, Between 4th & 5th lanes , Kodandarama Nagar, Gorlavaripalem Donka, Gorantla, Guntur (AP)-522034. Ph 8106539118, 7416812467